AB_may_1934_2_1

(5)

# యుగాది కానుక

౧

శ్రీకార మధురశ్రేయోనిధాన మ
వ్యాహతార్థమ్ము నీ అంగరక్ష
కవికుమారకసుధాగానమాధురి చెమ్మ
తేలిన ప్రకృతి నీ పూలరథము
మునిమాపు ప్రొద్దు విచ్చిన కమ్మ సంపెగ
పూవుల తావి నీ పోవుబాట
కడుపార కన్నబిడ్డడు నిద్రవో తల్లి
'హాళిహాళాహాయి!' నీ ఉబుసుపోక

కొలదికాలమ్మునందె 'ఊ' కొట్టు సరస
జనుల ప్రోవు చేసినది నీ జన్మఘడియ
అలరుదువు ముద్దుబిడ్డ! ఓ 'ఆంధ్రభూమి!'
ఆంధ్రజను లుండుదాక ఇయ్యాంధ్రభూమి.

౨

ఇది యుగాది- శుభోదయ మెల్లయాంధ్ర
భూమి కిద్ది; ప్రేమామృతమ్మున మునింగి
తేలు తండ్రికి బిడ్డల మేలు గోరి
కాన్కలంపకుండుట చేతగాని ప్రొద్దు.

—ఆంధ్రపుత్రుడు.

# ఎడ్వర్డు బాక్

[ఇరువదిలక్షలమంది చందాదారులుగల 'లేడీస్ హోమ్ జర్నలు'కు సంపాదకుడు.]

క్రీస్తుశకము 1870-వ సంవత్సరమున డచ్చి దేశము నుండి బాక్కు కుటుంబము న్యూయార్కు-పట్టణమునకు వెళ్ళెను. తల్లి, తండ్రి, నలుగురు పిల్లలు—ఈ బాక్కు కుటుంబమున మొత్తము ఆర్గురు. అదిలో ఈ కుటుంబము ఐశ్వర్యవంతమైనదే. కాని పోరాని పెట్టుబడి వ్యాపారములకు పోయి ఆ కుటుంబపు యజమాని కల ధనమెల్ల గోలుపోయెను. ఆతనికి స్వదేశమున ఇక భుక్తి జరుగుటకు మార్గము కానరాలేదు. అగుట నాతడు సకుటుంబముగ బయలుదేరి అమెరికా దేశమునకు వచ్చి చేరెను. ఆ క్రొత్తదేశమున దినవెచ్చము గడపుట తండ్రికి కష్టమయ్యెను. రెండవ ఆడుదాని ఆసరాలేక తల్లికి ఇంటిపని చేసికొనుటయు కష్టమయ్యెను. అర్థము, అన్నము రెండును ఆయింట ఉండీఉండని స్థితిలో నుండెను. మన ప్రస్తుతకథకు నాయకుడగు ఎడ్వర్డు బాక్కు అప్పటికి ఏడేండ్లబాలుడు. పాలవంటి ఆ పసితనముననే ఎడ్వర్డు తన తండ్రి డబ్బుకొఱకును, తన తల్లి అన్నము కొఱకును పడుచున్న బాములను పరికించెను. సుఖజీవనమునకు అర్థము, అన్నము ముఖ్యావసరములనుట ఆ ఏడేండ్లబాలునకు బాగుగ అవగతమయ్యెను. తాను తలిదండ్రులకు ఎట్లు సాయపడగలను అనునదియే ఆ బాలుని ఆలోచన.

తొలుత తల్లికి చేదోడుకాగల వీలు ఆతనికి కనిపించెను. తూర్పు తెల్లవారగట్లనే లేచి, ప్రొయ్యి రాజబెట్టి, ప్రొద్దుటి వంటచేసి, అన్నము పెట్టుకొని తిని, కంచము కడిగి పిమ్మట ఆ బాలుడు పాఠశాలకు పోవువాడు. బడి వదలిన తరువాత—సాయంకాలము—తన తోడిబాలుర ఆటలకుబోవ నాతడు నేరుగా ఇంటికి వచ్చి పడుకకు బోవువఱకు వంటపనులు చేయువాడు. ఆతనిని చూచి ఆతని యన్నయు అట్లే చేయదొడగెను. పసితనమున ఇట్లు గృహనిర్వాహకమునందు కలిగిన అనుభవము ఎడ్వర్డు బాక్కునకు-ఆతడనుకొనని రీతిని స్త్రీలపత్రికకు సంపాదకుడైనపుడు బాగుగ నుపకరించెను.

ఇంటిపనులు చేయుటచే తల్లి భారమును తగ్గించినాడు. ఇక ధనసంపాదనమునకు ప్రారంభము చేసి తండ్రి భారమును తగ్గింపవలసియున్నది. దీర్ఘముగ ఆలోచించినాడు. దిక్కులు పరికించినాడు. ఎదుట ఒక రొట్టెలమ్మువాని దుకాణము గలదు. ఆ దుకాణపు గవాక్షములు మసిబారియుండెను. వానిని శుభ్రము చేయుటో నా వర్తకు డేమైన నీయడా? ధనసంపాదనకు బాక్కు అన్వేషించిన మార్గములలో నిది మొదటిది దానినందుకొని ఆతడు వెంటనే కార్యాచరణకు గడంగినాడు.

బాక్కు ఆ రొట్టెలమ్మువాని దుకాణము లోనికి బోయెను. వర్తకునకు తన ఉద్దేశ్యము నెఱింగించెను. వర్తకు డంగీకరించెను. బాక్కు చురుకుగ గవాక్షములను శుభ్రము చేయుటకు ప్రారంభించెను. ఆ బాలుని చురుకుదనమును,పనిచేయుటయందు ఆతనికి గల శ్రద్ధను గమనించి ఆ వర్తకుడు వారమునకు రెండుసారులువచ్చి ఆ బాలుడు గవాక్షములు తుడుచునట్లును, అందుకుగాను తాను వానికి వారమునకు ఏబదిసెంట్లు జీతము ఇచ్చుటకును ఏర్పాటుచేసెను. ధనసంపాదనకు ప్రారంభమైనది. కాని అది ప్రారంభము మాత్రమే. ఆ జీతపు రాళ్ళతో నాతనికి తృప్తి కలుగలేదు. కావున నాతడు ఇంకను హెచ్చు జీతము తెచ్చుకొనుటకు ప్రయత్నములు సాగించుచుండెను. ఒకనాడు ఆ రొట్టెలమ్ము దుకాణములో ఎప్పటితీరున నాతడు కిటికీటీలు తుడిచి—బయటికి పోయియున్న ఆ దుకాణదారు రాకకై వేచియుండెను. ఈలోగా రొట్టెకొనుటకు ఒక కాతాదారువచ్చెను. యజమాని వచ్చువఱకు ఆతనిని నిలిపియుంచుట వ్యాపారము గాదని సూక్ష్మబుద్ధిగల బాక్కు గ్రహించి ఒక రొట్టె నెత్తి దానికి ఒడుపుగ ఉల్లిపొరకాగితముచుట్టి ఆతని కిచ్చెను. ఇట్లు ఆతడు ఇచ్చుచుండుసమయముననే రొట్టెల వర్తకుడు

వచ్చెను. బాక్కు చేసినపనిని చూచి పట్టరాని సంతోషమునొంది వర్తకుడు అతడు ప్రతిదినము మధ్యాహ్నము వచ్చి తన దుకాణమున రొట్టెలమ్ముచుండుటకును, అందుకు వారమునకు ఒక డాలరు ఇచ్చుటకును ఏర్పాటు చేసికొనెను.

శనివారము మధ్యాహ్నమున తప్ప మిగిలిన దినముల మధ్యాహ్నము అందు వచ్చి వర్తకుడు చెప్పిన చొప్పున పనిచేయుటకు బాక్కు అంగీకరించెను. శనివారము ప్రత్యేకముగ పనిచేసి ధనమార్జించుటకు అతనికి మఱి రెండు మార్గములు పొడకట్టెను. శనివారముపాఠశాలకు సెలవు. కావున ఆనాడు ప్రొద్దుటి పూటఇంటింటికి వార్తాపత్రికలను కొనిపోవు పని యొకటి. ఇందువలన అతనిరాబడి రెండున్నర డాలర్లు పెరిగెను.ఇక రెండవది మధ్యాహ్నము పూట చేయుటకు. ఆపనియెట్టిది ?

అత డాకాలమున బ్రూక్లిన్‌లో నివసించుచుండెను. ఒక తావునుండి మఱియొక తావునకు ఆ ప్రాంతమున అద్దెకు తిరుగు గుఱ్ఱపు బండ్లను బ్రూక్లిన్ కూడలిగా నుండెను. ఎడ్వర్డు బాక్ ఇంటికి సమీపముననే గుఱ్ఱములకు నీరుపట్టుతావు. ఎండవేళల యందు అచటికి వచ్చు ప్రయాణికులు సాధారణముగ దప్పిగొన్నవారై ఉండుట సహజము. గుఱ్ఱములు నీళ్ళుత్రాగి తిరిగి బండికి పూన్చబడి పట్టణములోనికి బోవు వఱకును ప్రయాణికులు తమ దాహములు తీర్చికొనుటకు అచట సౌకర్యములు లేకుండెను. తన తల్లి యొక్క అదీర్ఘ ధనము సంపాదించుటకు ఇందులో ఒక చక్కని అవకాశము బాక్కునకు పొడగట్టెను. చిన్న పొడుగు పాటి కుండ నొకదానిని కొనెను. దాని ప్రక్కలను ఇనుప తీగెతో చేసిన మూడు చిన్న ఉట్లను వ్రేలాడదీసెను. ఆ ఉట్లలో ఒక్కొక్క దానియందు ధవళధవళమైన ఒక్కొక్కగాజు గ్లాసు ఉంచెను. ఒక శనివారము మధ్యాహ్నము తన యింటి సమీపమున గుఱ్ఱపు బండి ఆగినపుడు యుక్తిపరుడు బాక్కు కండక్టరు కడకు పోయి 'కొంచము దాహము తీసికొనరా' అని అడిగి మంచుగడ్డతో చల్లబఱుప బడిన ఒక గ్లాసు మంచి నీళ్ళను అతని కిచ్చెను చల్లటినీళ్ళు. గ్లాసు ఒకసెంటు. ప్రయాణికులు ఎగబడికొనిరి. రెండేసి గుఱ్ఱపు బండ్లకు తన కుండ ఖాళీయగుచుండెను. ఒక్కొక్క కుండలో ముప్పది గ్లాసుల నీళ్ళు. ప్రయాణికులకు నీళ్ళను, బాక్కునకు ముప్పది సెంట్లును ఒక్క శని, ఆదివారములలో అతనికి ఈ నీళ్ళవర్తకము వలన ఆరుడాలర్ల లాభము వచ్చుచుండెను. ఇతర బాలు రిది చూచిరి.ఒక శనివారమున బాక్కునకు పోటీదారు డొకడు పొడ చూపెను. ఒకడితో తీరలేదు—ఇద్దరు, ముగ్గురు కూడ నైరి. సూక్ష్మబుద్ధితో బాక్కు ఈ పోటీ నెదుర్కొనెను. తన నీళ్ళకడవలో అరడజను నిమ్మకాయలు పిండెను, కొంచము పంచదార కలిపెను. వెల మూడు సెంట్లు పెంచెను. ఈ విధమున ఆ వ్యాపారమున అతడు తిరిగి గుత్తదారుడయ్యెను. 'నిమ్మనీరు—గ్లాసు మూడు సెంట్లు.' నీళ్ళు కొను ప్రయాణికుల కంటె నిమ్మనీరు కొను ప్రయాణికుల సంఖ్యయే హెచ్చుగా నుండెను.

తన ఈడుబాలురకంటె అప్పుడు బాక్కు హెచ్చుగనే ఆర్జించుచుండెను. కాని అత డింకను ఆర్జింప తలంపుకొనెను. ఆతని నిశితప్రతిభకు కొలదికాలముననే దనార్జనకు మఱియొక అవకాశము పొడగట్టెను. ఒకసారి ఒక వినోదగోష్ఠిసభకు అతనికి ఆహ్వానమువచ్చెను. ఆగోష్ఠిసభకు వచ్చినవారందఱును తమనామములు స్థానికపత్రికలో ప్రచురింపబడుట వాంఛింతురను సత్యము నాత డారసెను. కావున సభనుగూర్చిన వృత్తాంతముతో బాటు వచ్చినవారి నామములన్నియు వ్రాసెను. స్థానికపత్రికాధిపతికి అది అమ్మజూపెను. జర్నలిజములో అది ఆతని ప్రథమప్రయత్నము. సంపాదకుడు దానిని కొని పత్రికలో ప్రచురించెను. ఎవరినామములు పత్రికలో అచ్చుపడినవో వారెల్లరు విడికాపీలు కొనగలరను సత్యమును తెలిసికొని అసంపాదకుడు బాక్కు నిట్టి వృత్తాంతసంగ్రహమునకు పురికొల్పెను. తాను తన స్నేహితులు కలిసి అట్టివృత్తాంతములు సంగ్రహించుగారు. కాలమ్ ఒక్కంటికి నాలుగుడాలర్లు.

ఆశాజనకముగనేయున్నది—కాని ఒకవంక స్కూలు పాఠములు, విశ్రాంతితక్కువ. ఒకటి రెండు టరములు విద్యార్జనము ధనార్జనముకూడ సెఱప బాక్కు ప్రయ

త్నించెను. కాని సాధ్యము కాలేదు. ఒకనాడు అతడు తండ్రివద్దకుపోయి అచటి టెలిగ్రాఫ్‌కంపెనీలో ఒక ఖాళీఉన్నదనియు, దానికి దరఖాస్తుపెట్టుటకు అనుజ్ఞ నీయవలసినదనియు కోరెను. తనపుత్రుని చురుకుతనము, తెలివితేటలు తండ్రికి తెలియును. పాఠశాలలో నున్నను ప్రపంచవ్యవహారములందుతగిలియున్నను తన పుత్రుడు విద్యాసముపార్జనము గావింపగలడను నమ్మక ముండుటచే అతడు కోరినదానికి తండ్రి అంగీకరించెను. అప్పటికి బాక్కునకు పదమూడేండ్లు. పదమూడేండ్ల బాల్యముననే అతడు పాఠశాలకు స్వస్తిచెప్పెను.

పాఠశాల వీడినను భావికాలమున జయమునంద దలచినచో తాను ప్రపంచమున నేర్చుకొనవలసిన విషయములు పెక్కుగలవనుట మాత్ర మాతడు పొలుప్రూల లేదు. పేదవారై పుట్టి స్వబుద్ధిచే కీర్తివిస్తారులైన వారి జీవితచరిత్రలు చదువుట ప్రధానకృత్యముగ నాతడు భావించెను. స్థానికభాండారము నవలోడించి 'న్యూ అమెరికన్ సైక్లోపీడియా' అను గ్రంథమున అట్టి జీవిత చరిత్రము లుండుట యాతడు తెలిసికొనెను. ఆపుస్తకమును కొనుటయెట్లు? తాను ఉద్యోగిగానున్న కంపెనీ తనయింటికి ఐదుమైళ్ళదూరమున నున్నది. బండిపై వచ్చుచు పోవుచుండుటచే కొంతసొమ్ము వ్యయమగుచున్నది. నడచిపోవుచు ఆసొమ్ము, తానేల కూడబెట్టరాదు? ఫలహారము మానివైచిన మఱికొంతసొమ్ము కూడబెట్టవచ్చును. ఐదుమైళ్ళును నడచివెళ్ళి నడచి వచ్చువాడు. ఫలహారములులేవు. కొద్దివారములలో ఆ పుస్తకముయొక్క ప్రతియొకటి అతడు కొనుక్కొనగలిగెను. ప్రఖ్యాతినార్జించి అమెరికాదేశమున వెలుగొందుచు ఆగ్రంథమున కీర్తింపబడిన పలువురు ప్రముఖులు చిన్ననాడు తనవలెనే పేదవారైయుండిరి. ఈ విషయము అభివృద్ధినందవలయునను అతని తీవ్రకాంక్షకు మంచి దోహదమిచ్చెను.

గొప్పవారి జీవితచరిత్రలతో పరిచయమేర్పడినది. తరువాత వారిసంతకములు సమకూర్ప ఆతనికి కోరిక పుట్టెను. తనకడనున్న పుస్తకములో కీర్తింపబడినవారి కెల్లరకు లేఖలువ్రాసెను. వారు ప్రత్యుత్తరములు వ్రాయువారు. ఆఉత్తరములు ఆతనికి నిర్భరానంద మిచ్చునవి. వారివారి సంతకములకొఱకు అందు పలువురి పెద్దల దర్శన మాతడు చేయువాడు. వారివారినిగురించి ప్రచురింపబడు సకలవిషయములను చదువువాడు.

ఒకనాడు ఆత డొకవీధిలో నడుచుచుండగా ఆతని కొకసిగరెట్టు పెట్టెలోనుండు కార్డు దొరకెను. ఆకార్డుమీద ఒకతట్టున పేరుప్రాసిన ఒక సినీమానటి చిత్రము ముద్రితమైయుండెను. రెండవతట్టున ఏమియు లేదు. ఆప్రక్క ఖాళీగాఉంచనేల? ఆబొమ్మను గూర్చిన కొద్దివివరములు ఈతట్టున ముద్రించుచో ప్రజలీకార్డులయెడ హెచ్చుమక్కువ చూపుదురుగదా?

మఱునాడు అతడు సిగరెట్టు కార్డులు ముద్రించు కంపెనీకివెళ్ళెను. బొమ్మవెనుకతట్టున నూరు మాటలలో సమాప్తినొందు జీవితసంగ్రహము ప్రచురించుట విశేషప్రయోజనకరముగ నుండునని అతడు చెప్పెను. ఆకంపెనీమేనేజరునకు ఇది నచ్చెను. తొలుత నూర్గురి జీవితసంగ్రహములు వ్రాయుటకు ఒడంబడిక జరిగెను. అందుకు నఫాక్రింద బాక్కునకు ఒక్కొక్క జీవితమునకు పదేసిడాలర్లు ఇచ్చుటకు ఏర్పాటు.

మంచిసంపాదన. ఈఏర్పాటునకు బాక్కు సంతోషపూర్వకముగ అంగీకరించెను. వ్రాయవలసియున్న పలువురి జీవితవిషయములు తనకు ఈవఱకు కరబదరములై యున్నవే. మొదటి నూర్గురిజీవితములును అచిరకాలముననే ముగిసెను. మొదటినూరు తరువాత రెండవనూరు, పిమ్మట మూడవనూరు. సకాలమున వానిని తయారుచేసి యిచ్చుటకు బాక్కు తనకుతోడు ఈ పనియందు తనసోదరునికూడ నియమించెను. అతడు వ్రాసిన జీవితచరిత్ర ఒక్కింటికి ఒకపౌను ఇచ్చుటకు కట్టడి. ఇద్దఱు కలసినను పనితూగలేదు. మఱియిద్దరు ముగ్గురను నియమింపవలసివచ్చెను. ఆతనిచేతిక్రింద అయిదుగురు పనిచేయుచుండిరి. వారు వ్రాసియిచ్చినది తాను పరిమార్చి (సంపాదించి) కంపెనీవారికి ఇచ్చుచుండెను. వారానూరుమాటల జీవితసంగ్రహములను సిగరెట్టు కార్డులపై ముద్రించి దేశమున వెదజల్లుచు విజ్ఞాన ప్రచారము కావించువారు. సిగరెట్టుకార్డులమీద వెనుక

తట్టున ముద్రింపబడిన నూరుమాటల జీవితచరిత్రసంగ్రహములను సంపాదించి జర్నలిజములో ప్రథమపాత్రములం చేర్చి ప్రఖ్యాతివహించిన సంపాదకమహాశయులలో ఎడ్వర్డుబాక్కు మొదటివాడును, తుదివాడును.

ఇప్పు డాతనిస్పృష్టులు తిన్నగా జర్నలిజము పైకి ప్రసరింప నారంభించెను. కష్టపడి వ్రాసినది అచ్చుపడగా చూచుకొనినపుడు గలుగు ఆనందముతో సమమైన ఆనందము మఱిదేనివలనను అతనికి కలుగకుండెను కావున అతడు జర్నలిజమే తనకు పరమావధి యని కృతనిశ్చయు డయ్యెను. కాని జర్నలిజములో జయము నందుటకు షార్టుహ్యాండ్ వచ్చి యుండవలయును. కావున టెలిగ్రాపు ఆఫీసు వీడిన తరువాత ప్రతిదినపు రాత్రి యందును రెండు వివిధతావుల యందున్న షార్టుహ్యాండ్ తరగతులకు ఒకదాని యనంతరము మఱియొకదానికి బోవువాడు. త్వరగా నేర్చుకొనవలయునను తీవ్రకాంక్షతో అతడు ఒకేసారి రెండు తావుల షార్టుహ్యాండ్ అభ్యాసమునకు కడంగెను. ఈప్సితార్థమునకు బాలు హృదయరుచి తెలగిట్టిది.

అభ్యాసము పూర్తియైనది. బ్రూక్లిన్ నందలి ఒకానొక పత్రిక సంపాదకుడు బాక్కు సేవను కోరెను. అమెరికను అధ్యక్షుడు వచ్చి బ్రూక్లిన్‌లో ఉపన్యసింపనున్నాడు. ఆ ఉపన్యాసము షార్టుహ్యాండ్‌న వ్రాసికొని రావలయును. వ్రాసికొని రావలయునని గంపెడాశతో బాక్కు సభకు వెళ్ళెను. కాని అధ్యక్షుడు శరవేగమున ఉపన్యసించుచుండెను. షార్టుహ్యాండ్ కు తాను క్రొత్త. అందుకొనలేకపోయెను. సభముగిసినతోడనే బాక్కు తిన్నగా ఉపన్యాసకుడగు అధ్యక్షునికడకు వెళ్ళెను. నాడే తనకు షార్టుహ్యాండ్ రిపోర్టరు ఉద్యోగముదొరకుట, అదియే తృప్తికరముగా లేనిచో తనఉద్యోగమునకు పురిటిలోనే సందుకొట్టుట చెప్పుకొని అతని ఉపన్యాసము యొక్క కాపీఒకటి అర్థించెను. బాక్కు ప్రార్థనమునకు, అధ్యక్షుడు కరగెను; తన ఉపన్యాసముయొక్క కాపీ ఒకటి ఇచ్చెను. ఆఉపన్యాసము ఎట్టిలోపములులేకుండ ప్రచురింపగలిగినది బాక్కు పేపరు ఒక్కటే. అది తెలిసికొనినప్పటి బాక్ ఆనందమునకు అవధిలేకుండెను.

జర్నలిజములో బాక్కునకు జాసైన అనుభవము కలుగుచున్నది. అతనిపేరు పెద్దల సమావేశమున గూడ ఉచ్చరింపబడుచుండెను. ఒక వేసవిసెలవులలో అతడు బోస్టన్ నగరమునకు వెళ్ళెను. అచట నివసించుచున్న సుప్రసిద్ధ అమెరికన్ గ్రంథకర్త ఆలివర్ వెన్‌డాల్ హోమ్సు దర్శనముచేసెను. కవిపుంగవుడు లాంగ్ ఫెల్లో పరిచయము సంపాదించి అతనితో గూడ నాటకమునకు బోయెను. విఖ్యాతుడగు అమెరికన్ వ్యాసకర్త రాల్ఫు వాల్డో ఎమర్సన్‌తో పిమ్మట అతనికి పరిచయమయ్యెను. డచ్చిదేశమునుండి అమెరికాదేశమునకు పొట్ట చేతబట్టుకొని వలసవచ్చినవాని కొడుకు ఇట్లు అమెరికన్ పెద్దలతో మెలంగ జొచ్చెను.

బ్రూక్లిన్ నందు ప్రచురింపబడుచున్న ఒక మతవిషయిక పత్రికకు అతడు సంపాదకుడయ్యెను. పాతపేరు మార్చి దానికి 'బ్రూక్లిన్ మాగజైన్' అను క్రొత్తపేరు పెట్టెను. సారస్వతప్రముఖులతో నాతని కుండిన పరిచయము ఈపత్రికకు వ్యాససంగ్రహమున అతనికి బాగుగ అక్కఱకువచ్చెను. ఇంతమంది పెద్దల వ్యాసములు అత డెట్లు సంపాదించుచుండునో ఇతరపత్రికల సంపాదకులు గ్రహింపలేకుండిరి. పత్రికపని ఒక్క సాయంకాలములప్పుడే చూచువాడు. ఆసమయమున అతడుపొందు సంతోషము కొలదియిడరానిదిగనుండెను. పగటిపూట టెలిగ్రాఫ్ ఆఫీసునందు స్టెనోగ్రాఫరుగ పనిచేయుట చాలకష్టముగనుండెను. కావున మఱి ఏదైన పత్రికపని సంపాదించుటకు అతడు సంకల్పించుకొనెను. న్యూయార్కునందలి ఒక గ్రంథప్రచురణాలయమువారికడ అతని యజమానిసిఫారసుపైని అతడొకయుద్యోగమును సంపాదించెను. బాక్కు యాజమాన్యమున 'దిబ్రూక్లిన్ మాగజిన్' అమ్మకము విశేషాభివృద్ధి చూపెను. ధనాఢ్యుడగు నొకడు తనకుమారునకేదైనవృత్తి కల్పించుటకై ఈపత్రికను కొనివైచెను. అగుటచే బాక్కునకు సాయంకాలపు ఈ ఉద్యోగము పోయెను. ఈదినములలో బాక్కుతండ్రి చనిపోయెను. అతడును, అతనిసోదరుడును కలసి తమతల్లి సుఖముగా

జీవించుటకు వలయుధనమును సంపాదింపదలచి యుండిరి. పైగా రెండు ఉద్యోగములుండినగాని తనతీక్ష్ణబుద్ధికి వలసిన పరిశ్రమ లేకుండునని అతడుతలంచువాడు.

తన ప్రజ్ఞాపాండిత్యప్రదర్శనమునకు అనువైన అవకాశమునకై అతడు దిక్కులు పరికించెను. నీళ్ళ అమ్మకమునకు పోటీఏర్పడినప్పుడు తననీళ్ళను నిమ్మనీళ్ళుగా మార్చిన ఆబుద్ధిమదగ్రేసరుడు ఒకేవ్యాసమును వివిధ ప్రదేశములందుగల పత్రికలకు ఒకేనాడు అమ్ము పద్ధతిని కనుగొనెను. ఉత్తరక్షణమునుండియు ఆపద్ధతి జయపథమునంటెను. జర్నలిజము పరిభాషలో నేడు ఈ పద్ధతి 'సిండికేటింగు' అని పిలువబడుచున్నది. ఈపద్ధతి నిర్వహించుటకై బొక్కు న్యూయార్కులో ఒకఆఫీసు పెట్టెను. తనకు గ్రంథప్రచురణకార్యాలయమున దినమంతయు పనియుండుటచే తన ఈవ్యాపారమున తన సోదరుని భాగస్వామిగ చేకొనెను. ఆదినములలో అమెరికనువార్తాపత్రికలు 'స్త్రీలపుటను' ప్రత్యేకించి ప్రచురించుట ఎఱుగవు. అసలు అవి స్త్రీలవిషయములను గూర్చి అంతవిశేషమైన శ్రద్ధచూపునవి కావు. తాను స్త్రీలసమస్యల విషయమై శ్రద్ధవహించి అమెరికా దేశపు వివిధవార్తాపత్రికలందు 'స్త్రీలపుట'ను ఏర్పరించుటకు బొక్కు బద్ధకంకణుడయ్యెను. రెండు సంవత్సరముల యనంతరము అతడు స్క్రిబ్నర్సు అను సుప్రసిద్ధగ్రంథప్రచురణాలయమున స్టెనోగ్రాఫరుగ చేరెను. సిండికేటు పద్ధతిని పంపు 'స్త్రీలపుట' వలనగాక అతని కీఉద్యోగమువలన ప్రత్యేకము వారమునకు ఇరువది డాలర్లు రాబడియుండెను. స్క్రిబ్నర్సు ఫర్మములో చేరునప్పటికి అతనివయస్సు ఇరువదియొకటవ వత్సరము. ఎంతటి మేధావంతుడైనను ఆవయస్సున కింతటిపని యొనర్చినాడనుచో అది ఆశ్చర్యపడదగినదే.

స్క్రిబ్నర్సుఫరములో అతడు క్రమాభివృద్ధి నందెను. ఉత్తరముల వ్రాయుపని ఇపుడులేదు. ప్రకటనలపని అతనికి అప్పజెప్పబడెను. ఈ పనిచేయుటలో ప్రతిఒక్క నిముసమును అతనికి నూతనానందము నిచ్చునది. పని పెందలకడనే ప్రారంభించువాడు; ప్రొద్దుపోవువఱకును చేయువాడు, 'సిండికేటింగు'ను మఱచిపోలేదు. 'స్త్రీలపుటకు'తోడు వారమునకొకసారి 'పుస్తకములపుట'నుకూడ ప్రారంభించెను. దానినాతడు ఒక్కొక్క వారమునకు నలుబదిరెండు వివిధములైన పత్రికలలో ప్రచురింపజేయువాడు.

ఈ'పుస్తకములపుట'యే ఎడ్వర్డుబొక్కు తరువాతి యభివృద్ధికి అవకాశము కల్పించెను. ఈపుస్తకముల పుటను ప్రచురించు నలుబదిరెండు పత్రికలలో ఒకపత్రికకు స్వామిదారుడు కర్టిస్సు అనువాడు. కర్టిస్సు యాజమాన్యమున 'లేడీస్ హోమ్‌జర్నలు' అను స్త్రీల ప్రత్యేకపత్రిక యొకటికూడ ప్రచురింపబడు చుండెను. ఆ పత్రికకు సరియైన సంపాదకుని కొఱకు కర్టిస్సు ఆ దినములలో వెదుకుచుండెను. బొక్కు 'పుస్తకములపుట'ను కర్టిస్సు చదివెను. ఆ పంక్తులు వ్రాసిన యతడు తన పత్రికకు తగిన సంపాదకుడు కాగలడని కర్టిస్సు తలచి న్యూయార్కు వచ్చి బొక్కుకు తనతలంపు తెలిపెను.

స్వీకరించుటయా, మానుటయా అని బొక్కు కొద్ది రోజులు తటపటాయించెను. గొప్ప సమస్య. 'లేడీస్ హోమ్ జర్నలు' నేడు ప్రపంచప్రఖ్యాతి గాంచిన మాసపత్రికలలో నొకటి. అప్పు డది అట్టి ఉన్నతస్థితి నందియుండలేదు. దాని సంపాదకత్వమును అంగీకరించుట యనగా స్థిరప్రతిష్ఠ గల స్క్రిబ్నరుఫరముతో సంబంధము వదలుకొనుట—న్యూయార్కు పట్టణమును వీడి ఆ జర్నలు ప్రచురింపబడు ఫిలాడెల్ఫియా యందు స్థిరపడుట—ఈ రెండు కష్టములను మించిన కష్టము, నిర్భరకరుణాధురీణయగు తన తల్లిని విడిచివెళ్ళుట. అతనిస్నేహితు లీసంపాదకత్వమునకు అంగీకరింప వలదని సలహా యిచ్చిరి. కాని అదృష్టవశమున బొక్కు స్నేహితుల సలహాను అంగీకరింపలేదు. అప్పటికి స్త్రీల కొఱకు ప్రచురింపబడుచున్న ప్రత్యేకపత్రికలలో దొరికినన్నిటి కాపీలను కొనెను. వానిని పరిశీలన దృష్టితో పఠించెను. ఆనుకూల్యప్రాతికూల్యములను అరసి తూచెను. తుదకు తనచేతుల్లలో 'లేడీస్ హోమ్ జర్నలు' నిరభ్యంతరముగ జయమందితీరునని అతడు దృఢనిశ్చయుడయ్యెను. తోడనే యాతడు న్యూయార్కు నందలి తన ఉద్యోగమునకు రాజీనామా నిచ్చి తన

క్రొత్తపనికి క్షేత్రముగు ఫిలాడెల్ఫియాకు రైలెక్కెను.

జర్నలిజము చరిత్రయందు అభిరుచికలవారికి అతని యాజమాన్యమున ఆ 'లేడీస్ హోమ్ జర్నలు' అందిన క్రొత్తపోకడల వివరము తెలియుట యెంతయు ముదావహముగ నుండును. కాని స్థలవిస్తరభీతిచే ఇచట విస్తరింపబడుట లేదు. స్త్రీ జనములకు ప్రత్యేకాభిరుచి యుండగల ఏ విషయమును గూర్చియైనను తెలిసికొన దలచిన వారెల్లరు తన కార్యాలయము నందలి ఆయా విషయిక నిపుణులకు వ్రాయుచుండ వలయునని బాక్ ఆ జర్నలులో ప్రచురించువాడు. అతడా పత్రికకు సంపాదకుడుగా ఉన్న ముప్పదిసంవత్సరములును ఆ విషయమై అతడు ప్రత్యేకశ్రద్ధను చూపువాడు. ఆ విషయమై ఆ కార్యాలయమునకు ఏడాదికి పదిలక్షల ఉత్తరములు వచ్చునవి. అతని చేతిక్రింద ఆ పత్రికపని చూచుచు ముప్పదియైదుగురు సహాయసంపాదకు లుండువారు. ప్రపంచమునందు స్త్రీల కొఱకు ప్రత్యేకముగా ప్రచురింపబడు ఏ పత్రికయు అందని విశేషప్రచారము ఎడ్వర్డు బాక్ సంపాదకత్వమున ఆ 'లేడీస్ హోమ్ జర్నల్' అందెను. తాను సంపాదకుడుగా ఉన్న ముప్పది వత్సరములును అతడు చేసి చూపినదేమి? ఒకడు పుచ్చుకొను జీతముకంటె హెచ్చు విలువగల పనిని చేయవలయునని. తన స్వీయచరిత్రలో అతడిట్లు వ్రాసికొనెను: "నేను ఎప్పుడును గడియారముచూచి పనిచేయలేదు. పనినిబట్టి పనిచేసితిని. ఎంత కాలము పట్టుగాక చేసిన పనిని తృప్తిగ చేయుటయే నా పద్ధతి." ఎంత వచ్చిన అంతయు ఖర్చుపెట్టు తీరు అతనికి నచ్చదు. జీతము పెరుగు కొలదిని అతడు వెనుక వేయునది కూడ పెరుగుచుండెను.

తనకు నలుబదియేండ్లు నిండగా విశ్రాంతి గొను విధానము అన్వేషింపగడంగెను. తనభావము లనిన పత్రికాపాఠకులు విసుపునందక పూర్వమే, తన ప్రజ్ఞాబలముచే పరిపుష్టినొందిన పత్రిక కీర్తిశిఖరముపై వెలుగొందుచున్నప్పుడే గొప్ప జర్నలిస్టు విశ్రాంతి గొనవలయునని అతని నిర్ధారణ. తన సంతతివారెఱింగిన సంపాదకమహాశయులలో బాక్ అద్వితీయుడు. తనకు ఏబదియేండ్లు నిండగా తన పనిని ఒక యువకునకు అప్పగించి తాను విశ్రాంతి గొనవలయునని అతడు తలంచెను. కాని ఆ తలంపులు పచేళిమములగు సరికి అతనికి ఏబదియాఱేండ్లు నిండెను. తన ఇరువదియాఱవయేట అతడా పత్రిక సంపాదకత్వము వహించెను. ఏబదియాఱవ ఏట విశ్రాంతిగొనెను. నిండు ముప్పదివత్సరములు 'లేడీస్ హోమ్ జర్నలు' నకు సంపాదకుడై వెలసెను. అతని సంపాదకత్వము క్రిందికి వచ్చుసరికి ఆ పత్రిక చందాదారుల సంఖ్య నాలుగు లక్షల నలుబది వేలు. అతడు విశ్రాంతిగొను సరికి ఆ మాసపత్రిక నెలకు ఇరువది లక్షల కాపీలు సెలవగుచుండెను. ప్రపంచమున పత్రికల ఆస్తులన్నిటిలోనికిని దాని ఆస్తి గొప్పది.

ఎడ్వర్డు బాక్ కథ ముగిసినది. చేత పైసాలేని బాలుడు—ఉన్నత పదవులలో నున్నవారి సిఫారసు ఎఱుగడు—గొప్పవారి స్నేహలాభము కలవాడును కాడు—ఇంతకును విదేశమునుండి వలసవచ్చినవాని పుత్రుడు. బుద్ధి—కష్టపడి పనిచేయు బుద్ధి—మాత్రము ఉండినది. దానిని ఉపయోగించినాడు. జయమందినాడు. జర్నలిజములో ప్రవేశింపదలచు వారికెల్లరకు నాతడాదర్శపురుషుడైనాడు. సంపాదకుడుగా అతడొందిన జయము ఒక సామెతయైనది.

అతని జీవితప్రబంధమున కంతకును అతని తెలివిని తెల్లగ ప్రదర్శించిన గొప్ప ఘట్టమేది? ఆ శనివారము నాటి మధ్యాహ్నము తన మంచునీళ్ళ వర్తకమున పలువురు పోటీదార్లు ఏర్పడినప్పుడు తన నీటి కడవలో నిమ్మరసము కలిపి పోయుచు తన ఖాతాదారులను తిరిగి కూడగట్టుకొని పోటీదారుల కెదురొడ్డి నిలచిన ఘట్టము. అప్పుడాతని ప్రతిభ చూపిన నైశిత్యమును మఱి యెప్పుడును చూపలేదనియే చెప్పవలసి యున్నది. బాక్ చరిత్ర మఱువరానిది. అది ఓడుట అనునదెట్టిదియో ఎఱుగని మార్గదర్శకుడగు జర్నలిస్టు చరిత్ర.

ఆంగ్లదేశపు పత్రికల ప్రభువు లార్డు నార్తుక్లిఫ్ ఒకసారి ఇట్లు చెప్పెను: "నాకే అధికారమున్నచో జీవితారంభముననున్న ప్రతియువకునకును ఎడ్వర్డు బాక్ జీవితకథ నిర్బంధపఠనీయముగ నొనర్తును.’

# మబ్బు లేని పిడుగు

తగని పనిచేసినా వోయి
తండ్రీ!
అగపడని పగలు సాధించి నావోయ్

ఒరగ బెట్టిన మమత
ఒడినింపి ఊరించి
తొలకరి మెరపులా
దోచేశి నావోయి

అమృత కలశము చూపి
ఆశలను పుట్టించి
అందుకో చెయిచాపి
సంత గుట కేశావు

కలువ పూ దండలని
వలపించి మెడవేసి
కాల సర్పము చేత
కాటు వేయించావు

తరిగాని తరిని బం
గరు పూవు మొలిపించి
తావి మూర్కొను వేళ
తరిమి కాజేశావు

మిన్నులను వెలిగించు
మెరపు చేతికి దెచ్చి
గడియలో లాగి చీ
కటుల ముంచితి వోయి

పండు వెన్నెల లంచు
పడి పరువు లెత్తించి
నిండు దావాగ్ని లో
మండ బెట్టించావు

ఎవ్వ రడి గారంచు
రవ్వ చెంగున గట్టి
కళ్లు తెరిచే లోన
కొల్లగొని విడిచావు

ఉబ్బించి విడిచావు
మబ్బు లేనీ పిడుగు
కోత కనపడ కుండ
గుండెలో పొడిచావు

తగని పనిచేసినా వోయి
తండ్రీ!
అగపడని పగలు సాధించి నావోయ్.

—బొడ్డు బాపిరాజు.

# సూరి సిద్ధాంతం. ౪.

అన్నిదశలలోనూ బాల్యదశవంటిదిలేదని నేను సూరితో వాదించాలని ఒకసారి ప్రయత్నంచేశాను. సూరి నాతో వాదించక, తన బాల్యాన్నిగురించి అదివరకు రాసిఉంచిన వ్యాసంచూపించి, 'ఇదిచదువు. తరువాత నీ అనుమానాలు తీరుస్తాను,'' అన్నాడు. ఆవ్యాసం ఈ కింది విధంగాఉంది.

...అనేకమంది బాల్యావస్థను శ్లాఘించగా విన్నాను. ''చిన్నప్పటి ఆనందం—ఆరోజులు—మళ్ళీ రాదుకదా.'' అని నిట్టూర్చటంచూశాను. క్రీస్తు కూడా వాళ్ళదే స్వర్గమన్నాడు...గ్రే ఒక్కొక్కసారి అజ్ఞానం పరమానందమన్నాడు.

నే నీఅభిప్రాయాలతో ఏకీభవించక పోవటంలేదు. నాబాల్యం, దాన్నిపోగ మాదిరిగా ఆవరించుకుని ఉండిన అజ్ఞానం ఇప్పుడు తలుచుకోటానికి నాకు దుర్భరంగా ఉంటుంది. పరిపూర్ణమైన జ్ఞానానికితప్ప స్వర్గంలో తావు లేదని నామతం. అజ్ఞానంకన్న బాధలేదని ప్రత్యక్షంగా చూస్తున్నాను. ఏదేవుడైనా నాకు వరమిస్తే బాల్యంలేని జన్మ ప్రసాదించమని వేడుకుంటాను.

ఇటువంటి పొరపాటు అభిప్రాయాలుకలలోకాన్ని దూషించి ప్రయోజనంలేదు. ఆపరేషన్ బల్లమీద రోగి బాధకుఓరచి డాక్టరును క్లోరోఫారం ఇమ్మని బతిమాలినట్టుగా, రోజల్లా శరీరకష్టంచేసినవాడు కల్లుదుకాణానికిపోయి తప్పతాగినట్టుగా, నిజాన్ని ఎదుర్కోలేనిలోకం అజ్ఞానంలో ఆనందించటంలో ఆశ్చర్యం లేదు.

అజ్ఞానానికీ అబద్ధానికీ జరిగేప్రచారం లోకంలో మరిదేనికీ జరగటంలేదు...చిన్నతనంలో పిల్లలకు పెద్దవాళ్ళనుచూస్తే భయభక్తులు నేర్పుతారు.

''అమ్మోయ్! తాతదగ్గిర పోడుంవాసనే!''అంటాడు పిల్లవాడు. వెంటనే తల్లి ''ఛా!వెధవా! అట్లా అనవచ్చునా? ఛీ!'' అని భయపెడుతుంది. తెలివిగల పిల్లవాడైతే తిట్లూదెబ్బలూ తప్పించుకోటానికి మరోమాటు ఆమాట అనకపోయినా, తాతదగ్గిర పోడుంవాసన అనేమాట మరిచిపోడు. అదే మెదడులేని పిల్లవాడైతే ఆమాట అనటం పెద్ద అపరాధమని గ్రహించి, మానసికంగా చెంపలు వాయించుకోటమే కాకుండా, నిజంగా తాతదగ్గిర పోడుంవాసనలేదనే నమ్మకంతెచ్చి పెట్టుకుంటాడు.

సహజంగా మనం మొదటిరకం పిల్లవాణ్ణి అల్లరి వెధవఅంటాం, రెండోరకంవాడు బుద్ధిమంతుడు!

ఎంతబుద్ధిమంతుడైన కుర్రవాడు కానివ్వండికాక, స్వతహాగా పంతులుకనపడితే నమస్కారంచెయ్యాలని కనుక్కోగలడా? ఇంకోరుచెప్పకుండా కిందనుంచోటం కన్న బెంచీఎక్కటం హీనమని గ్రహించగలడా?

నేను వీధిబడి వదిలి హైస్కూలులో తక్కువ తరగతిలో ప్రవేశించిన మొదటిరోజునే ఒక చిత్రం జరిగింది. క్లాసులోకి మేస్టరురాగానే అంతా లేచినుంచున్నారు. నాకేది అర్థంకాక నాపక్కవాణ్ణి బలవంతాన లాగాను. వాడు నాపక్కన కూలబడి మళ్ళీబంతిల్లే లేచి దణ్ణంపెడుతూ ''చూడండీ సార్!'' అని మేస్టరుతో ఫిర్యాదుచేశాడు. ఆయన నేను లేవనికోపం లోపల పెట్టుకుని బెంచీ ఎక్కమన్నాడు. బెంచిమీద ఎక్కగానే ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది నాకు...తరవాత చాలారోజులవరకూ పంతులు క్లాసులోకి వచ్చినప్పుడు లేచి నమస్కారం చెయ్యాలనీ, బెంచీఎక్కడం కిందనిలబడటంకన్న పెద్దశిక్షఅని నమ్మలేకపోయినాను!

ఈ చిన్నతనాన్నిగురించి ఎట్లా గర్వపడటం? ...

గట్లమధ్య ప్రవహించే నది మాదిరిగా కుర్రవాడిప్రకృతి తల్లి ప్రకృతిని ఒరుసుకుంటూ తల్లిదండ్రుల యొక్క ప్రకృతులమధ్యగా ప్రవహిస్తుంది. (ఈపోలిక పోల్చటంలో కుర్రవాడిప్రకృతి గట్టు తెగిపోవచ్చునని కూడా ఉద్దేశం.) తల్లికీ పిల్లవాడికీ బంధం జాస్తి. ప్రవా

పానికి వెలపలిగట్టుతో సంబంధంతక్కువ. లోపలిగట్టు ఎన్నివంకర్లుతిరిగితే ప్రవాహం అన్నివంకర్లు తిరుగుతుంది. తల్లుల్లో ఎన్నిలోపాలుంటే పిల్లవాడు అన్నిలోపాల తోనూ బాధపడతాడు. ఆడదాన్ని చేతులారా దాస్యం లో ఉంచుతున్న ఈ వివాహచట్టంతోనూ ఈ న్యాయ చట్టంతోనూ, ఆడదాన్ని, పిరికిదాన్ని, చేసేస్తున్న తండ్రి దౌర్జన్యంతోనూ భర్త దౌర్జన్యంతోనూ, ఆడదాన్ని పశువుకన్న హీనంచెయ్యాలని ప్రయత్నం చేస్తున్న మత సంబంధమైన మోసంతోనూ స్త్రీ ధర్మశాస్త్రాలమోసం తోనూ, మనదేశంలో పిల్లలు ఎందుకైనా పనికిరావా లంటే ఉన్నతల్లులు తనపిల్లలతో రోజుకు గంట గడ పటానిక్కూడా అర్హులుగాలేరు. . . .

నాకు మానాన్నగుణాలు అబ్బినా ఆయన్ను చూస్తే ఒకవిధమైన వైరభావం, మా అమ్మనుచూస్తే ప్రేమా ఉండేది. ఆవిడమీద ప్రేమకు ప్రకృతిసిద్ధమైన స్త్రీ పురుషపరస్పరాకర్షణ కారణం కావటమేకాక ఆవిడ అభిప్రాయాలూ ఆవిడ అజ్ఞానం నా ప్రవర్తనలో లైన్ ఆఫ్ లీస్ట్ రెసిస్టెన్సుకు చాలా అనుకూలంగా ఉండేవి. కుర్రవాడికి ఏదైనా నేర్చుకోటానికి, సరిగా ప్రవర్తిం చటానికి ప్రయత్నంకావాలి కాని వృద్ధిలేకుండా ఉండ టం చాలా సులభం. అందరికీ సహజమైన ఈ బద్ధకం, ఈ ఇనర్షియా, నన్ను వృద్ధిలేకుండా ఉండమని ప్రేరేపిం చేది. మా నాన్నకు అది ఇష్టమని నాకు ఎట్లాగో తెలు సును. ఆయనదగ్గిరికి పోవాలన్నా నిప్పును సమీపించ డం మోస్తరుగా ఉండేది. ఆయన కళ్ళుగుడ్డిచేసేవెలుతు ర్లలో ఉండేవాడు. ఆవిడ కళ్ళుగుడ్డిచేసేచీకట్లలో ఉండేది. రెండూ ఒకటే అయినప్పుడు శ్రమపడి వెలుతురును సమీపించటం ఎందుకు; చక్కగా చీకట్లో నిద్రపోక! చీకటిచెయ్యలేని ఉపకారాలు వెలుతురు చెయ్యగలదని నాకు చెప్పినవారు లేరు.

నేను అయిదేళ్ళవాణ్ణయినప్పుడుకూడా మా అమ్మ నన్ను ఒళ్ళో కూర్చోపెట్టుకుని, తలనిమిరి, మొహం వాసనచూసేది. మా నాన్న నన్ను పెద్దవాణ్ణిచూసినట్టు చూసేవాడు. "నీపెంపకం మాబాగావుంది! వాడు ప్రతి దానికీ తెలీనట్టు నటిస్తాడు! వాణ్ణి ఎందుకంతఅజ్ఞానం లోపెంచుతున్నావు?" అని ఆయన అప్పుడప్పుడూ మా అమ్మను గదమాయించేవాడు. "పసివెధవ వాడికప్పు డే ఏంతెలుస్తుందండీ! మీరెప్పుడూ ఇంతేను!" అనేది మా అమ్మ. అప్పుడు వాళ్ళిద్దరికీ వాదన!—అయిదేళ్ళ పిల్లవాడికి ఎంతతెలుసుకునేటందుకు అవకాశం ఉందని! మా నాన్న చెప్పిందేనిజం. ఓంప్రథమంనించే మన ఆడ వాళ్ళు పిల్లలతో తొక్కుమాటలు—"ఓంతేఅమ్మా?" —మొదలైనవి మాట్లాడకుండా ఉంటే అయిదేళ్ళ కుర్రవాడికి ఇంట్లో ఎట్లాప్రవర్తించవలిసింది చక్కగా తెలీటానికి, తలిదండ్రులకు ఆటంకంలేకుండా తనకు కావలసిన పనులు తనుచేసుకునేనేర్పు కలగటానికీ అవ కాశంఉంది. ఒకరిదాకా ఎందుకు? పదేళ్ళు వచ్చిన తర వాతకూడా నా అంతట నేను నీళ్ళతోడి పోసుకుని నా అన్నంనేను కలుపుకునీ ఎరగను. "నాకు పెనసలు కా వాలి. ఎట్లా నాన్నా?" అనేరకం కుర్రవాణ్ణి చూస్తే మానాన్నకు అసహ్యం. కారణంచెప్పకుండా—ఆమాట కొస్తే చెప్పిఅయినా—డబ్బులడిగే పిల్లవాడు దుర్మా ర్గుడని, డబ్బులు పెద్దవాళ్ళు తాకవలసిందే కాని పిల్లలు తాకరాదని మా అమ్మ అభిప్రాయం. మానాన్న ఇష్ట ప్రకారం ప్రవర్తించటంలో కొంతబాధ్యత నాసెత్తిన ఎప్పుడూ ఉండేది. అది నాకిష్టంలేదు.

ఈసందర్భంలోనే మా అమ్మకూ నాన్నకూ ఇంకో అభిప్రాయభేదం ఉండేది. నాప్రవర్తనలో నాకు కొంతస్వేచ్ఛ ఇవ్వమనీ, పిల్లవాడివిషయం పరిపూర్ణ మైన జాగ్రత్త ఉంచటం తల్లిదండ్రులకూ అసంభవ మనీ అనేవాడు. మాఅమ్మకిది అఘాయిత్యంగా కన పడేది. "వాడు నిప్పులోపడి కాలిపోతున్నా చూస్తూ ఊరుకుంటారండీ మీరు!" అని కోప్పడేది ఆవిడ.

"వాడిజాగర్త వాణ్ణి తీసుకోనివ్వటం చాలా మం చిది. అవిటిశరీరంకన్న అవిటిమనస్సు దుర్భరమైనది!" అనేవాడు మానాన్న. వాదనలో ఈవిధంగా అతిగా వెళ్ళటం ఆయనకు అలవాటు. నాఉద్దేశం పిల్లవాడికి అవుడులేని శరీరం మనస్సుకూడా ఏర్పాటు చెయ్య వచ్చునని—వెయ్యికళ్ళతో పిల్లవాణ్ణి కాపాడే అవ సరం లేకుండానే...

వెయ్యికళ్ళతో కనిపెట్టి మా అమ్మ నాకు చేసిన ఉపకారంమాత్రం ఏముంది?...

పెట్టుపోతల్లో మాఅమ్మవంటిది లేదని ప్రతీతి! ప్రతిపూటా నాకిష్టమైన ఆధరువు—సామాన్యంగా కందిపచ్చడి—చేసి ఎక్కువ ఎక్కువగా పెట్టేది. ఒకచెంప నేను తినలేక గుడ్లు వెళ్ళుకొచ్చి కొట్టుకుంటే "పిచ్చిసన్యాసి! నీ ఆకలి నీకేతెలీదేం? చిన్నగొట్టం పోస్తే అన్నమంతా అట్లాగే ఉండేను!...కడుపు నిండా తినకపోతే ఏమవుతుందో తెలుసా? నిద్రపోతున్నప్పుడు జీవుడు వెళ్ళి పొయిమీదపెట్టబోతున్న శూద్రవాళ్ళ అన్నంకుండలో ప్రవేశిస్తాడు. వాళ్ళు కుండ పొయ్యిమీదపెట్టి మూతపెడతారు!" అనేది. ఈమహానరకం తప్పేటందుకు మానాన్నముద్దా, మా అమ్మముద్దా మొదలైనవన్నీ బలవంతాన దిగమింగే వాణ్ణి...నాకు వాగాని కోసారిచచ్చేటంత జబ్బు రావటం రొండులంఖణాలు చెయ్యటం జరుగుతూండేది—వేంకటేశ్వరస్వామికీ, పోలేరమ్మకు, సుబ్బారాయుడికీ, ఇంకెవరెవరికో ముడుపులతో సహా.

తతిమ్మా విషయాల్లో నాప్రాణాని కావిడ ఇనప్పెట్టల్లే ప్రవర్తించేది. నేను బావిదగ్గిరికిపోయి బావిలో మొహంపెట్టి బోయమని అరవటానికి వీల్లేదు, రైల్లో పోతున్నప్పుడు కిటికీలోనించి బయటికివంగి రైలుపొగ వాసన చూడటానికి వీల్లేదు, రైలుస్టేషనుకు పోయి గుడ్సుబండి పెట్టెలు లెక్కపెట్టి స్టేషనులో గాసులైటు వెలిగించటం చూసి చీకటిపడ్డతరవాత ఇంటికి రావటానికి వీల్లేదు. నన్ను మాఅమ్మ ఈవిధంగా సంరక్షించినప్పుడల్లా మానాన్న "నీబాగ రతీసుకోటంకాదు కాని వాణ్ణి అనాధను చేస్తున్నావు. వెన్నెల్లోకూడా బయటికిపోవటానికి భయంవాడికి!" అనేవాడు. మా అమ్మమండిపడి మనిద్దరంబతికిఉంటే వాడెందుకు అనాధఅవుతాడు?" అన్న దొకసారి. "దిక్కులేనివాడు అనాధకాదు. దిక్కులేకుండా జరగనివాడు నిజమైన అనాధ!" అన్నాడాయన. ఆమాట ఆవిడకు అర్థంకాలేదు...ఎక్కువ తెలివిగలదికాదు పాపం ఆవిడ.

పెట్టనికోట! వాడు మంచానపడగానే ఏసుబ్బారాయుడో—"

"అవునులెండి! వాడు చావుబతుకులమీద ఉన్నా మీకు కనికరం ఉండదు!"

దానిమీదట మానాన్న ఎకతాళిగా "ఆహా! ఏం మాతృప్రేమ? అజీర్ణంతో వాడు మంచానపడగానే వాణ్ణప్పుడే టపాకడుతుంది!" అంటాడు...

ఈసందర్భంలో పిల్లలచావులనుగురించి ఒక ముక్క రాస్తాను. మనం సామాన్యంగా పిల్లలపోషణ విషయంలో బయటపెట్టుకునే అజ్ఞానంచూస్తే రొండుమూడు సంవత్సరాలవయసులోపల ప్రతి పిల్లా,పిల్లవాడు ఏక్షణం పడితే ఆక్షణం చావటాని కవకాశంఉంది. శిశుమరణం సంభవించినప్పుడల్లా తల్లి "అప్పుడే పోతావనుకోలేదో!" అని ఏడుస్తుంటే నవ్వాలో విచారించాలో తెలీకుండా ఉంది. ఆవిధంగానే ప్రతివాళ్ళూ తమ ఆప్తవర్గంలో ఎవరోఒకరు ఏరోజునైనా చచ్చిపోవటానికి సిద్ధంగాఉండకపోవటంయొక్క ఫలితం మహాఘోరంగా అనుభవిస్తారు. ఎప్పటికప్పుడు స్మశాన వైరాగ్యం తెచ్చుకోవటమేకాని చావుయొక్క ఆవశ్యకత ఎవరూ గ్రహించినట్టు కనపడదు. అందరికీ వచ్చే చావు చెడ్డదెట్లాఅవుతుందని ప్రశ్నించినవారు కనపడరు. చచ్చినవాళ్ళు తిరిగి పుట్టటం ఉన్నదని నిరూపించటాని కిక్కడ చోటులేదు. ఉన్నదని భావించుకుంటే ఎక్కువమంది హిందూసోదరులు తప్పుపట్టరు కనక అట్లాగే భావించుకుని ఒకమాట మనవిచేస్తాను. కిందటి జన్మనుగురించి ఎందుకు జ్ఞాపకంఉండదని ప్రశ్నవచ్చినప్పుడు ఒకరు—వివేకానందస్వామో, రామకృష్ణ పరమహంసో జ్ఞాపకంలేదు—కిందటిజన్మ అనేకసంవత్సరాలకిందటిది, ఈజన్మలోవిషయాలే మనం మరిచిపోతున్నప్పుడు అంతకాలంకిందటి విజ్ఞాపకం ఉండటం కష్టం. అయినా కావాలని ప్రయత్నంచేస్తే జ్ఞాపకం వస్తవి. నాకుజరిగిన జన్మలు జ్ఞాపకంఉన్నవని సెలవిచ్చారు. అది కావచ్చును, కాకపోవచ్చును. కాని [illegible]

ఎక్కువభేదం ఉండదు. జీవితం ప్రయాణమేనని ఒప్పు కుంటాను. కాని "తామరాకుమీద నీటిబొట్టులాగ ఉండు! ఈ భార్యఎవరు? ఈకొడుకెవరు? నువ్వుచేరవలిసినచోటేదేనని ఎక్కడపడితే అక్కడ ఆగకు. గమ్యస్థానం మనస్సులో ఉంచుకో!" అని చెప్పగానే సామాన్య మానవుడు అర్థంచేసుకోలేడు. అసలా వేదాంతంలోనే పొరపాటున్నది. భార్యాపుత్రులు ఎవరూ కాకపోలేదు! తోడుప్రయాణీకులు. వీళ్ళు మనతో రాలేరని అధైర్యంతో నైతే తప్ప వాళ్ళను విడనాడుకోనక్కరలేదు. నీదారిన నువ్వు నడు. అటుఇటు చూసకంటే పోతున్న దారి సరిఅయినదేనా అని చూడవలిసివస్తుంది. మన వేదాంతంలో వచ్చినచిక్కేమిటంటే అది ఎవరికోసం ఉద్దేశింపబడ్డదో వాళ్ళకు అర్థంకాదు. మనిషి కొంత కాలం బతికినతరవాత ప్రయాణానికి అర్హుడుకాకుండా పోతాడు. అప్పుడు చావు వరమల్లే వస్తుంది. అందుకని ఆచావు ప్రతిరెండు సంవత్సరాల కొకసారి వచ్చినా ప్రయాణంలో అడుగడుక్కూ కూర్చున్నట్టుంటుంది. మనకు డాక్టర్లంతా శోధనచేసి కనిపెట్టవలిసిందేమిటంటే ఒక్క శరీరంతో కూర్చోకుండా ఎంతకాలం ప్రయాణంచెయ్యగలం అనేది బెర్నార్డ్ షా మూడువందలఏళ్ళు కావాలన్నాడు. మంచిది. నేనుకూడా ఒప్పుకున్నాను! నిన్నటిబాధలు ఇవాళ జ్ఞాపకంరాకుండా ఏదైనా ఏర్పాటుంటే ప్రతినిద్రానంతరం మనంకొత్త మనుష్యులం అవుతామన్నాడు వెల్స్. ఏగవర్నమెంటులోనన్నా ఏరోజు సమస్యలు—ఇవి సామాన్యంగా శరీరసంబంధమైనవిగా ఉంటున్నై—ఆరోజే తీరిపొయ్యే ఏర్పాటు జరిగితే ప్రతినిద్రా ఒక చావు కింద ఉపయోగించుకుని—ఆనిద్రే బాల్యంలేని పునర్జన్మ ఇచ్చే చావవుతుంది—ఒక వెయ్యిజన్మలో సాధించగలవృద్ధి ఒక్కజన్మలో సాధించి ధన్యులంకావటానికవకాశంఉంది. అందరూ ఆలోచించండి!...

అసలువిషయం... మా అమ్మ పెంపకంలో నాకు నచ్చినదేమిటంటే—బాధ్యత తో చెయ్యటం, నిజాన్ని కప్పిపుచ్చటం, ఎదురుగా కనపడుతున్నది లేదనుకోటం, అబద్ధంలేక అసత్యం నాగరికతకు ఆధారమనుకోటం, నాలో నాకు నమ్మకంలేకపోవటం, నాఅంత చండాలుడు లేడు నాకన్న నాస్నేహితులంతా మంచివాళ్ళనుకోటం, నాకుచెయ్యాలనిఉండేపనులే ఎవరైనా చేస్తే వాళ్ళని ఏవగింపుతో చూడటం, నిజం నాకు బాధ కలిగించటంవల్ల నిజంమాట్లాడేవాళ్ళు పాషాణహృదయులనుకోటం మొదలయినవి.

నాకు మొదటినుంచి ఆడపిల్లలతో ఆడుకోటంఇష్టం మగపిల్లలతో తిరగటంకంటె. మా నాన్న ఇటువంటి విషయాల్లో పాతఫక్కీగానే ఉండేవాడు. "అవెధవెందుకు ఎప్పుడూ ఆడపిల్లలతో పడిఏడుస్తాడు? ఆడకుంక కావటానికా? సభాపిరికితనం, సిగ్గూ, మెతకతనం, తనలో విశేషం బయటపెట్టుకోలేకపోవటం మొదలయిన గుణాలన్నీ రావటానికా?" అనేవాడాయన. చిన్నతనంనించి ఆడపిల్లలనూ మగపిల్లలనూ వేరువేరు గదుల్లో ఖైదుచెయ్యటంవల్ల కలిగేనష్టాలు నాకు స్పష్టంగా తెలుసును. కాని ఆయన అన్నదానిలో నిజం లేకపోలేదు!

తరవాత నాచదువుసమస్య వచ్చింది. మానాన్న వాడన నేర్చుకోవలిసిందేకాని నేర్పటమంటూలేదని. మాఅమ్మ నేర్పందీ ఎట్లావస్తుందనీ! భార్యాభర్తలలోనే ఒకరిభాష ఒకరిదికాదు. మాఅమ్మే గెలిచింది. నన్ను చదవేశారు వీధిబళ్ళో. మా నాన్న చెప్పినప్రకారం ఒకనెలా, రెండునెలలో రావలసినవిద్య వీధిబళ్ళో రెండుసంవత్సరాలు గడిపినతరవాత వచ్చింది. తరవాత నన్ను స్కూల్లో చేర్చారు.

అప్పుడుకూడా మానాన్న చెప్పనేచెప్పాడు ఈ చదువు ఎందుకూకోరగాదని. మాఅమ్మ "చదువుకోకుండా వాడు భటావోర్లే తిరగాలనా మీకోరిక?" అన్నది. "ఈచదువేమిటి? నేను చెప్పినట్టు చెయ్యనీ వాడు ఉద్యోగంకోసరం దేబిరించకుండా నెలకు రెండువందలరూపాయలు సంపాదించే ఏర్పాటుచేస్తాను." అన్నాడు మానాన్న. "అబ్బో! అంత్తా ఎందుకులెండి! అయినా మీరేంచెబుతారు వాడికి?" అన్నది మాఅమ్మ. "ఏంచెబుతానా? మృదంగం నేర్పుతాను. సంగీతం నేర్పుతాను. నాటకంలో వేషాలువేయిస్తాను రోజుకు పది

రూపాయలు సంపాదిస్తాడు.'' (ఈరోజుల్లో ఇంకా ఎక్కువసంపాదించవచ్చును.) ఇంకో సంవత్సరంలో వాడిచేత నెలకు పదిరూపాయల ఉద్యోగం చేయిస్తాను! నీకీవిషయాలేం తెలుసును?'' అన్నాడు మానాన్న. ఆవిడ ఎగతాళిగా నవ్వి ''తెలుస్తునేఉంది లెండి! నాటకాలూ, వేషాలూ, తాగుడూ, ముండలూ!'' అంది. మానాన్న పరధ్యానంగా మీసాలు సవరించుకుంటూ, ''నేను రెండుసంవత్సరాలపాటు వేషాలువేశాను!'' అన్నాడు.

మళ్ళీ మా అమ్మే గెలిచింది. నేను స్కూల్లో ప్రవేశించినప్పటినించీ లోకం మారటం మొదలు పెట్టింది. నేను ఇంగ్లీషు ప్రారంభంచేసిన క్షణంనించీ మాఅమ్మకు అర్థంకాకుండాపోవటం మొదలుపెట్టాను. నాకు కొత్త గురువులు, కొత్త ఆదర్శాలు, కొత్తసంఘం, కొత్త సంపర్కాలూ, క్రమంగా నా చుట్టూ చేరిన ఈ కొత్త సంఘంలో అతికిపోవటానికి నావ్యక్తిత్వం పోగొట్టుకోవలిసి వచ్చింది. మా అమ్మ చెప్పిన మాట వినటంలోనూ ఈ కొత్తసంఘం బయటికి అనకుండానే శాసించేశాసనాలకు లోబడటానికి చాలా భేదంఉంది. క్రాపింగు పెట్టుకోటం, చలవబట్టలు ధరించడం, నలుగురితో నాటకాలకూ సినిమాలకూ, హోటళ్ళకూ, సిగరెట్లుకూ

## భ్రమర!

నీవసంతముతోడ నీ యౌవనముపోయె
మోడుమ్రాల దివాంధములువసించెడునిచట
ఈముండ్లపొదరింట నీప్రేతభూమిలో
ఏలద్రిమ్మరెదోయి హృదయవేదనతో
లేదు నీవిరికన్నె లేదోయి భ్రమర!

నీ విరూపమ్మె సంధ్యావినిర్మలమైన
శ్యామలాబ్దమ్ముగా సరిపోల్చుకొనుచుండు
ఆనందములదీవి యనిపొంగిపోయెడు
ఆయపాంగావలోకాంతరోచిస్సులు
ప్రళయగర్భమ్ములోపల లీనమైపోయె
లేదు నీవిరికన్నె లేదోయి ఇచట.

మధురాతిమధురమై మలసిపోయిననాడె
నీ గీతికాధ్వనుల్ నిండించుకొనియె
అవ్యక్తమై శాశ్వతాతి ఘోరమైన
ప్రేమలోకచ్యుత వికృతరోదనములు;
ఏలద్రిమ్మరెదోయి, ఈప్రభాతమున
లేదు నీవిరికన్నె లేదోయి ఇచట.

—ఊటుకూరు సత్యనారాయణరావు.

డబ్బులు జేబులో ఉండటం మొదలయిన అలవాట్లయినై. అదితప్పు కాదని నాకు తెలుసును. మా అమ్మకేమర్థమవుతుంది? నేనిప్పుడావిడ శిక్షణలో లేనని ఆవిడ ఎందుకు గ్రహించదు? నే నింకా ఆవిడ అనుశాసనల్లో ఉన్నట్టు ఎందుకు నటించటం? ఆవిడకు నాకొత్తస్వరూపంఅర్థంకావటానికి ఇంటిదగ్గిర లేనివ్యక్తిత్వం తెచ్చి పెట్టుకున్నాను. ప్రతిరోజూ నామనస్సు, జ్ఞానం వృద్ధవుతున్నకొద్దీ అహంకారం ఎక్కువకావటం మొదలుపెట్టింది. క్రమంగా పాశ్చాత్యమర్యాదలు నేర్చుకున్నాను...

నేను బి. ఏ. పరీక్షకు పోబోతుండగా మానాన్న పోయినాడు'...నరకంలో నిద్రపోయి స్వర్గాన్నిగురించి కలలుకంటూ మేలుకుని నిజమైన పరిస్థితులు కనుక్కున్నట్టయింది నాసంగతి!...

నాచదువు, నా టీపార్టీలు, నా గర్వం నాకిప్పుడేమి సహాయం చేస్తై? నా మనసు తాగి తందనాలాడుతుంటే వికసిస్తున్నదనుకున్నాను. (శరీరసంబంధమైన నిషానుగురించి ఉపన్యాసాలింతమంది ఇస్తున్నారు! మానసికమైన నిషానుగురించి ఎవరూ ఎందుకు మాట్లాడరు? ఇటువంటినిషా ఒక్క ఇంగ్లీషు చదువులోనే ఉన్నదని పొరపాటుపడే వాళ్ళను కాళిదాసుచదవటంవల్లా, మను

చరిత్రా వసుచరిత్రా చదవటంవల్లా ఏమైనా మనోవికాసం కలుగుతుందా అని అడుగుతాను. రాతల్లో ఇప్పటివాళ్ళు ఇంగ్లీషుసాంప్రదాయం చూపిస్తున్నారని మొత్తుకునే వాళ్ళల్లో ఒక్కడు మనస్సుకు ఉపకారంచేసే వాక్యం ఒక్కటిరాయలేరు. కనక అటువంటి అసందర్భపుమాటలతో తెలివి తక్కువతనం వెళ్ళబెట్టుకోక ప్రతిఅంధ్రుడూ విధిగా ఇంగ్లీషు నేర్చుకుని కనీసం హెచ్. జి. వెల్స్‌రాసిన నవలలైనా చదివి ఇరుకుసందుల్లో ఉన్నమనస్సును విశాలపరచుకోమని సలహా ఇస్తాను. పొట్టలో చుక్కధావత్తులూ, అరసున్నాలూ, బండిరాలూ సరిగారాస్తే చదివేటట్టూ లేకపోతే వాళ్ళను వెక్కిరిస్తూ సశేషవ్యాసాలు రాసేటట్టూ!)

మొత్తానికి స్కూల్లో చెప్పిన చదువంతా దొంగ చదువు. ఇంగ్లీషుభాషను తెలిసిందేకాని దాన్ని జరపటానికి కావలిసినడబ్బు ఎక్కణ్ణించివస్తుంది. స్కూల్లో దారిద్ర్యాన్ని శ్లాఘిస్తూచెప్పారు. నాదారిద్ర్యాన్నిశ్లాఘించేదెవరు? మానాన్న బతికి ఉండగాఅన్న ఒకమాట జ్ఞాపకం వచ్చింది....

ఒకసారి నేనాయన్ను ఏ నాటకానికో డబ్బడిగాను. ఆయనఇస్తూ "ఈనెల నీకింద పదిహేనురూపాయలు ఖర్చయింది. తెలుసునా?" అన్నాడు. మాఅమ్మ వెంటనే "అయ్యో! అదేమిటండీ! అట్లా అంటారు!" అన్నది. ఆయన శాంతంగా ఆవిడ వైపుతిరిగి "తప్పులేదు. వాడీడబ్బు పాతట్లోనించి రావటంలేదని తెలుసుకోవటం మంచిదికాదా?" అన్నాడు...

ఆయనే నా తండ్రికాకుండా తల్లయిఉంటే! బిడ్డలను గురించిన ఎన్నిపుస్తకాలు అటువంటి తల్లితో సమానం!...

అది చదవటం పూర్తిచేసి చాలాసేపు ఆలోచిస్తూ కూర్చున్నాను. తరవాత వాడితో "ఒరే. సూరీ! నువ్వింతకన్న పిల్లల 'పెంపకంమీద' వ్యాసం రాయరాదా?" అన్నాను.

"నేను చూస్తున్నాను! ఏదైనా నానోటినించి వచ్చినా నేను రాస్తే చదివినా నీలో ఒక విధమైన అసంతృప్తి కనబడుతుం దెందువల్ల?"

నేను చెప్పలేనన్నాను. వాడన్న మాట నిజమే. నా దోకవిషయాన్ని గురించి గంటసేపు మాట్లాడినా దానిచుట్టూ తిరుగుతాడుతప్ప దాన్ని తాకడు.

సూరితల ఊపి, "బహుశా నువ్వొక 'పొరపాటు చేస్తున్నావు' ఆవునుగురించి నేను మాట్లాడటం మొదలుపెడితే దానికి రెండుచెవులు, కళ్ళూ, కొమ్ములు మొదలయినవి ఉంటవని ఇన్ఫర్మేషన్ ఇస్తానని నీ అభిప్రాయం? అవునా?" అన్నాను.

"అదుగో! అది! ఆపనిచెయ్యవు!"

"ఆపనిచేస్తే నీకేం ఉపకారం? ఒక సబ్జక్టును గురించి నువ్వేవిధంగా ఆలోచించాలో చెబుతాను. ఆ ఆలోచనకూడా నన్నేచెయ్యమంటే ఇక నువ్వు చేసేదేమిటి? నేను శిశుపోషణమీద పుస్తకంరాస్తే భేష్ బాగా రాశాడంటారు.ఒక్కరు చదవరు. పిల్లలు ఎప్పటిమోస్తరుగానే పోషింపబడుతూ ఉంటారు. పుస్తకాలుకాదు ఒకతల్లి అవసరం. ప్రతిఆడదాన్ని అద్భుతమైన తల్లిని చెయ్యాలి!"

"సరే! నీ ఒకతల్లి అట్లా ఉండనీ కాని, ఈవ్యాసం ఏంచెయ్య దలుచుకున్నావు?"

"ఎందుకు?"

"నాకియ్యి! పత్రికలకు పంపిస్తాను," అన్నాను.

సూరి నాచేతుల్లో కాగితాలు లాక్కుని "అంటికన్న తగలబెట్టటానికి ఒప్పుకుంటాను!" అన్నాడు.

వాడు చూడకుండా నేను నాలికకొరుక్కున్నాను. వాడి కింకా తెలీదు!—ఇంకా వారంరోజులు కూడా కాలేదు, నే నీమధ్య ఒక మాసపత్రికలో చక్కని వ్యాసంపడితే చదివి వినిపించాలని ప్రయత్నం చెయ్యటం, నేను "తెనుగన్నలారా...నడుములు కట్టుకోనుడు!" అని భావయుక్తంగా చదవగానే సూరి "షటప్, యూ ఇడియట్!" అంటూ కళ్ళు పెద్దవిచేసి నామీద లేవటం! సూరినిగురించి ఈవిధంగా రాస్తున్నందుకు వాడెప్పుడో నాపని పట్టిస్తాడు!

—కొడవటిగంటి కుటుంబరావు.

# యాచమనాయఁడు

> ఆతని అదృష్టదేవత అడిగె నిట్టులు :—
> ‘ఏటికోనవోయి యాచమా! యేది ప్రియము?
> స్వామిద్రోహిసౌఖ్యజీవనమొ, కాక
> స్వామిభక్తుని దుఃఖాలమయముగుఁ బ్రతుకొ.’
> దోయిలి మొగిడ్చి, యాచమనాయ డపుడు
> ‘దేవి! రెండవదే ప్రసాదింపు’ మనెను!
>
> —కస్తూరి రాజమాణిక్యము.

అది క్రీస్తుశకము **1614** వ సంవత్సరము, అక్టోబరు నెల. చంద్రగిరిరాజ్యాధిపుఁడు వేంకటపతిరాయలు తీవ్రరోగగ్రస్తుడై మంచము పట్టియుండెను. అప్పటికి ఆతనికి అఱువదుల మీఁద ఏడుసంవత్సరములు నిండినవి. అగుటచే నిఁక బ్రతుకనని భావించి వేంకటపతిరాయలు తన అనంతరము చంద్రగిరిరాజ్యమును పరిపాలించుటకు ఎవరినైన నియమింపవలెనని తలంచెను.

వీరవేంకటపతిరాయల భార్య వెంకటమ్మ. ఆమె గొబ్బూరి జగ్గరాజు కూఁతురు. ఆమెకు ఎంతకాలమునకును సంతానము కలుగకపోయెను. అందువలన నామె తనకు హితులైన యొక బ్రాహ్మణస్త్రీ కనిన మగచిన్నవానిని రహస్యముగఁ దెచ్చి తాను కనినట్లు వెల్లడించి పెంచుచుండెను. ఇందలి నిజము వీరవేంకటపతిరాయలునకుఁ దెలిసెను. కావున నతఁడు ఇంతకుముందు ఆబాలుని ప్రేమించలేదు చనిపోవునప్పుడాపిల్లవానికి రాజ్యమీయ తలపెట్టలేదు.

అగుటచే నాత డొకనాడు తనసామంతులనందఱిని బిలిచి యిట్లుచెప్పెను : ‘హితులారా! మాకు అవసానకాలము సమీపించినది. మా అనంతరము మీకు మా సోదరపుత్రుఁడైన శ్రీరంగరాయలు ప్రభువుకాఁగలడు. యథాప్రకారము మీ రతనిని సేవింపుఁడు.’ ఇట్లు చెప్పి ఆతడు తనవ్రేలియుంగరము తీసి రంగరాయలచేతికి పెట్టెను. రెండుమూడు దినములకుఁ బిమ్మట వేంకటపతిరాయలు దివంగతుఁడయ్యెను.

అప్పుడు రంగరాయలు చంద్రగిరిసింహాసన మెక్కెను ; కులోచితాచారముల ననుసరించి ప్రజాపాలనము ప్రారంభించెను. సామంతులందఱును ఆతని ఆజ్ఞానువర్తులై యుండిరి. వెంకటమ్మ తండ్రి జగ్గరాజు మాత్రము దీనికి సహింపలేకపోయెను. తనకూఁతురు పెంచిన బ్రాహ్మణబాలుని రంగరాయలకు బదులు రాజుగాఁజేసి యధికారమంతయుఁ దాను పొందవలెనని ఆతఁడు ఆలోచనచేసెను. అందుకని ఆతడు రంగరాయల సైనికులకుఁ బెద్దలంచములిచ్చి తనవైపునకుఁ దిప్పుకొనెను.

ఇట్లుండ పన్నుబందులు తిన్నగాఁ బంపుటలేదని కొందఱు సామంతరాజులపై రంగరాయలు కోపము చేసెను. అందుపై ఒక్కమండి వారు రాయలవిరోధియగు జగ్గరాజుతోఁ జేతులుకలిపిరి. వీరిసాయమున జగ్గరాజు రంగరాయలను సింహాసనభ్రష్టుని చేయుటకు యోచనచేసెను. రాజ్యకార్యనిర్వహణమునఁ బూర్తిగ నిమగ్నుఁడైయుండిన కారణమున రంగరాయలు జగ్గరాజు దుష్టచింతనము పసికట్టలేకపోయెను.

ఒకనాడు జగ్గరాజు రంగరాయలకిట్లు వర్తమానించెను. “మహారాజా! మీప్రజ్ఞ మాకు వెల్లడియైనది. కావున నేను, మీపై దిరుగబడిన ఇతర సామంతరాజులును వచ్చి మీపాదాక్రాంతులమగుటకు నిశ్చయించితిమి. దయచేసి మాకోరిక మన్నించి దర్శనమిప్పించవలెను.” రంగరాయ లీ వర్తమానమునకు సంతోషపూర్వకముగ ఒప్పుదలనిచ్చెను - రక్తపాతములేక నే తిరుగుబాటుదారులు లొంగివచ్చుచుండుటకు సంతోషించి వారిని సేనాసమేతముగ తనకోటలోనికి వచ్చుటకు ఆతఁడు అనుజ్ఞనిచ్చెను.

జగ్గరాజును, అతనితోఁ జేరిన సామంతరాజులును సేనాసమేతులై వచ్చి చంద్రగిరికోటలో దిగిరి. ద్రోహచింతనులైన జగ్గరాజాదు లప్పుడు కోటగుమ్మముల యన్నిఁటిదగ్గఱ తమభటులను కాపుపెట్టిరి. అందుతో రంగరాయలను జగ్గరాజు తలపెట్టిన కుట్ర వెల్లడియయ్యెను. కాని ఇప్పు డిక నేమిచేయుటకును వీలులేదు. శత్రువులు కోటలో బలవంతులై యున్నారు. అప్పుడు రంగరాయలు భార్యతోడను పుత్రులతోడను రాజమందిరమున నుండెను. ఆమందిరముననే జగ్గరాజు రంగరాయలను సకుటుంబముగా ఖైదుచేసి తనకు విశ్వాసపాత్రులైన భటుల నచ్చట కాపుపెట్టెను. జగ్గరాజువలన నింతకుముందే లంచములుతినియున్న చంద్రగిరి సైనికుల తమ చెఱయందున్న ప్రభువున కెట్టి సాహాయ్యమును తలపెట్టకుండిరి.

అంతట జగ్గరాజు తన కూఁతురు దొంగకొడుకుని 'చిక్కరాజు' అను పేరుతో చంద్రగిరిసింహాసన మెక్కించెను. "చిక్కరాజు నామనుమఁడు. వేంకటపతిరాయలు మరణకాలమున మతిచెడి చిక్కరాజునకు రావలసిన రాజ్యమును రంగరాయల కిచ్చినాడు. న్యాయముప్రకారము చిక్కరాజే రాజగుటకుఁ దగినవాడు. కావున మీరందఱును వచ్చి చిక్కరాజునకు కానుకలర్పింపుఁడు' అని అతఁడు సామంతరాజు లందఱును వర్తమానము చేసెను. జగ్గరాజునకు భయపడియో, అతనివలన లంచములుతినియో సామంతరాజు లందఱును వచ్చి క్రొత్తరాజునకు కానుకలర్పించి అతని కొలువునకు సమ్మతించిరి.

కాని ఉత్తరమల్లూరు సామంతరాజు వెలుగోటి యాచమనాయఁడు అను వెలమవీరుఁడు మాత్రము క్రొత్తరాజునకు కానుకలర్పింపలేదు; అతని కొలువునకు సమ్మతింపలేదు. అతఁడు గొప్పరాజభక్తుడు. జగ్గరాజు చేసిన ద్రోహమునకు అతఁడు మండిపడెను తన ప్రభువైన రంగరాయలను చెఱవిడిపింపవలయునని ఆస్వామిభక్తుఁడు శపథముపట్టెను. ఎనిమిదివేల సైనికులను వెంటబెట్టుకొనిపోయి ఆ వెలమవీరుఁడు చంద్రగిరి కోటను ముట్టడించెను. బహుదినములు ముట్టడిసాగెను. కాని కోటలో నతనిదగ్గఱనున్న సైన్యముకంటె రెట్టింపుసైన్యముండెను. అందుచేత దుర్గమును సాధించుట దుర్ఘటమని భావించి యాచమనాయఁడు తన పట్టణమగు ఉత్తరమల్లూరునకుఁ దిరిగిపోయెను. "రంగరాయలను చెఱ విడిపించుట కిఁక మార్గమేమియున్నదా!" అని అతఁ డాలోచించుచుండెను.

అంతట జగ్గరాజు యాచమనాయకున కిట్లు కబురు పంపెను. "నామనుమఁడే చంద్రగిరికి న్యాయము ప్రకారము రాజగుటకుఁ దగినవాడు. కావున వానికిఁ బట్టాభిషేకము చేయుటకు నీసమ్మతిని తెలుపుము. వచ్చి నీప్రభువునకు కానుకలర్పింపుము. లేనిచో నేను ప్రచండసేనాసమేతుడనై వచ్చి నిన్ను మూలమట్టము చేయుదును." దీనికి యాచమనాయఁడు "నీవు మనుమఁడను చున్న బాలుని తల్లి యెవరో తెలియదు. తండ్రి యెవరో తెలియదు. అతని కులమేదో తెలియదు. గోత్రమేదో తెలియదు. తన తరువాత రంగరాయలే రాజగుటకుఁ దగినవాఁడని వీరవేంకటపతిరాయలు సరదారుల అందఱి యెదుటఁ జెప్పి చనిపోయినాడు. కావున మాకు రంగరాయలే రాజు. అతనికే మేము కానుకలర్పింతుము. కాని ఈ కానిరాజున కర్పింపజాలము. రాజద్రోహివగు నీవు ప్రచండసేనాసమేతముగ వత్తునని బెదిరించిన ఈ రాజసేవకుఁడు భయపడువాడు కాడు. నీ వెప్పుడు ఎత్తివచ్చినను ఎదిరించుటకు యాచమనాయఁడు సంసిద్ధుడై యున్నాడు." అని జగ్గరాజునకుఁ దెలియజేసెను.

ఇందుమీఁద జగ్గరాజు ఆగ్రహోదగ్రుఁడయ్యెను. వెంటనే సేనల కూర్చుకొనిపోయి యాచమ నాయని నిర్జింపవలెనని ఆతడు తలఁచెను. కాని తాను చంద్రగిరి విడిచి ఉత్తరమల్లూరుపై దండయాత్రకుఁ బోయినచో సామంతరాజులు క్రొత్తరాజును కాదని రంగరాయలను తిరిగి రాజుగాఁజేతురేమోయని అతఁడు సంశయించెను. అగుటచే నాతఁడు దండనీతి వదలి సామోపాయమున యాచమనాయని లోఁబఱచుకొన తలఁచెను. అప్పుడాతడు నాయనికిట్లు జాబు వ్రాసెను. "యాచమనాయఁడా! నీవు గొప్పవీరుడవు.

నిన్ను ఎదిర్చిపోరుట కెవరును జాలరు. నీవు వచ్చి నా పక్షమునకు అంకితుఁడవైనచో నీకు గొప్పగొప్ప బిరుదములిత్తును; బహుభూములు బహుమానము చేతును; సామంతరాజులలో నతిశ్రేష్ఠునిగఁజేసి నిన్ను గౌరవింతును." దీనికి యాచమనాయఁడు "నీ విచ్చు బిరుదు తోఁకలపై నాకు భ్రమలేదు; భూమి బుట్టపై నాకు బుద్ధిలేదు. రాజద్రోహివి నీవుచేయు గౌరవముతో నాకు నిమిత్తము లేదు." అని కచ్చితముగ బదులు వ్రాసెను.

పిమ్మట యాచమనాయఁడు చెఱసాలలో నున్న రాయలను విడిపించుటకు విశ్వప్రయత్నములు చేసెను. అట్టి ప్రయత్నములన్నిటికిని యేదోయొక విశ్వామిత్రము వచ్చి భగ్నమగుచుండెను. అగుటచే ముందు రాయల పుత్రులలో నొకనిని తనవద్దకుఁ దెప్పించుకొనుటకు అతఁడు ప్రయత్నములు సాగించెను చంద్రగిరి చెఱసాలలో నున్న ఖైదీలకు బట్టలుదుకు చాకలివాండ్రలో నొకనిని యాచమనాయఁడు చేరఁదీసి చనువు చేసెను; లంచమిచ్చి యాతఁడు వానిని మంచిమాట చేసికొనెను. నమ్మకము కుదిరిన పిమ్మట యాచమనాయఁ డొకచీటివ్రాసి చాకలివాని కిచ్చి ఇట్లు చెప్పెను: "ఈచీటి రెండవకంటివానికిఁ దెలియకుండ దీసికొనిపోయి ఖైదులోనున్న రాయలకుఁ జూపింపుము. ఏవిధముననైన ఆయన కుమారులలో నొకనిని రహస్యముగ తీసికొనిరమ్ము. ఇట్లు చేయుదువేని నీ యిల్లు బంగారపుబరిణె చేయుదును." అందుమీఁద చాకలివాఁ డాచీటి ఉదికిన దోవతులలోఁబెట్టి రహస్యముగ తీసికొని వెళ్ళి చెఱసాలలో నున్న రాయల కిచ్చెను. అదిచూచి రంగరాయలు యాచమనాయని భక్తికి మిన్నందెను; చాకలివానితో రహస్యముగ నిట్లు చెప్పెను: "నా రెండవకుమారుఁడు పండ్రెండు సంవత్సరముల బాలుఁడు. రహస్యముగఁ గొనిపోవుటకు వీలుండును. కావున వానిని తీసికొనిపొమ్ము." అప్పుడు చాకలి వాఁ డొకతట్టలో అడుగున మురికి బట్టలు పఱచి రాజకుమారుని వానిమీఁద పరుండబెట్టెను. పైన మరల మురికిబట్ట లుంచెను. ఆ గంప నెత్తిమీఁదఁ బెట్టుకొని ఆ చాకలి చెఱసాలవాకిలి దాఁటెను; కోట గుమ్మములు దాటెను. బయటికి వచ్చెను. కోటవాకిలి వారెవ్వరును అతనిని అనుమానింపలేదు.

అట్లు రాజకుమారుని తీసికొనిపోయి చాకలివాఁడు యాచమనాయని కప్పగించెను. అప్పు డాస్వామిభక్తుని హృదయము బ్రహ్మానందమున నుత్తరంగిత మయ్యెను. చాకలివానికి గొప్ప పసదనమిచ్చి సాగనంపి నాయఁడు రాజపుత్రుని తనదగ్గఱ ఉంచుకొని పెంచుచుండెను. అనంతర మాతఁడు రంగరాయలను చెఱవిడిపించు ప్రయత్నములలో నిమగ్నుఁ డయ్యెను.

ఒకనాడు యాచమనాయఁడు నమ్మకమైన ఇరువదిమంది సైనికులను పిలిచి "మీరు చంద్రగిరికి వెళ్ళి యచ్చటి చెఱసాలపాలకుని దగ్గఱ ఉద్యోగము సంపాదింపుఁడు. ఏవిధముననైనను రంగరాయలను చెఱవిడిపించు ప్రయత్నములు చేయుఁడు." అందుమీఁద నా యిరువదిమంది సైనికులును చంద్రగిరికి వెడలిపోయిరి; అచ్చటి చెఱసాల పాలకునితోఁ జెలిమిచేసిరి; అతని దగ్గఱ ఉద్యోగమునఁ బ్రవేశించిరి.

వారు రహస్యముగ బయటనుంచి రంగరాయల గదికి ఒక సొరంగము త్రవ్వ నారంభించిరి. లోకమంతయు నిద్రాముద్రితమై యుండు అర్ధరాత్రముల యందే వారీ రహస్యపుఁ గార్యమును నిర్వర్తింపవలసి యుండెను. చీకటిని మాత్రము చూపింపగల చిన్న కాగడాసాయమున వారా సొరంగమును దినముల వెంట త్రవ్వి కృతకృత్యులైరి. సొరంగము రాయలగది వఱకు ఏర్పఱుపబడెను. ఉన్నట్టుండి సొరంగముగుండ పలువురు సైనికులు తనమందిరమున ప్రవేశించినందులకు రాయలు ఆశ్చర్యచకితుఁడయ్యెను. వీరు జగ్గరాజు ఆదేశమునంది తన్ను అవమానించుటకు వచ్చిరని అతడు తొలుత భావించెను. కాని వారందఱును అతనికి సాగిలిమ్రొక్కి యాచమనాయఁ డిచ్చిన ఉత్తరమును చూపిరి. నాయఁడు తనయెడల గనబఱచుచున్న అవధిలేని భక్తివిశ్వాసములకు రాయలు నిర్భరానందము నొందెను. వా రాసొరంగము గుండ రంగరాయలను, అతని భార్యను, బిడ్డలను బయటికిఁ దీసికొని వచ్చుచుండిరి. ఊపిరి పీల్చునప్పుడు లోన దూరెడు

దుమ్ముకు ఉక్కిరి బిక్కిరి యగుచు, పైనుండి పడెడు మట్టి బెడ్డల కముకుదెబ్బలను సహించుచు ఆరాజకుటుంబము అస్వాతంత్ర్యము పీడని - స్వాతంత్ర్యము పొందని పశుమస్థితిలో ముంజేతులమీద, మోకాళ్ళమీద ప్రాకుచు ముందుకు సాగుచుండిరి. ఊపిరి పట్టువిడుపుల సవ్వడి తప్ప మఱియెట్టి సవ్వడియు లేదు. సొరంగముద్వారము చూపుమేరలో నుండెను. కాని ఇంతలో పెద్దఅండ ఒకటి విఱిగి పడెను. మఱియొక పెద్ద అండ. దానితో పాటు ఒక మనుష్యుడు. కోటలో పారా యిచ్చుచున్నవా డొకడు చుట్టివచ్చుచు తాను పట్టుకొన్న కాగడాతోఁగూడ నా సొరంగమున దిగఁబడెను. కత్తులు దూయుటకు సందులేదు. రాజరక్షణము దుస్తరము. సొరంగమార్గమున కడ్డముగ కావలివాడు పడెను. వాడు పెద్దగోల చేసెను. ఆగోల విని పదిమందియు నచటకు వచ్చిరి. జగ్గరాజుకూడ వచ్చెను. మొలకు కట్టిన అంగవస్త్రముతో, దైన్యమునకు తావలమై యున్న ముఖముతో, ధూళిధూసరితమైన శరీరముతో, చీరుకపోయి నెత్తురులు చిమ్ముచున్న మోకాలిచిప్పలతో రంగరాయలు జగ్గరాజు ఎదుట నిలబెట్టబడెను. జగ్గరాజు కోపోద్రిక్తుడై రంగరాయలను ఒక మందిరమున, ఆలి ఆలుబిడ్డలను మఱియొకమందిరమున బంధించెను; రాయలను చెఱవిడిపింపఁ బ్రయత్నించిన సైనికుల నందఱిని ఆతఁడు చంపించివైచెను.

తన ఈప్రయత్నము నెఱవేఱకపోయినను యాచమనాయఁడు దిగులుపడలేదు. తిరిగి ప్రయత్నము చేయుచుండెను. చంద్రగిరిసేనానాయకునకు లంచమిచ్చి యాతఁడు వేగులవాండ్రవలన వానికి "జగ్గరాజు చంద్రగిరిలోలేని సమయమున నీవు బందిఖానా కావలివాండ్రను చంపి నాకు వర్తమానముచేయుము." అని కబురు పంపెను. చంద్రగిరి సేనానాయకుఁ డట్లు చేయుట కొప్పుకొనెను. జగ్గరాజు లేనిసమయమును చూచి యాతఁడు చెఱసాలకావలివాండ్రను చంపెను. పిమ్మట నాతఁ డీసమాచారమును తెలుపుచు యాచమనాయనిపేర ఉత్తరము వ్రాసెను; ఆయుత్తరమును నమ్మకమైన దూతకిచ్చి నాయనివద్దకుఁ బంపెను. కాని యా దూత నెట్లో జగ్గరాజు పట్టుకొనెను. కుట్ర తెలిసికొని కోటలోఁ బ్రవేశించి జగ్గరాజు సేనానాయకుని చంపించెను; రాయలను, అతని కుటుంబమును తిరిగి ఖైదు చేసెను.

యాచమనాయఁ డీసంగతి వినెను. యుద్ధము చేసి చంద్రగిరికోటను పట్టుకొనినగాని యింక వీలులేదని నాయఁడు తన సేనల నభివృద్ధిచేయసాగెను. ఆసంగతి తెలిసికొని జగ్గరాజు తన సోదరుడగు ఓబలరాజు సాహాయ్యము నర్థించెను. హత్యలు కావించుటలో ఓబలరాజు సాటిలేని వాడు. అతనితో జగ్గరాజిట్లు చెప్పెను: "రంగరాయలను చెఱవిడిపించు యత్నమున యాచమనాయుడు విసుగు విరామములు లేక నన్ను వేధించుచున్నాడు. భూములు, వెలలేని నగలు, లెక్కలేనంత ధనము ఈయగలనని చెప్పినను నాయఁడు లొంగలేదు. రంగరాయలు బ్రతికి యుండగా ఆరాజభక్తుడు మఱియొకనికి సామంతుడుగాడు. రంగరాయలు లేకుండ నుండుచో మనకు సర్వవిధముల మంచిది. ఇకమీదటి పని నీ చేతులలో నున్నది."

వ్యాధకృత్య మనిన ఓబలరాజునకు పెద్ద పండుగ. చురుకుకాళ్ళతో అతడు రంగరాయలున్న చెఱసాల గదిలో ప్రవేశించెను. "నీ వీలోకమును వీడవలసిన కాలము వచ్చినది. నీ ప్రాణములను నీవే కడతేర్చుకొందువో లేదా అపనిని ఇతరుల కత్తికి అప్పజెప్పెదవో నిర్ణయించుకొనుము" అని ఓబలరాజు పలికెను. రంగరాయలు ఇది వినెను. చనిపోవుటకు తాను సంసిద్ధుఁడే. ఇంతలో ఆతనికి ఆలుబిడ్డలు జ్ఞప్తికి వచ్చిరి. తాను చనిపోయిన పిమ్మట వారికిడగండ్లకు అవధియుండునా? యోచించెను. 'ఓబలరాజా! చనిపోవుటకు ముందు నా ఆలుబిడ్డల నొకసారి చూడ కోరికగలదు.' అని రాయలు చెప్పెను.

ఆనాటిరాత్రి సొరంగములో పట్టుపడి వారు విడివిడి తావుల బంధింపబడిరి. నాటికి నేడు తిరిగి వారు ఒండొరులను చూచుకొనిరి. ఆచూపులలోనే భర్త ప్రశ్న, భార్య సమాధానము. రంగరాయలు కత్తి దూసెను. అలనాడు తాను కట్టిన మంగళసూత్రము వ్రేలాడుచున్న

ఆమె గుండెకాయమీద వేసి ఆతఁడు ఆకత్తితో పొడిచెను. ఇద్దరు మగబిడ్డలను, ఒక ఆడుబిడ్డను పొడుచుటకు ఆతని కత్తి జంకలేదు. ఇక మిగిలినది ఒక చిన్న ఆడుబిడ్డ - తన ప్రేమైకనిధానము ఏడ్చుట ఎఱుఁగక ఆ వీరపుత్రిక కన్నులు దైన్యమును ద్రవ్వుచు కత్తివేటుకు ఎదురు చూచుచుండెను. తన మానము, తన వంశప్రతిష్ఠ కాపాడుకొనుటకే యగుగాక, ఆతఁడు ఆ బిడ్డపై కత్తి ఎత్తలేకపోయెను. ఎత్తలేకపోయిన ఆ కత్తిని ఆతఁడు నిరభ్యంతరముగ తన హృదయమున పాతివైచెను. రాచపురుగు ఒక్కటికూడ లేకుండుటకై ఓబలరాజు ఆ చిన్నబిడ్డను తన కత్తితో నఱికివైచెను. యాచమనాయని కడనున్న రాజకుమారుఁడు తప్ప మిగిలిన రంగరాయని కుటుంబమంతయు ఆనాఁ డట్లు అంతమయ్యెను.

"ఆపిశాచాకాశపథమునం దలముకొనిన
వేదనామయహాహారవమ్ము వలన
విశ్వహృదయము తీవ్రనిర్వేదనమున
ఆపుకోలేదు విపులవిలాపగీతి....
ఆయమానుషమలినహింసాచరణము
ఆ భయావహకలుషహత్యాచరిత్ర
వ్రాయబడిన ఆరక్తాక్షరాలరచన
చెఱిగిపోదట, యీనాటివరకుకూడ."

తన ప్రభువు చెఱసాలలో ఘోరముగ మరణించిన వృత్తాంతము తెలిసికొని యాచమనాయఁ డంతులేని దుఃఖమును పొందెను. పొంగి పొర్లివచ్చుచున్న దుఃఖము నెట్లో దిగమ్రింగుకొని యాతఁడు జగ్గరాజున కిట్లు వర్తమానము చేసెను: "రంగరాయల రెండవ కుమారుఁడు రామరాయ లింకను జీవించియున్నాఁడు. అతఁడు నాదగ్గర పెరుగుచున్నాఁడు. అతనిని, అతనిని రక్షించుచున్న నన్ను చంపి పిమ్మట నీమనుమనిచే చంద్రగిరిరాజ్య మేలించుకొనుము."

జగ్గరా జీసంగతి విని యదరిపడెను. ఎంత జాగ్రత్త పడినను ఒక రాచపురుగింకను మిగిలియున్నందుల కతని కెక్కడలేని విచారము కలిగెను. "అంతులేనిరాజభక్తి కల యాచమనాయఁడు రంగరాయల కుమారునకు చంద్రగిరిరాజ్యము లభించువఱకు నిఁక నిద్రపోవఁడు."
అని జగ్గరాజు భయపడెను. భయపడి జగ్గరాజు "సంధి చేసికొందము" అని యాచమనాయనికి వర్తమానించెను.

అప్పుడు నాయఁడు జగ్గరాజున కిట్లు బదులు చెప్పెను: "నీవు రాజద్రోహివి. నేను రాజభక్తుఁడను. నాకును నీకును సంధికుదురదు. రంగరాయల కుమారుడు నా ప్రభువు. అతనికి రాజ్యము నిలుపుట నాధర్మము. నా కంఠములోఁ బ్రాణము లున్నంతవఱకు నేనాపని మానను. నా ప్రభువునకు రాజ్యమైన నిలుపవలెను. లేదా ఆప్రయత్నమునఁ బ్రాణములైన పోయవలెను. రాజసేవకుఁడనైన నా కింతకంటె వేఱుపని లేదు."

యాచమనాయఁడు చెప్పిన మాటలకు మెచ్చి తంజావూరి రఘునాథరాయలను ఒక గొప్పరాజతనికి సాయము వచ్చెను. ఏఁబదివేలమంది సైనికులను వెంటఁబెట్టుకొనిపోయి నాయఁడు చంద్రగిరికోటను రెండు సంవత్సరములు ముట్టడించెను. జగ్గరాజు మఱల సంధి మాటలు జరిపెను. కాని రాజభక్తుఁడైన యాచమనాయఁ డామాటలను వినిపించుకొనలేదు. అప్పుడు చేయునది లేక జగ్గరాజు కోటవిడిచి పాఱిపోయెను.

యాచమనాయఁడు కోటను స్వాధీనము చేసికొని, లోనఁ బ్రవేశించెను; ప్రాతయుద్యోగస్థులను తీసివేసి వారిస్థానమున నమ్మకమైనవారిని ఏర్పాటుచేసెను. ఒకనాఁడు సామంతరాజులును, సరదారులును, చంద్రగిరి ప్రజలును పెద్దసభ తీరియుండిరి. అప్పుడు యాచమనాయఁడు రంగరాయలకు సంబంధించిన కిరీటము మున్నగు రాజచిహ్నములను తెచ్చి రామరాయల కర్పించెను. మురికిగుడ్డలతట్టలో దాచబడి చాకలివాని సాయమున చెఱనుండి విడివడి రాజభక్తుఁడగు యాచమనాయని సడలుట యెఱుఁగని దీక్షవలన ఆనాఁడు రామరాయలు చంద్రగిరిరాజ్యమునకు పట్టాభిషిక్తుఁడయ్యెను.

యాచమనాయని రాజభక్తికి సామంతరాజులును, సరదారులును, చంద్రగిరిప్రజలును చాలసంతోషించిరి. "చంద్రగిరిరాజ్యమునకు మంత్రిగా నుండవలసినది." అని వారు యాచమనాయనిని మిక్కిలి వేడిరి. అప్పు డాతఁడు వారి కిట్లు చెప్పెను: "నేను రాజసేవకుఁడను.

నా ప్రభువువారి రాజ్యము పోయినప్పుడు తిరిగి దానిని నిలుపుటకు నేను ప్రయత్నించితిని. నా ప్రయత్నము నెగ్గినది. నాకిదియే పదివేలు. మంత్రిపదవుల కొఱకుఁగాని, మఱియొక లాభముకొఱకుఁగాని నే నీపని చేయలేదు.” ఇట్లు చెప్పి యాచమనాయఁడు తనపట్టణమగు ఉత్తరమల్లూరునకు వెళ్ళిపోయెను.

వెలుగోటి యాచమనాయని స్వామిభక్తి పొగడి చెప్పుటకు వేయినోళ్ళయినను చాలవు. అసలు రాజును ఖయిదులోఁ బెట్టి యూరుపేరులేని పిల్లవానిని సింహాసన మెక్కించి జగ్గరాజు చెప్పరాని ద్రోహము చేసెను. డబ్బుకక్కుఱితికల సామంతరాజు లందఱును జగ్గరాజువలన లంచములుతిని యతఁడుచేసిన రాజద్రోహమున కొప్పుకొనిరి. సాటిలేని స్వామిభక్తి కల యాచమనాయఁడు మాత్రము మిట్టి యన్యాయమున కంజవేయలేక పోయెను. చెఱలోనున్న తన ప్రభువును విడిపించుటకతఁడు విసుగు విరామములు లేక ప్రయత్నముల మీఁదఁ బ్రయత్నములు చేసెను. తుదకుఁ దనరాజు రెండవకుమారుని బందిఖానాలోనుంచి తనవద్దకు రప్పించుకొనఁగలిగెను. రాజద్రోహియైన జగ్గరాజును పాఱఁద్రోలి తనరాజు రెండవకుమారుని చంద్రగిరి రాజ్యమునకుఁ బట్టము కట్టెను. ఇట్లు చేయుటలో నాతఁడు ఎట్టిని యోగానికి ఆశించలేదు; సరికదా తనధనము, తనసేన రాజుకొఱకు నీళ్ళవలె ధారపోసెను.

యాచమనాయఁడు స్వలాభము చూచుకొనక స్వామికార్యము నెఱవేర్చిన గొప్ప రాజభక్తుఁడు. అతఁడు చనిపోయి ఇప్పటికి మూఁడువందల సంవత్సరములు దాఁటిపోయినవి. ఇప్పటికిని జను లతనిని మఱచిపోలేదు. ఇఁక నెప్పటికిని మఱచిపోవరు. గొప్పగుణములు కలవారు చనిపోయినను వారికీర్తి కలకాలము నిలిచియుండును.

‘కథకుడా! ఎందుకోస మీకతలు త్రవ్వి
కలచివైతువు బరువైనతలపు లెదల?
ఇవి యెవో కాని నిదుర లేచెడిని, ఆంధ్ర
వీరయుగముల స్వాప్నికస్మృతులో, యేమొ.’

—కస్తూరి రాజమాణిక్యము.

# బెర్నార్డుషా : కొన్ని కతలు

బెర్నార్డుషా ఒకసారి ఒక సెకండుహాండు బుక్కుషాపులోనికి పోయెను. నచ్చినపుస్తకములు ఏమైన ఉన్నచో కొనదలచి అత డాపుస్తకములను తిరుగవేయుచుండెను. అట్లు తిరుగవేయుటలో అతనికి తాను రచించిన నాటకముల సంపుట మొకటి చేతికివచ్చెను. ‘జార్జి బెర్నార్డుషాయొక్క అభివందనములతో’ అను తన చేతివ్రాతతో అత డాపుస్తకమును లోగడ ఒక మిత్రునకు ఇచ్చియుండెను. తాను హృదయపూర్వకముగ ఇచ్చిన పుస్తకమును సెకండుహాండు బుక్కుషాపులోనికి పోవునట్టి అజాగ్రత్తతో చూచిన ఆమిత్రుని యెడ షా కినుక వహించి ఆపుస్తకముల వర్తకుడు చెప్పిన వెల ఇచ్చి దానిని కొని ‘జార్జి బెర్నార్డుషాయొక్క పునరభివందనములతో’ అని వ్రాసి తన తొలుతటి మిత్రునకు దానిని పంపెను.

ఉపన్యసించుచు సభ్యులమనములను చూఱగొనుటలో బెర్నార్డుషా ప్రతిభ అతిలోకమైనది. ఒకనాటి సాయంకాలము సభలో ఉపన్యసించుచు అత డిట్లు చెప్పెను: “తొమ్మిదింటికి ఇప్పుడు పావుగంట తక్కువగా ఉన్నది. ఇప్పటికి నలుబది నిముసములుగా ఉపన్యసించుచుంటిని. సరిగా తొమ్మిదిగంటలకు ఉపన్యాసము ముగింతును.” తొమ్మిది గంటలు కావచ్చినది. షా ఉపన్యాసము విరమించి ఆసీనుడగుటకు ఆయత్తపడుచుండెను. సభికులు ఇంకను అతని మనోహరమైన ఉపన్యాసము వినవలయునని కుతూహలాయత్తచిత్తులై యుండి “ఉపన్యాసము విరమింపవద్దు, ఇంకను ఉపన్యసింపుడు” అని కేకలువైచిరి. “మీరు నిజముగా నే నింకను ఉపన్యసింపవలయుననియే కోరుచున్నారా?” అని సభ్యులవైపు తిరిగి షా ప్రశ్నవైచెను. “అవును. కోరుచున్నాము. తప్పక ఇంకను ఉపన్యసింపుడు” అని సభికులు ఐక్యకంఠమున బలికిరి. “ఈత డింకను ఉపన్యసించిన బాగుండునని సభికులు తలచు సమయముననే అనుభవశాలియైన ఉపన్యాసకుడు తన ఉపన్యాసమును విరమించును” అని చమత్కారముగ బలుకుచు అతడు ఆసీనుడయ్యెను. సభికు లెల్లరు ఆశ్చర్యచకితులైరి.

# మాతృవందనము

ప్రియముగ మాతృభూమిని భరించుచున్నవి న్యాయవృత్తి, దీ
క్షయును, దమంబు, దేజమును, జ్ఞానము, యజ్ఞము, వృద్ధి, సత్కీ
ర్తియును, నిరంతరంబుగఁ దదీయమహత్త్వముచేత సర్వదా
జయముల కాటపట్టయి భాసంగును భారతవర్షమెంతయున్.

అలసతయుం బ్రమత్తతయు, నాశయమందునఁ జేరనీక ని
ర్మలమతి వేల్పులెల్లరును మాతృవసుంధర నేలుచున్నవా
రలు ; నిఖిలప్రియార్థనికరంబుఘటించి యస్య తేజముం
బలమునొసంగి శ్రీభరతమాత మముం గృపజూచుటబ్రమే.

స్థిరతయు, విశ్వరూపమును జెంది నిరంతరసస్యమూర్తి వై
భరణగుణాభిరామమయి భాసిలు నిన్నద నక్షతుండ నై
స్మరణమొనర్చి నీపయిని సంతతమున్ విహరింతు నీమహా
గిరులును గానవంబులు సుఖింపఁగ మమ్ము ననుగ్రహించుతన్.

ప్రజలకు నుచ్చనీచసమభావము లెచ్చట సౌఖ్యదంబులై
విజయమునొందు, నెందు గుణవిస్తృతి దాలుచునో మహౌషధీ
ప్రజము, ప్రసన్నకాంతినికరం బలరారఁగ నెందుఁ జంద్రికా
రజని దలిర్చు నా భరతరాజ్యరమణి మది సంస్మరించెదన్.

నదులు జలాశయంబులు జనంబులకున్ సుఖదాయకంబులై
పొదలఁగ, సర్వధాన్యములు భూతహితార్థముగా ఫలింప, న
మ్మదమునఁ బ్రాణిజాతము సమస్తము నుల్లసిలంగ నొప్పు న
భ్యుదయనిశాంతయౌ భరతభూమి ఘటించుత మాకు భోజ్యముల్.

అసురుల వేల్పు లిందుఁ దెగటార్చిరి. కర్మలొనర్చి పానులిం
దెసఁగిరి, గోవులశ్వచయ మేనుగులు జంతువులున్ బతంగరా
డ్విసరము లిందె సౌఖ్యముగఁ బెంపలరారుచు నున్న యీ సుఖా
వసథము మాతృదేశ మనిశంబు జయార్థుల మమ్ము నచ్చుతన్.

జనులు కోలాహలసకలదిఙ్ముఖులై డంబుమై మెలఁగు క్రీడాస్థలంబు
శూరశిరోమణుల్ వీరప్రసంగసంగతులతోఁ గాలంబు గడుపుతావు
రణదుందుభుల ధణంధణనినాదములచే నెనసి ప్రతిధ్వను లెసఁగుచోటు
ప్రజలవాక్కుల సుధారసమాధురీధురీబంధురం బొనరించు భావవీధి

మాతృదేశము, భరతసామ్రాజ్యలక్ష్మి
నిస్సపత్నులుగా మమ్ము నిర్వహించి
రక్షు

ప్రజల లోపలఁ బరిపూర్ణభావ మెలమి
గోర్కి నిండారఁగా సమకూర్పుఁ గాత.

ధనవంతు లనుసరింపఁగ
జననీ నీసుతులు వీరసత్తములు యశో
ధనులై, ధనులై, సుఖసా
ధనులై వర్తింత్రుగాత పావకకరుణన్.

శాంత, సువాసిత, సుఖద
స్వాంత, సుధారసకలిత, పయస్విని యగు నిన్
జింతింతు ధీరవాక్కుల
సంతతమును నాజ్ఞయిమ్ము జనులకు జననీ!

బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్ర నిషాదజాతులు నీగర్భజాతులమ్మ
విద్వద్వణిక్శిల్పివీరసామురులు నీ ప్రోపానపడు ప్రియపుత్రులమ్మ
భరణ శీలారణ్య పశు సమూహంబు నీ వలనఁ జెన్నగు హితవర్గమమ్మ
ప్రాణిజాతికి సుధాప్రాయరశ్మి యొసంగు రవిసుధాంశులు నీశరణ్యు లమ్మ

వివిధవాఙ్మయసేవకుల్ వివిధధర్మ
రతులునగు పుత్రకులు నేకరాజ్యజనులు
సమతి దనరారు నెలవ! మా జన్మభూమి
పున్నెములపంట మమ్ములఁ బ్రోవుమమ్మ.

మాతృభూమి! నీదు మండలంబున రవి
కిరణకాంతు లెంతవఱకు నరయఁ
గలవో యంతవఱకుఁ గావింపఁ బోకుమీ
హీనదృష్టి నాకు నెన్నఁడేని.

మము ద్వేషించుచు దాస్యకర్మ లొనరింపన్ మాకుఁ బ్రోత్సాహులై
వినుతిన్ సేనల మాపయిం బఱపి మాపెంపెల్లఁ బోకార్చు క్రూ
ర మనస్కుల్ గలరేని వారల మనోరాజీవముల్ ప్రేమపూ
రమరందావృత మాచరింపఁగదె! ఆర్తత్రాణదీక్షావతీ!

శుభము లొసఁగుచున్న శుద్ధాంతరంగవు
అరులు లేని శుద్ధచరిత వీవు
సుతులమైన మాకు సుస్థానమగుమమ్మ
భవ్యగుణసమేత! భరతమాత!

(పృథ్వీసూక్తమునకు అనువాదము)

— శేషాద్రి రమణ కవులు.

# అపరిచిత

## ౧

ప్రస్తుతం నా వయస్సు 27 సంవత్సరాలు. కాలేజీలో ప్యాసు కావలసిన పరీక్షలన్నీ నేను ప్యాసయి పోయేను బాల్యావస్థలోనే మా నాన్నగారు కాలంచేసేరు. వకాల్తీ చేసి చాలా డబ్బు గడించినా అందులో కించిత్తైనా అనుభవించడాని కాయన కవకాశం లేకపోయింది. చచ్చిపోయే ముందేమనుభవించేరో అంతే. ఆయన చచ్చిపోయే సరికి నాకు బొత్తిగా చిన్నతనం. మా అమ్మ చాలా పేదింటిపిల్ల. అంచేత ధనం బాగా వున్నప్పటికీ, మా అమ్మ సంసారపక్షంగానే కాలక్షేపం చేస్తూ వచ్చేది. చిన్నప్పటినించీ నేను చాల అల్లారుముద్దుగా పెరగడం చేతనో, ఏమిటోగాని, నా కీడుకు తగ్గ శరీరసౌష్ఠవం లేకపోయింది. ఇప్పటికేనా సరే నేను అన్నపూర్ణాదేవి ఒళ్ళో విఘ్నేశ్వరుడి తమ్ముడు కార్తికేయుడు లాగ కనిపిస్తాను.

అసలు నా కేజంటు మా మేనమామే. అతడు నా కంటె మహా వుంటే ఆరుసంవత్సరాలు పెద్ద వుంటాడేమో. కాని, అంతర్వాహినీ ఫల్గునీ నది యిసకలాగ మా కుటుంబాన్నంతట్నీ కూడా తనలో యిమిడ్చేసుకున్నాడు. అంతా లోపలి స్వయంపాకం అతనుండడం చేత సంసారతాపత్రయం నాకేమీ వుండేది కాదు.

నేను సత్పాత్రుడననీ, తగిన వరుణ్ణనీ ఏ కన్యాదాతయినా ఒప్పుకోక మానడు. చుట్ట సహా కాల్చను కదా. అమ్మ చెప్పినట్లల్లా అక్షరాలా నడుచుకొనే ఓర్పు నాలో పూర్తిగావుంది—నాలో అన్నిగుణాలూ ఉన్నాయి కాని తల్లిమాట జవదాటే శక్తిమాత్రం లేదంతే. ఎలాగయినా నన్నొక తగుమనిషని చెప్పొచ్చును.

నా వివాహానికి చాలా గొప్పగొప్ప సమంధాలు వచ్చాయి. కాని నా యేజెంటు—మా మేనమామ నా వివాహసంబంధంలో ఒక విశేషాభిప్రాయంతో వుండేవాడు. సామంతుల పిల్ల అతనికిష్టం లేదు. కోడలు ఇంట్లో అణిగి మణిగి వుండాలని అతనుద్దేశం. కాని డబ్బంటే ఆశకూడా బాగావుంది. వియ్యంకుడు విశేష ధనవంతుడు కాకూడదుట. అయినప్పటికీ, కట్నాలూ, కానుకలూ యివ్వడంలో యేలోటుబాటూ రానివ్వకూడదుట. బాగా పిండేడానికి వీలుగావుండాల్ట. ఒకవేళ తనపిల్లనిచూడ్డానికొస్తే యేలోటుపాట్లు (ఆదరణలో) జరిగినా గడుపుకుపోయేవాడుగా వుండాల్ట.

నామిత్రుడు హరిబాబు కాన్పూరులో పనిచేస్తున్నాడు. వాడు సెలవల్లో కలకత్తా వచ్చి నామనస్సును కలతబెట్టేడు. "యిదుగో! నువ్వు నిజంగా పెళ్ళి చేసుకోదల్చుకుంటే నాయెరికి నొకమంచిపిల్ల వుంది" అన్నాడు.

అంతకిక్రితమే నేను ఎమ్.ఏ. ప్యాసయి వున్నాను. ముందేమి చేయాలో నా కగమ్యగోచరంగా వుండేది. ఎంతచూసినా ప్రపంచమంతా ఎడారిలాగ కనిపించేది. ఒక పరీక్షనీ లేదు. నౌఖరీ అసలేదు. భూమీ పుట్టామీదా లేను. ఇంట్లో అమ్మా, వీధిలో మామా తప్ప నాకు మరేమీ కనిపించడంలేదు. ఈ లోకమనే యెడారిలో నా హృదయానికి ప్రపంచమంతటా మయమై పోయిన స్త్రీరూపమనే యెండమావులు గోచరిస్తూ వుండేవి—ఆకాశాన్ని దాని స్నిగ్ధనీలదృష్టి కనపడేది. గాలిలో దాన్ని నిశ్వాసం ప్రకంపితం అయినట్టుగానూ, చెట్ల యొక్క మర్మరధ్వనిలో దానిగుప్తసందేశము యిమిడి వున్నట్టూ కనపడేది. అల్లాంటి సమయాన్ని హరిబాబు వచ్చి "నాయెరికిని మంచి సంబంధం ఉం"దన్నాడు. అనేటప్పటికి నాశరీరం, మనస్సున్నూ వసంతపవనానికి పొగడచిగుళ్ళలాగ యెండాసీడల మధ్య అల్లల్లాడి పోయాయి.

హరిబాబు మహారసికుడు. ఏదైనా వర్ణించడానికి మరి వాణ్ణే చెప్పాలి. నాకూ చాలా ఆదుర్దాగా వుంది,

"అయితే మామయ్యతో యీసంగతి కదిపి చూడ"మన్నాను.

హరిబాబు వాగ్ధాటికి మామయ్యకూడా లొంగిపోయేడు. కోడలికంటె వియ్యంకుడి భోగట్టా తెలుసుకోవాలనే రకంలోవాడు మామయ్య. హరిబాబు మాటలవల్ల, వియ్యంకుడి స్థితిగతులు తన మనస్సుకు నచ్చినట్లే వున్నాయని అనుకున్నాడతను. ఒకప్పుడు వాళ్ళ వంశం సిరిసంపదలతో తులతూగుతూండేదిట. కాని ప్రస్తుతం ఆ ఉచ్ఛదశ అంతా తగ్గిపోయి నప్పటికీ కొంత ఆస్తి మట్టుకు శేషించివుంది. స్వస్థలంలో ఆ స్వల్ప ఆస్తితో పరువుప్రతిష్టలతో కాలక్షేపం చెయ్యడం కష్టమని చెప్పి యిప్పుడు పడమటనే యేదో విధంగా కాలం గడుపుతున్నారుట. ఒక్కగా నొక్క కూతురుట. అంచేత యిప్పుడున్న ఆస్తి కాస్తా యీపిల్లకి రాసిచ్చిడానికేఅభ్యంతరమూ లేదుట.

ఈమాటలన్నీ అయేయి. కాని పిల్ల వయస్సు పదిహేనేళ్ళని వినే సరికి మాత్రం మా మేనమామకి—చెప్పాలికదూ మరీ—కొంచం ఉత్సాహం తగ్గింది. "సాంప్రదాయమైన కుటుంబమేనా వాళ్లది. ఇందులో మరేమయినా లొసుగుందా?..."అని అనేటప్పటికి—"అబ్బే ఎక్కడా మంచివరుడు దొరక్క పోవటంచేత యీ ఆలస్యమయింది గాని మరో సంగతేమీ కాద"ని హరిబాబు నమ్మకం చెప్పిన మీదట గాని మా మేనమామ శాంతపడ్డాడు కాదు. వివాహానికి ముందు కావలసిన చర్యంతా నిర్విఘ్నంగా సమాప్తయింది. కలకత్తా కవతలున్నదంతా అంతమానుల్లోనే లెక్కని మా మేనమామ వుద్దేశం. తను జన్మమెత్తి ఒక్కసారి గాబోలు ఏదో తప్పనిసరి వచ్చి కోన్నగరం వరకూ వెళ్ళేడు. మా మేనమామేగాని మనువయి పుట్టినట్టయితే తన సంహితలో హౌరా ఆనకట్టు దాటడం కూడా నిషేధించి వుండేవాడే. ఏమయినప్పటికీ, "మామయ్యా యింకెలాగా వెళ్ళడు, పోనీ నేనైనా ఒకమారు పిల్లని చూసొస్తే బాగుంటును" అని అనుకున్నాను. కాని యీ సంగతి మామయ్యతో చెప్పడానికి నాకు సాహస మెక్కడ! పిల్లకు పసుపూ కుంకమూ యివ్వడానికి మా పినతండ్రి కొడుకుని పంపించేరు. అతని అభిరుచి మనస్సంతుష్టిమీద నే నాధారపడి యుండలేదు. కాని అక్కడనించొచ్చి "పిల్ల బంగారపుబొమ్మండానికేమీ సందేహంలే"దన్నాడు. మా పినతండ్రికొడుకు కే వస్తువయినా ఒకంతట నచ్చదు. ఎంతగొప్ప వస్తువయినా యీసడించేరకం అంచేత అటువంటివాడినోట "పిల్ల బంగారపుబొమ్మ" అని వినగానే నిశ్చయంగా పిల్ల యొంతో సౌందర్యరాశి అని నాకు నమ్మకంతట్టింది.

## ౨

పెళ్ళిచూపులికి, ఆడపెళ్ళివారే కలకత్తా రావలిసొచ్చిందని వేరే చెప్పనక్కర్లేదు. పెళ్ళికూతురు తండ్రి శంభునాథబాబుకి హరిబాబంటే చాలానమ్మకం. అంచేతనే పెళ్ళి ముహూర్తాలుండగా—లాంఛనం తీర్చుకోడానికి—నన్ను చూడ్డానికొచ్చేడు. ఆయనకి నలభై సంవత్సరాలవయస్సు. తల ఇంకాపండలేదు. మీసాలు మాత్రం అక్కడక్కడ పండడం ఆరంభించేయి. చూడతగ్గమనిషి. నలుగురిలో కూచ్చుంటే నిండుగా వుంటాడు.

నన్ను చూసి అతను సంతోషపడ్డాడనే నానమ్మకం కాని యీవిషయంలో అతని అభిప్రాయమేమిటో తెలుసుకోడం కష్టం ఏమంటారా, చాపక్రిందనీరులా గుండేవాడుకాని పైకేమీ తేలేవాడు కాడు. మామేనమామమాత్రం చాలా అనర్గళంగా మాట్లాడుతూ ధనములోనైతేనేమి, పరువుప్రతిష్ఠలలోనైతేనేమి పట్నంలో వాళ్ళందరూ వీళ్ళకితీసికట్టని వియ్యంకుడనుకొనేలాగు చెయ్యడానికి ప్రయత్నించేవాడు. శంభునాథబాబీ విషయంతో తనకేమీ సంబంధంలేనట్లు కనబడుతూ మధ్యమధ్యమాత్రం ఊఁ ఆఁ అంటూండేవాడు. నేనే మామేనమామ స్థితిలోగానే వుంటే అతని ముభావానికి నిరుత్సాహుణ్ణయిపోయి వుందును. కాని అప్పట్లో మామేనమామ వాక్ప్రవాహాని కడ్డుగట్టువెయ్యడం ఎవరితరం? శంభునాథబాబు ముభావంచూసి, మామయ్య అతన్ని అభాజనుడి కింద కట్టేసేడు సాధారణంగా వియ్యంకుడు అనేవాడు ముక్తసరిగా ఉంటేనే శోభిస్తుందిగాని తెగవాగడం మంచి లక్షణంగాదు. అంచేత అతని

మొహంచూసి మామయ్య సంతోషమే పడ్డాడు. శంభుబాబతనిదగ్గిర శెలవు పుచ్చుకుని వెళ్ళేటప్పుడు మామయ్య మేడమీదనించే ఏవో రెండుమూడు మాటలతోటే సాగనంపేసేడు— బండిదాకా దిగబెట్టడానికో మెట్లేనా కిందికి దిగిన పాపాన్ని పోలేదు.

కట్నాలు కానుకలూ విషయంలో ఉభయపక్షాల వారికీ జరగవలసిన మాటలన్నీ జరిగేయి. మా మేనమామకి, తానొక గొప్ప వ్యవహారకర్తనని ఒక గర్వం. పెండ్లిమాటల్లో ఏదేనా సరే ఘలానాది ఖచితంగా మాట్లాడని విషయం ఉండిపోయిందని సందేహించడానికేమాత్రం అవకాశంలేదు. కట్నంయింతా అని అంకె తేలిపోయింది. అదీగాక, నగలు ఎన్ని తులాలో, బంగారం ఎన్నోవన్నో, ఇవన్నీకూడా నిర్దిష్టం అయిపోయింది. యీ గొడవలోనే నేనేమీ జోక్యం కలుగజేసుకోలేదు. ఇచ్చి పుచ్చుకోడంలో నేనేమీమాటలు జరిగేయో ఆసంగతే నాకు తెలీదు. యీ మాటలు కూడా పెళ్ళిలో ఒక ముఖ్యభాగమనీ, యీ భారం అంతా వహించే పెళ్ళిపెద్దలే ఒక చిల్లిగవ్వయినా రద్దు కాకుండా చూస్తారని మాత్రం నాకు బాగా తెలుసును. వాస్తవానికి మా మేనమామ పక్కా—లౌక్యుడవడం మా కుటుంబానికి గర్వించవలసినదే.

అఖండవైభవంగా యథాసమయానికి పెళ్ళి వారందరూ కాన్పూరు చేరేరు. నౌకర్లని చాకర్లనీ మరి పెళ్ళివాళ్ళని లెక్కపెట్టాలంటే వేరే ఒక గుమాస్తాను వేసుకోవలసిందే. వీళ్ళందరికీ తగిన గౌరవమర్యాదలు చేయాలంటే ఆడపెళ్ళివారితాతలు దిగొస్తారని తలుచుకుంటూ మాఅమ్మా, మేనమామా పడ్డ ఆనందానికి హద్దు లేకపోయింది. బ్యాండు, నౌబత్తు, డోలు, సానాయి, కన్సర్టు వగైరా ఎన్నిరకాల మంగళవాయిద్యాలుండాలో అన్నీకూడా ఒక్క—పెట్టుగా చెవులు గింగురుమనేలాగున మోగుతూండగా మేమంతా పెళ్ళివారింట్లో ప్రవేశించేం. వజ్రాలు తాపడంచేసిన ఉంగరాలూ, నగలూ, నాణేలతోటి నాశరీరం అంతా మలామా చేసేసేరు. బాబోయ్ మామగారికి తనఅల్లుడు ఎంత విలువ గలవాడో, ఆసంగతి యీ నగలరూపంగా తెలపాలని గాబోలు మా మేనమామ ఉద్దేశం.

పెళ్ళివారింట్లో ప్రవేశించిన తరవాత మా మేనమామంత సంతోషంగా కనిపించలేదు. పైనివసారాలో పెళ్ళివారుండడానికి జాగాలేదొకటి. దానిమీద యావత్తు ఏర్పాట్లూ ఏదో సామాన్యంగా వున్నాయి గాని విశేషంగా లేవు. యిదీగాక, శంభుబాబు వ్యవహారం కూడా అదో మోస్తరుగావుంది. విధేయతలేదు. సరిగదా నోటంట మాటరావడమే అపురూపంగావుంది. కాని అతని వకీలుమిత్రుడొకడుమాత్రం మొలకు శాలువొకటి దట్టంగా బిగించి వికృతమైన గొంతుక, పలత బుర్ర, పొగచూరినట్టున్న మొహం, గానుగ మొదలులాగు శరీరంతో అర్థ యీడులాడుతూ గడియ గడియకీ, చేతులు జోడించి అతివినయంగా భజంత్రీ వాళ్ళని లగాయతు చేసుకొని పెళ్ళివారన్న ప్రతీవాణ్ణీ, గద్గదస్వరంతో, ఆప్యాయతగా ప్రార్థిస్తూ ఉండబట్టిగాని, లేకపోతే ఓంప్రథమంలోనే ఉభయపక్షాల వారికీ "కాసరబీసరై, తుదకు గాడిదవాలకమై, సిగపట్ల గోత్రమై" అన్న అవస్థ పట్టవలసిందే.

నేను మండపంమీద కూర్చున్న కొంతసేపటికి మామయ్య శంభునాథబాబుని పక్క—గదిలోకి తీసుకెళ్ళేడు. మరి కొంచంసేపటికి శంభుబాబు నాదగ్గిరకొచ్చి "ఒక్క—మారిలా దయచేయుం" అన్నాడు.

అసలు సంగతేంటంటే—తన జన్మలో ఎవడిచేతా దగాపడనని చెప్పి మా మేనమామకో పెద్ద మహాగర్వం. "వియ్యంకుడు నగల సంబంధంలో దగాచేస్తాడేమో, ఆముడి కాస్తా పడిపోయింతరవా తేమనుకుంటేయేం కార్యం" అని అనుకున్నాడు. లౌక్యంలో యింతవాడు మరి లేడని ముందే చెప్పేనుకదా! అంచేతే తనవెంట నగలూ అవీ నాణెం చెయ్యడానికి ఒక బంగారపు పనివాణ్ణికూడా తీసుకొచ్చేడు. శంభుబాబుతో కలిసి నేను లోపలికెళ్ళే సరికి మామయ్య బల్లమీద కూర్చున్నాడు. కంసాలి కట్టెలు, త్రాసు, గీటురాయి మొదలయ్యి యావత్తు సరంజాంతోటీ జంబుఖానా మీద కూర్చున్నాడు.

శంభుబాబు నన్నుచూసి "మీ మేనమామ గారు

పెండ్లి కాకమునుపే నగలు నాదెం చేయిస్తానంటున్నారు. మీ అభిప్రాయం యేమిటి.” అని అడిగేడు.

నేను తలవంచుకొని ఏమీ మాట్లాడకుండా ఊరుకున్నాను. “నా దభిప్రాయాని కేముందీ! నే నెలా చెపితే అలాగే అంటాడు గాని” అన్నాడు మా మేనమామ.

శంభునాథబాబు నావైపు తిరిగి—‘అయితే ఆయ నెంత చెబితే అంతేనా, మీరు చెప్పేదేమైనా వుందా యీ విషయమై ’

నేను బుర్రతటాయించి “యీ విషయంలో నాకేమీ అధికారం లేద”న్నట్టు సాంకేతికంగా తెలియజేసేను.

సరే అయితే కూర్చోండి “పిల్ల వంటిమీద ఉన్న బంగారం అంతా తీసుకొస్తాను” అనిచెప్పి శంభు బాబు యింట్లోకి వెళ్ళేడు.

“పెళ్ళికొడుకెందు కిక్కడ? మండపంలోనే కూర్చుంటే బాగుంటుంది.” అన్నాడు మేనమామ.

శంభుబాబు “అబ్బే! మండపంలోగాదు. యిక్కడే కూర్చోవాలి” అని అంటూ యింట్లోకెళ్ళి మరికొంతసేపటికి నగలమూట పట్టుకొచ్చి బల్లమీద పెట్టేడు. ఆ నగలన్నీ యిక్ష్వాకులనాటివి - యీ కాలపు నగలు కావు.

వాట్ని చూడ్డంతోటే పనివాడు “వీట్ని నాదెం చేయాలసిన అవసరం కనిపించదు. అసలు బంగారం, కల్తీ యేమాత్రంలేదు. యీ కాలంలో యిలాంటి బంగారం మచ్చుకేనా దొరకదు.” అని అంటూ ఒక బంగారపు కడ్డీ సుత్తితోకొట్టి “చూసేరా, ముక్క వంగడమేగాని విరగడంలేదు.” అన్నాడు.

మామయ్య తక్షణమే నగలజాబితా తయారు చేసేడు—ఏమో తర్వాత వీటిలో తఖరారొస్తే?

లెక్కచేసే సరికి నిర్ణయించుకున్న బంగారంకంటె రెట్టింపే తేలింది. అందులో ఒక కమలాలజోడు కూడా వుంది. శంభునాథుడు “దీన్ని కూడా నాదెం చేయించండి” అని దాన్ని కంసాలిచేతికిచ్చేడు. “యిది సీమపరుషు. యేమంత మంచిదిగా దీబంగారం.” అని కంసాలనేసరికి శంభునాథబాబు ఆ కమలాలజోడును మామయ్య కిచ్చి “అయ్యా! దయచేసి దీన్ని తమ దగ్గిరే వుంచండి” అన్నాడు.

మామయ్య దాన్నిచూసి నిర్ఘాంతపోయాడు—చిక్కితే సెత్తురులేదు. పసుపుకుంకం యివ్వడానికి పంపించిన వస్తువు అదే! “ఒకణ్ణి టోపీవేయాలి గాని, మనం ఎప్పుడూ టోపీ పడగూడదు” అని మురిసిపోతూవున్న మామయ్య కంఠంలో అడ్డుతిరగడం చూసి నిర్విణ్ణుడై పోయాడు. కాని, పైకిమాత్రం ఏమీ తొణక్కుండా నాతో, “నువ్వెళ్ళి మండపంలో కూర్చో” అన్నాడు.

కాని శంభునాథబాబు—మండపంలో కూర్చోడానికేం పదండి మొదట భోజనాలు గానియ్యండి.

మామయ్య—అదేమిటండీ! లగ్నం......

శంభునాథుడు—అ గొడవెందుకు? లెండి. పదండి.

పైకి ఒట్టి వెర్రివాడిలాగ కనిపించి నప్పటికీ శంభునాథబాబు, క్రియాపట్ల మహాజాగర్తయిన వాడని అప్పుడు నే ననుకున్నాను మామయ్య లేచేడు. పెళ్ళివారందరి భోజనాలయేయి. పై యేర్పాటుల్లో యేమీ ఆడంబరం లేకపోయినప్పటికీ పదార్థాలన్నీ మహా పరిశుభ్రంగాను, రుచిగాను వున్నాయి.

పెళ్ళివారందరి భోజనాలయిన తరవాత శంభునాథబాబు నన్నుకూడా భోజనానికి రమ్మన్నాడు. మామయ్య, “అదేమిటి? లగ్నం కాకుండా పెళ్ళికొడుకెలా భోంచేస్తాడు” అన్నాడు. కాని శంభునాథబా బతని మాటలేమీ లక్ష్యపెట్టకుండా నాతో, “మీ అభిప్రాయం ఏమిటి? భోజనంచేస్తే ఏమైనా తప్పా?” అన్నాడు.

నే నేమండానికీ మా మేనమామ మక్కడే వున్నాడు. అతనిమాట జవదాటడానికి నాతరమా? అందుకే నే నేమీ అనలేక పోయేను.

అప్పుడు శంభునాథబాబు నాతో “తమరు చాలా శ్రమిచ్చేను. తమవంటి ఆ గర్భశ్రీమంతులకి తగిన గౌరవమర్యాదలు చెయ్యడానికి మేమేపాటి ధనవంతులంకాం. క్షమించాలి. చాలరాత్రయి పోయింది. యింకా మిమ్మల్ని శ్రమపెట్టడం నాకు భావ్యంకాదు,

మరి తనురంతా—

మామయ్య—ఆఁ. సరే దానికేంలెండి. మండపంలోకి పదండి. మేం మొదట్నించీ సిద్ధంగానేవున్నాం.

శంభునాథుడు—తన కన్నిగంటలబండీ కళదాను నుంది? కొంచెం సేపటికే ఓబండీ బయల్దేర్తుంది.

మామయ్య—(ఆశ్చర్యంతో)—వేళాకోళాల కేమి లెండి!

శంభుబాబు—వేళాకోళంచేయడం మీవంతు. మీ వంటి పేచీకోర్లతో సంబంధం చేయడం నాకిష్టంలేదు.

మామయ్య కొంతసేపటిదాకా శంభుబాబుని చూస్తూ ఉండిపోయేడు నిర్ఘాంతపోయి.

శంభుబాబు—పెళ్ళి కూతురు తాలూకు వస్తువులు నే నపహరించేస్తాననే వుద్దేశంతో వాటి నన్నింటినీ నాడెం చేయించి మొట్టమొదటే దానిజాబితా తీసుకుం దామని అనుకునే వాళ్ళకి నాపిల్ల నియ్యను.

నాతో మాటాడవలసినఅవసరం తనకేమీ కనిపించింది కాదు. మేనమామ మేమంటే దానికి వెనకతాళం వేస్తాడు వీడంతేనని యిదివరకే స్పష్టంగా తెలిసిపోయుందికదూ మరి. తరవాత జరిగిన సంగతి వర్ణించడాని కిష్టంలేదు నాకు. నానాగందరగోళం "దక్షయజ్ఞ ధ్వంసకాండ"—చేసి పెళ్ళివారంతా బయటికి సాగేరు—ఓ బేండుగాని, సన్నాయి గాని కిక్కురుమంటే ఒట్టు.

## 3

ఊళ్ళో మావాళ్ళీసంగతి వినేసరికి నిప్పును తొక్కిన కోతుల్లాగ దాటడం మొదలెట్టేరు. "కన్యాదాతకింత తెగనీలుగేంటి. ఘోరకలి కాపోతే మరేంటి" అని కొందరు. "చూద్దాంకదూ పిల్లకి పెళ్ళెలా చేస్తాడో! శాస్త్రానుసారంగా పిల్ల పెళ్ళికే పనికిరాదు"అనేవాళ్ళు కొందరు. కాని "పిల్లకి పెళ్ళికాదేమో" అనే భయమే లేని వాళ్ళకి వీళ్ళేం శాస్తి చెయ్యగలరు!

వేలకొద్దీ, లక్షలకొద్దీ పెళ్ళికొడుకులున్నారు. కాని తీరాపీటలమీద కూచున్న తరవాత, కన్యాదాత వల్ల అర్ధచంద్రప్రయోగం అయిన నాల్లాంటి నేనొక్కణ్ణే కన పడుతున్నాను. నావంటి సత్పాత్రుడి నుదుటిమీద ఏ దుష్టగ్రహం—యింత పటాటోపం జరిగిన తరవాత కూడా—యీ కళంకం తెచ్చిపెట్టిందో! అయిన అవమానానికి తోడు, పెళ్ళివారందరికీ భోజనం పెట్టేసేరు. "భోంచేసి పోరా" అన్నట్టు.

మా మేనమామ వాళ్ళమీద పరువునష్టం దావావేస్తానని మహాగడబిడచేసేడు. కాని కావలసినవాళ్ళంతా "అయిన అవమానం చాలకాయేంటి, యీపాటికి చాలించు ప్రతాపం" అని మొహం వాచేటట్టు చీవాట్లు వేసేరు.

చెప్పాలికదూ నాకుకూడా ఆరికాలుమంట నెత్తికొచ్చింది. ఏ వుపాయంచేత శంభునాథబాబు, యింక విధిలేక, 'రక్షించు బాబూ' అని నాకాళ్ళమీద పడతాడ్రా అని మీసందువ్వుతూ, ఆలోచించడం మొదలెట్టేను.

కాని యీ ఉత్ర్కోశప్రవాహంతోపాటు, మరో ప్రవాహంకూడా అతివేగంగా ప్రవహిస్తూంది. నా మనస్సు ఆ అపరిచితమీద పూర్తిగా లగ్నమైపోయింది. ఇంత అవమానం జరిగేకకూడా దాన్ని కట్టిపెట్టడం మహా కష్టసాధ్య మయిపోయింది. యింతకీ ఆ అపరిచిత గోడచాటునే వుండిపోయింది. ఆమె కపాలం చందనచర్చితమై, ముఖమీమ్మద సిగ్గు ఆవరించి వుంది. కాని మనస్సులో ఏముందో నాకేం తెలుసు. నాకల్పనాప్రపంచంలోవున్న అకల్పలత వసంతకాలపు పువ్వుభారాన్నంతా నాకు సమర్పించడానికి నతవదనంతో నిల్చున్నాది. సుగంధమలయమారుతం వీచింది. అళుల మర్మరధ్వనికూడా కొంచం వినిపించింది. యింక ముందు కడుగెయ్యడమే తరవాయి. సరీగా అప్పుడే—ఆ సమయాన్నే—పరిస్థితంతా, ఒక్కసారిగా, ఒక్క రెప్పపాటు కాలంలోనే పూర్తిగా మారిపోయి, శూన్యాకాశంలో విలీనమై పోయింది.

కన్యారూపవర్ణన అతనిముఖతా విందామనే అభిలాషచేత, యిన్నాళ్ళ వరకూ ప్రతీరోజూ సాయంత్రం మా పినతండ్రి కొడుకుదగ్గిర కెళ్ళి, అతని కేమీ ఊపిరి సలుపనివ్వ లేదు. అతనెంత యీసడింపు మనిషయినా 'పిల్ల బంగారబొమ్మ'న్నాడు. అంచేతే అతనన్న ప్రతీ

అక్షరంకూడా అగ్నితునకల్లాగ నామనస్సుకి చిచ్చుపెట్టేసింది. అతను చెప్పడంచూసి పిల్ల సౌందర్యఖని అనుకున్నాను. కాని ఆ సౌందర్యాన్ని ప్రత్యక్షంగా చూడలేకపోయేను సరిగదా ఆఖరుకి ఫోటోకూడా చూడ్డానికి దొరికిందికాదు. స్థూలదృష్టితో చూడలేకపోతే పోయింది, సూక్ష్మదృష్టితోనైనా చూడ్డాని కెంత ప్రయత్నించినా నాశక్యమయిందికాదు. మనస్సు మాత్రం పలువిధాలపోయి పెళ్ళినాటి వివాహమంటపంగోడ కవతలిప్రక్కన నిట్టూర్పులు విడుస్తూ గిర్రున తిరుగుతూ వుండిపోయిందంతే.

పిల్లకి నా ఫోటోగ్రాఫు చూపించేవని హరిబాబు చెప్పేడు. తప్పకుండా అది అవిడకీ నచ్చేవుంటుందని నా నమ్మకం. నచ్చకపోడాని కేమీ కారణం కనపడదు చూడండి! ఆ ఫోటోని ఒకపెట్లో జాగ్రత్తగా పెట్టిందని నా మనస్సుమాత్రం నాతో చెప్తూ వుండేది. అప్పుడప్పుడు ఏకాంతంగా—మధ్యాహ్న సమయాన్ని—దాన్ని చూడకుండా వుంటుందా? అలా దాన్ని వంగి చూసేటప్పుడు, అవిడి ముక్తకేశములు ముఖానికి రెండువేపులా దాగుడుమూత లాడుతూండవూ? అలాంటప్పుడు పైనించేదైనా అడుగులచప్పుడు విని తన సుగంధాంచలంలో ఆ ఫోటోను దాచేసుకోకుండా వుంటుందా?

దినాలుగడుస్తూ వెళ్ళేయి. సుమారు ఒకఏడాది గడిచిపోయింది. సిగ్గుచేత మామేనమామ యిప్పుడు పెళ్ళిప్రస్తావనే తేవడం మానేసేడు. యీ అవమానం అంతా, వూళ్ళోవాళ్ళు పూర్తిగా మరిచిపోతేనేగాని పెళ్ళిప్రయత్నం చెయ్యవని ఊరుకుంది మా అమ్మ.

ఇంతటిలో పిల్లకో సంబంధవచ్చిందిట. కాని ఆపిల్ల యిప్పుడు పెళ్ళిచేసుకోనంటున్నాదిట. యిది వినేసరికి నామనస్సుకు కలిగిన సంతోషానికి మేరలేక పోయింది. నాగురించే బెంగపెట్టుకుని ఆపిల్ల నిద్రాహారాలు వర్జించేసిందని, సాయంకాలం తలదువ్వి జడవేసుకోడం మరిచిపోతుందని, తండ్రి దాన్నిచూసి రోజురోజుకీ పిల్లయెందు కింతిలాగ చిక్కిపోతూన్నాదని అనుకుంటూ, ఎప్పుడేనా గదిలో కకస్మాత్తుగావచ్చి అవిడ కంట తడిపెట్టడంచూసి 'ఏమమ్మా అలావున్నావు? నాతో చెప్పవమ్మా' అని అంటూంటాడనీ; అప్పుడు పిల్ల గబగబ కళ్ళు తుడిచేసుకుని "అబ్బే యేమీ లేదు" అని అంటుందనీ, నా ఊహాప్రపంచంలో యిదంతా పొడగట్టుతూంటుంది. పోను కమా, మరీ, ఒక్కగానొక్క పిల్లాయె. అల్లారుముద్దుగా పెరుగుతూవుంది. మండు వేసంకాలంలో, వానలేమిచేత వాడిపోతూన్న గులాబీ మొగ్గలాగ పిల్ల నానాటికి మనోవ్యాధి చేత కుంగిపోడం చూస్తే యేతండ్రికి మనస్సు కరక్కుండా వుంటుంది! అటువంటి విషమపరిస్థితుల్లో, మానావమానాల్ని ఒక మూలబెట్టి, మాయింటికి పరుగెత్తుకొచ్చి 'బాబూ, అపరాధం వచ్చింది. క్షమించండి. పిల్లనిచూస్తే గుండె చెరువైపోతూంది. దయచేసి మరోమారొచ్చి పెళ్ళిచేసేసుకోండి. వెనుకటి సంగతంతా మరిచిపొండి. ఎలాగైనా నా పిల్లని రక్షించి నన్నొడ్డున పడెయ్యండి' అని అనకుండా వుండగలడా? తరవాత? తరవాతింకేముంది—వట్టిగాలిలో మేడ అంతే!

## ౪

అమ్మని తీసుకుని తీర్థయాత్రకి బయల్దేరేను. భారం అంతా నామీదే పడ్డాది ఏమంటే మా మేనమామ హఠాత్తా ఆనకట్టు దాటడం యీమారుకూడా నావల్లకాదని కాళ్ళు చాచేసేడు. యిల్లుకదలడం అంటే ఆతనికి ప్రాణాంతంగా వుండేది. సరే రైయిల్లో పడుకున్నాను. బండి కుదుపుచేత రకరకాల కలలు అస్పష్టంగా కనబడుతున్నాయి. అకస్మాత్తుగా యేదో స్టేషన్లో బండాగింది. చీకటి-వెలుతుర్లలో ఎన్నడూ ఎరగని ఆ స్థలంకూడా ఒక కలమాదిరిగానే కనిపించింది. కాని ఆకాశాన్నున్న నక్షత్రాలు మాత్రం చిరపరిచితలు. స్టేషన్లో ఏవో కొన్నిదీపాలు మాత్రం మినుకూమినుకూమంటున్నాయి. అవే ఆస్థలం అంతా ఎంత అపరిచిత మో చెబుతున్నాయి.

అటువంటప్పుడు—ఆ అద్భుతమైన రాత్రికాలంలో ఏమూలనుంచో గాని ఒక ధ్వనివినబడింది. ఏమని?—'వేగంరండి, యీపెట్లో కాళీవుంది'.

ఎవరైనా సంగీతం పాడుతున్నారేమో అనుకున్నాను. బంగాళీవాళ్ళనోట ఆ బంగాళీపలు కెంత మధు

రంగా వుంటుందో అది యిటువంటి ఎరగని స్థలంలో, వేళకాని వేళ, అకస్మాత్తుగా వినబడినప్పుడే సరీగా తెలుస్తుంది. కాని నేనువిన్న యీ విశేషకంఠస్వరం మాత్రం ఫలానా వాళ్ళలాంటిది అని చెప్పడానికి వీల్లేదు. అది ఒక విశిష్టవ్యక్తిది. కాని దాన్నివింటూనే యిటువంటిది నా జీవితంలో యెప్పుడూకూడా విని వుండలేదనిమాత్రం తెలిసిపోతూంది.

కంఠస్వరంలో గొప్ప మహత్వముందని నే నెప్పుడూ ఒప్పుకొనేవాణ్ణి. రూపం అంత తోసిపారెయ్యడానికి వీల్లేదు. కాని మనుష్యుల మనస్సుల్లోవుండే సూక్ష్మతర విశేషం అనగా, మాధుర్యం, మృదుత్వం వగైరా గ్రహించాలంటే కంఠస్వరం ద్వారానే గాని అన్యత్రా అవకాశంలేదనే నా నమ్మకం. ఈ మృదుమధురకంఠస్వరం యెవరిదా అని చూడ్డానికి కిటికీ కవతల మొహం పెట్టిచూసేను కాని యేమీ కానరాలేదు. చీకట్లో ప్లాట్ ఫారంమీద నిల్చున్నగార్డు మాత్రము జండా వూపడం కనిపించింది. రైలు కదిలిపోయింది. నేను కిటికీ దగ్గరే కూర్చుండి పోయేను. నామనో నేత్రాల కెదురుగా యేరూపమూ లేదు, కాని హృదయంమాత్రం ఒక అజ్ఞాతహృదయం యొక్క రూపం చూస్తు వుండిపోయింది. భావావేశంచేత నాలో నేనే 'ఓ, అపరిచిత కంఠస్వరమా! ఒక్క ఘడియలోనే నువ్వు నా చిరపరిచయుని (హృదయం) పీఠముమీద కూడా అలంకరించేవు. నువ్వెంత అపూర్వమైన దానివి! ఎంత పరిపూర్ణవు! తుపానులో సముద్రపు కెరటాల్లాగ యిట్టే అల్లాడిపోతూ క్షోభించిపోతూవున్న నా హృదయం మీద ఒక్కసారిగా పుష్పంలాగ వికసించిపోయేవు అంతరంగాల పరస్పరాఘాతం చేత ఓచిళ్ళైనా వూడిపోలేదుకదా! నీ కోమలత్వానికి రవంతైనా భంగం కలగలేదుకదా!' అనుకున్నాను.

రైలు చక్కా లయవేస్తూ పరుగెత్తడం. నేను లోలోపలే ఆ సంగీతస్వరమే వింటూండేమూను. ఆ సంగీతస్వరం దాని పల్లవి అనుపల్లవీల గతి, ఒకే రూపంలో విలీనమై పోయాయి. 'వేగంరండి! యీ పెట్టెలో ఖాళీవుంది.' అనే శబ్దంమాత్రం వ్యక్తపరుస్తున్నాది. 'ఓ స్వరమయీ! ఔను నిజమే. ఖాళీవుంది. తప్పకుండావుంది. కనుకనే నేనుకూడా వెంటనే వచ్చేసేను' అని నా అంతరాత్మ అనసాగింది

ఆ రాత్రంతా యెంత కళ్ళుమూసుకున్నా నిద్రరాలేదు దగ్గిర దగ్గిర ప్రతీస్టేషన్లోకూడా ఒకసారి పైకి తొంగి చూస్తూ వచ్చేను. చూద్దాం, చూద్దాం అని ఉవ్విళ్ళూరి పోతూన్నప్పటికీ, లభించనిది, ఏరాత్రి సమయాన్ని, నే నెరక్కుండా ఎక్కడెగిరి పోతుందో అన్న భయం వకటి పీడిస్తూందికదూ మరీ!

ఆ మర్నా డుదయం ఒక స్టేషన్లో రైలు మారాలి. మేం ఫస్టుక్లాసు టిక్కెట్టు తీసుకున్నాం కనుక దొమ్మీ యేమీ వుండదన్న నమ్మకం. దిగి చూసేసరికి ప్లాట్ ఫారంమీద కొంతమంది బిళ్ళబంట్రోతులు సామానుతో బండీరాక. కెదురుచూస్తూ నిలబడ్డారు. ఎవరో రిజర్వుమెంటు జనరలు పర్యటనం కాబోలు బయిద్దేరేదు. రెండుమూడు నిమిషాల్లోనే బండివచ్చి ఆగింది. అమ్మను తీసుకుని ఏపెట్టెలో యెక్కడామని నాకు సందేహం కలిగింది. అన్నిపెట్టెలూకూడా కిక్కిరిసి పోయాయి. నేను ప్రతీకంపార్టుమెంటులోనూ తొంగిచూడ్డం మొదలెట్టేను. సెకండ్ క్లాస్ కంపార్ట్‌మెంటులో కూర్చున్న ఒక అమ్మాయి మా అమ్మని చూసి—"మీరు మా కంపార్ట్ మెంటులో కెళ్ళిపోరాకూడదూ? యిందులో బాగావుంది కదా!" అన్నాది.

నావొళ్ళిలా జల్లుమనిపోయింది. అదే - అచ్చంగా ఆమధురమైన, ఆ అత్యద్భుతమైన కంఠస్వరమే! ఆ అపూర్వసంగీతఝుంకారమే. ఆ అమృతవాక్యాలే— 'ఖాళీవుంది' అవుత్తరక్షణమే అమ్మతోకూడా బండీ యెక్కేసేను. సామానంతా యెక్కించడానికి సమయం చాలకపోయింది. అదేమిటోగాని నా అంత గాభరా మనిషివుండడు. పాపం ఆ అమ్మాయే కూలీలచేతుల లోనుంచి అతిచురుకుగా మాపరుపూ, పెట్టీ, అవీ అందుకుని బండీలో పడేసింది. ఫోటో కెమేరా ఒకటి ప్లాట్ ఫారంమీద వుండిపోయింది. కాని దానికోసం నే నేమీ విచారించలేదు. ఆ అపరిచిత సంగీతస్వరమే యిలా మూర్తీభవించిందో అన్నట్టుగా, ఆ అమ్మాయి

ముఖచంద్రబింబాన్ని యీ చర్మచక్షువులతో చూస్తూ ఆసుధారసాన్ని పానంచేస్తూ ఉండిపోయేను. అటువంటి దివ్యమంగళవిగ్రహాన్నిదివరకెన్నడూ కూడా చూడలేదు. మా అమ్మకూడా అమ్మాయి అతిశయరూపాని కాశ్చర్యపోతూ అలాగే రెప్పవాల్చకుండా చూస్తూ వుండిపోయింది. ఆవిడ వయస్సు పదహారో - మహా వుంటే పదిహేడో అయివుండొచ్చు కాని ఆశరీరంలో కాని మనస్సులోగాని యెక్కడా యౌవన చిహ్నాలవుపించలేదు. సహజమైననడక. నిర్మలమైన చూపు. అపూర్వమైన సౌందర్యం. ఫలానా అవయవం యిలాగుందని యెంచడానికేమీ అవకాశంలేదు.

ఆ అమ్మాయినిగురించి నేను విస్తరించి చెప్పలేను. ఏరంగుబట్ట కట్టుకుందోకూడా సరిగా చెప్పలేను. కాని ఆపిల్ల బట్టకట్టులోకూడా నిరాడంబరం, నిస్పృహ తాండవిస్తూన్నాయన్నమాట. ఆయువతితో మరిద్దరు ముగ్గురు చిన్నపిల్లలు కూడా వున్నారు. వాళ్ళతో ఆమె నవ్వుతాలాడుతూండడంచూస్తే, చిన్నపిల్లలతో కలిసిమెలిసి సరదగా కాలక్షేపంచేయడానికి బాగా అలవాటు పడిపోయిందని స్పష్టమవుతుంది. వయోభేదమందులో మచ్చుకేనాలేదు. దగ్గర చిన్నపిల్లలకి పనికొచ్చే సచిత్రకథలపుస్తకాలు చాలావున్నాయి. వాట్లలో దేదో వకనుంచికథ చదివిచెప్పమని ఒక పిల్ల ఆలావణ్యరాశి నిలా వేపుకు తినేస్తూంది. కథకంటె ఆవిడ యొక్క అపూర్వకంఠస్వరములోవుండే అమృతరసాస్వాదనకోసమే వాళ్ళంత కుతూహలపడుతున్నారని నావూహ. కథవర్ణించేటప్పుడు అకోమలి నోటినుండి వచ్చే తెంపులేని సంగీతఝుంకారం నా చెవినిబడేసరికి నాశరీరం పరవశం అయిపోయింది. తరవాత స్టేషన్లో ఆలలన యింతకారపుశనగపప్పుకొని పిల్లలతోకూడా కలిసి చిన్నపిల్లలాగే, నవ్వుతూ కేరుతూ తిండం మొదలెట్టింది ఈసహజమైన చిన్నతనం చేష్టలలో ఆవిడకేమీ జంకూకొంకూలేదు—— 'అమ్మో, ఎవరేమనుకుంటారో' అని.

ఓ స్టేషనులో రైలాగింది. యిదివరలో చెప్పిన జనరలు తాల్లూకు ఒకదొర యీస్టేషనులో యెక్కడామని చూస్తున్నాడు. పాపం ఎక్కడ వెతికినా ఖాళీలేదు. మాటిమాటికీ మాకంపార్టుమెంటులోపలికి తొంగిచూస్తూ తిరిగి వెళ్ళిపోతూండేవాడు. యిదంతాచూసి నేనూ మా అమ్మా చాలాగాభరాపడ్డాము. ఇంక రైలుకదుల్తుందనగా ఒకరైల్వే అధికారి మాపెట్టెలోకొచ్చి రెండు రిజర్వుప్యాసులు పట్టుకొని వాటిని రెండు బెంచీలమీద తగిలించి నాతో, 'యీకంపార్టుమెంటులో యీ రెండు బెంచీలను యిద్దరుదొరలిదివరకే రిజర్వుచేసుకుంటున్నారు. అంచేత మీరింకోకంపార్టుమెంటులోకెళ్ళిపోవాలి' అన్నాడు.

నేనూరికే గాభరాపడిపోతూ, లేచి వెళ్ళిపోదామని చెప్పి సామానూ అదీ దించడానికి తయారవుతూండడం చూసి, మాతో వున్న ఆ అమ్మాయి వాళ్ళతో హిందీలో చెప్పింది—'మే మీకంపార్టుమెంటు వదిలి వెళ్ళం.'

ఆ అధికారి, తనఅధికారంఅంతా చలాయిస్తూ 'వెళ్ళితీరాలి' అన్నాడు. కాని ఆ అమ్మాయి 'నేనిక్కడినించి కదల్ను' అని భీష్మించుకు కూచోడంచూసి 'యిక మన డాబులు పనికిరావనుకుని, క్రిందికిదిగి యింగ్లీషుస్టేషను మాస్టర్ని పిలుచుకొచ్చేడు. అతనొచ్చి నాతో 'మిమ్మల్నిలా పంపించెయ్యడానికి నాకు చాలాదుఃఖంగా ఉంది కాని—'

ఇంకా అతనిమాట పూర్తికానేలేదు. నేనేమీఅడ్డు తగలకుండా 'సారీ, సారీ,' అని కేకలెయ్యడం మొదలెట్టేను. అప్పుడాఅమ్మాయిలేచి, కొంచంచికాకుతో, 'సారీలేదు, యేమీలేదు. మీరెక్కడికీ వెళ్ళడానికి వీల్లేదు. మీస్థలంలోకెళ్ళి మాట్లాడకుండా కూర్చుండురు. చెప్తాను' అనిచెప్పి తలుపుదగ్గరకొచ్చి నిలబడి, స్టేషన్‌మాస్టరుతో 'యీకంపార్టుమెంటును మొదట్నుంచీ రిజర్వుచేసేరని వారంటున్నారు. కాని అది శుద్ధబద్ధం' అన్నాది. తరవాతాపేరురాసితగిలించిన ఆ రెండు కాగితంముక్కల్నీకూడా పైకూడలాగేసి ప్లాట్‌ఫారంమీదకి విసిరేసింది యూనిఫారం వేసుకున్న ఒక అధికారి మాకంపార్టుమెంటు దగ్గర జరుగుతూన్న తమాషా అంతా చూస్తూ నిలుచున్నాడు. మొదటమాత్రం అతనే, తన బంట్రోతులతో మా పెట్టెలో కెక్కమని

చెప్పేడు; కాని అమ్మాయి సంగతీ, ఆదార్గాడీ చూసి, స్టేషన్ మాస్టరు కేదో సంజ్ఞచేసి, దూరంగా తీసుకు పోయాడు. వాళ్ళిద్దరికీ అక్కడ ఏంసంభాషణ జరిగిందో నాకు తెలియదు. కొంతసేపటికి మాత్రం మాబండికి మరో కకంపార్టుమెంటు తగిలించేరు. అమ్మాయి, నిశ్చింతగా, తనతో ఉన్న చిన్నపిల్లలతో బాటు మళ్ళీ కారంశైనగపప్పు తిండంలో మగ్నమైపోయింది. ఆ సుదతి వాగ్ధాటికీ, నావాజమ్మతవాన్నీ తలుచుకుంటూ సిగ్గుపడి పెడమొహంపెట్టుకుని ప్రకృతి సౌందర్యాన్ని చూస్తూ కూచున్నాను.

రైలు కాన్పూరువచ్చి ఆగింది. అమ్మాయి తన సామానంతా సర్దుకుని దిగడానికి తగిన సన్నాహంలో ఉంది. స్టేషను కోనొకరొచ్చి ఆ సామానంతా దించేసేడు.

మా అమ్మ యీసంగతంతా చూసి మరుండలేక పోయింది. "నీ పేరేమిటమ్మా?" అని అడిగింది.

"కల్యాణి."

"మీ నాన్నగారు—"

"ఆయన యీ వూళ్ళో డాక్టరు పేరు శంభునాథసేనుగారు." అంతా దిగిపోయేరు.

మామయ్యా, అమ్మా యెంతవద్దని చెప్పినా, ఎలాగైతే నేం, ఒకనాడు కాన్పూరొచ్చేసేను కల్యాణిని, ఆవిడ తండ్రినీ కలుసుకున్నాను. శంభునాథబాబు దగ్గర కెళ్ళి చేతులుజోడించి నమస్కరించేసరికి కతనిమనస్సు కరిగిపోయింది. కాని 'నేను పెళ్లిచేసుకోను' అంది కల్యాణి.

'ఏంచేత?' అన్నాను.

'మాతల్లి ఆజ్ఞ'

నేను స్తంభీభూతుడ్నయిపోయేను. ఆపిల్లకు తల్లి లేదు ఆకన్యామణి ఉద్దేశం 'తల్లి' అంటే 'మాతృభూమి' అని తేలింది. సమస్తప్రయత్నంచెయ్యడం, పెళ్లి ఆగిపోవడం, యిదంతాజరిగిందగ్గిర్నుంచీ ఆమె చాలమంది బాలికల్ని పోగుచేసి విద్యాదానం చేయడానికి వ్రతంపట్టిందట. (అనువాదము.)

—ఎమ్. గౌరాంగరావు.



# జిజ్ఞాస : మీమాంస

(ఈ విభాగమునందు చికిత్సకును, న్యాయశాస్త్రమునకును సంబంధించిన ప్రశ్నోత్తరములను మాత్రము విడిచి సాహిత్య దర్శన, విజ్ఞాన, శిల్ప, వాణిజ్య ప్రభృతి విషయిక ప్రశ్నలు ముద్రింపబడును. ప్రశ్నయు, ఉత్తరమును సంక్షిప్తముగనుండుట వాంఛనీయము. ఒక ప్రశ్న కనేకులు ఉత్తరముల నొసంగినచో ఎవరి యుత్తరము మా వివేచనమున సర్వోత్తమము కాగలదో దానినే ముద్రింతుము. నామము ప్రకటించుట కిష్టములేనివారు అట్లు తెలుపుట యవసరము. అనామకమైన ప్రశ్నోత్తరములు ప్రకటింపబడవు. ఒక ప్రశ్న లేక ఒక ఉత్తరము కాగితమునం దొకప్రక్కసిరాతో వ్రాయవలయును. ఒకకాగితమునందు అనేకప్రశ్నములు, ఉత్తరములు వ్రాసినచో నవి ప్రకటింపబడవు. జిజ్ఞాస, మీమాంసలు చేయుసమయమున విశ్వకోశముయొక్కగాని, యెన్‌సైక్లోపీడియాయొక్క గాని అభావమును పూరణ మొనర్చుట సామయికపత్రికలకు సాధ్యాతీతమను విషయము పాఠకులు స్మరణయందుంచుకొనవలయును. సాధారణముగ గలుగు సందేహములను నివారించ నుద్దేశ్యముతో ఈ విభాగము నారంభ మొనర్చుచున్నాము. జిజ్ఞాస యెట్లుండుట ఉచితమనగా దానియొక్క మీమాంస అనేకులకు ఉపకారముగునట్లుండవలయును. కేవలము వ్యక్తిగత కౌతుకము, కౌతూహలము లేక ప్రయోజనములకొరకు జిజ్ఞాస మొనర్చుట యుచితముగాదు. మీమాంసలను పంపుసమయమున యదార్థముగను, యుక్తియుక్త

ముగను నుండువానినే పంపవలయునని గుర్తించియుండుట ఆవశ్యకము. ఏదైననొక విషయమును గైకొని, క్రమాగతవాదప్రతివాదములకు ఇందు స్థలనుండదు. ఏజిజ్ఞాసగాని, మీమాంసగాని ముద్రించుట, ముద్రించకపోవుట సంపూర్ణముగ మాస్వేచ్ఛాధీనము — ఆసంబంధమున లిఖితముగగాని వాచనికముగగాని యెట్టి కైఫియత్ను ఈయజాలము మీమాంసలను వ్రాయువారు జిజ్ఞాసయొక్క నెంబరు, ఆసంచికయొక్క నెల సూచింపవలెను. — సంపాదకుడు )

## జిజ్ఞాస

(1)

ఆంధ్రలిపి ఉత్పత్తియై యెంతకాలమైనది? దేవనాగర, ఆంధ్రాక్షరముల మధ్య అధిక ప్రాచీన మెయ్యది?

—యస్. రామారావు.

(2)

ప్రదీపముయొక్క ఛాయను కూర్చున్నచో ఆయుష్యము తగ్గును ప్రవాదము నందలి మూలమునం దేమైన యుక్తి గలదా?

—ఆర్. వెంకయ్య.

(3)

మదరాసునుండి ప్రశాంతమహాసాగర ద్వారమున అమెరికాఖండమున కేగుటకు యెంతకాలము పట్టును? యెంత అద్దె యగును?

—యస్. స్వామి

(4)

హిప్నాటిజమ్, మెస్మరిజమ్ విద్యలనేర్పు స్థానమెయ్యది? శిక్షకుని నామమేమి?

—సి రామయ్య.

(5)

హైందవస్త్రీ తన భర్త నామ ముచ్చరింప కూడదనుటలో నిమిడియున్న రహస్య మేమి?

—బి. సింహాచలం

(6)

బ్రహ్మజ్ఞానియైన జనకుడును, రాజర్షియైన జనకుడును, అభిన్నవ్యక్తులా? ఉభయులు విభిన్నవ్యక్తులా?

—యమ్. బి. చౌదరి.

(7)

యజ్ఞోపవీత ధారణమున కుద్దేశ్య మేమి?

—యస్. వి. శాస్త్రి.

## మీమాంస.

(5)

హిందూశాస్త్రానుసారము స్త్రీ స్వామియొక్క అర్థాంగిని—ఉభయులు ఒక్కటే. మనుష్యుడు యితరులను పేరు పెట్టి పిలుచును; తనను తానెన్నడు తన పేరుతో పిల్చుకొనడు. స్వామియు, స్త్రీయు ఒక్కటియే అగుటచే స్త్రీ తన స్వామిని ఆయనయొక్క నామముతో పిలువజాలదు. కారణము పేరుతో పిలిచినచో పృథక్ భావ మేర్పడుననియే. ఈ కారణము వలననే హైందవనారీగణము తమ భర్తలను వారిపేర్లతో పిలువ గూడదు.


—జి. వి. నాయుడు.



మహారాజశ్రీ వెల్లూరి కృష్ణయ్యగారి

సత్యభామ పాత్రధారణము

[బీహారుభూకంపనిధి సహాయార్థము చంద్రగిరి సబ్‌కలక్టరువారు శ్రీ యస్. యస్. అరుణాచలం ఐ. సి. యస్. గారి అధ్యక్షతను తిరుపతి సరస్వతివిలాససభవారు ప్రదర్శించిన 'పారిజాతాపహరణ' నాటకమున సత్యభామ పాత్రధరించి ప్రేక్షకుల ప్రశంసలనందుట.]



హార్బరు దృశ్యము, విశాఖపట్టణము

# ‘ఆచార్యదేవోభవ’

౧

ఏకలవ్యుడు ఆరడుగుల ఎత్తు. బలిష్ఠమైన కాయము. ఒళ్ళంతయు కండలు తేలి చూచుట కందముగ నుండును. విశాలమైన నుదురు. దీర్ఘమైన నాశిక. కనుబొమలు దట్టముగా పెరిగి విల్లంబులవలె తీర్చి దిద్దినట్లున్నవి. తీక్ష్ణములైన చూపులు. ఆకండ్లలోనికి చూచుటకు సామాన్యుల కలవిగాదు. ఆ తీక్ష్ణత కోర్వలేరు. అతని నోరు పొందికగానుండి పట్టుదలను సూచించుచున్నది. అత డాజానుబాహుడు. శరీరచ్ఛాయ నల్లనినలుపు. కళకాంతులాతని మొగమున నుట్టిపడుచున్నవి.

అతని కటిప్రదేశముచుట్టూను నొక కృష్ణాజినము చుట్టబడియున్నది. అది తప్ప వేరొకయాచ్ఛాదన మేదియు నతని యవయవముల సహజసౌందర్యమును మరుగు పరుచుట లేదు.

అత డడవినుండి హస్తినాపురమునకు మెల్లగా నడచుచున్నాడు. నడచుచున్నంతసేపును నతడు దేనిని గురించియో తీవ్రముగా నాలోచించుచుండెను.

పట్టణానికి వెలుపల ద్రోణాచార్యుడు తన శిష్యులగు పాండవులను, కౌరవులను విలువిద్య నేర్పుతున్నాడు. శిష్యు లందరూ చురుకుగా నేర్చుకుంటున్నారు.

ద్రోణు డయిదు అడుగుల ఆరంగుళముల పొడవున్నాడు. విశాలమైన వక్షస్థలము. అతని మొగమున బ్రహ్మతేజస్సు, క్షత్రియవర్చస్సు, రెండూ స్ఫుటంగా కనబడుచున్నవి. అతనిది మనోహరమైన మూర్తి.

ఏకలవ్యుడు దూరమునుండి చూచినాడు ద్రోణుని. చూచి అనుకొన్నాడు “అహా! ఎంత తేజస్వి? అతని చూపులవలన నతడు దయాళుడని తెలియుచున్నది. అనుగ్రహించుట అతని సహజగుణము. అట్టియతడు తన్నేల ననుగ్రహింపకుండును? అట్టి మహానుభావుని ప్రసాదమున తనకోర్కె ఎట్లీడేరకుండ గలదు?”

ఏకలవ్యుడు ద్రోణుని సమీపించెను. దగ్గరకు వచ్చిన ఏకలవ్యుణ్ణి చూచాడు ద్రోణుడు. అతనిని చూచుటతోడనే ద్రోణునికి ఎవరీమహానుభావు డనిపించినది. అతని మొగముననున్న తేజస్సట్టిది. గొప్పవాడు కాదగిన గుణము లన్నియు నాతనియందున్నవి.

సమీపించిన ఏకలవ్యుడు ద్రోణునికి సాష్టాంగదండప్రణామ మాచరించినాడు. ద్రోణు డాశీర్వదించినాడు.

ఆ యాశీర్వాదములోని ధ్వని ఏకలవ్యుని కాతనియందున్న సదభిప్రాయమును గట్టిపరచినది. అంతమృదువుగా మాటలాడునతడు తన్నేల శిష్యునిగా స్వీకరించి విద్యగరపడు? తన కాయన గురువగుట తప్పదు. ద్రోణుడు “నీ వెవర”న్నాడు.

“నేను హిరణ్యధన్వుడనే ఎఱుకరాజు కుమారుడిని. ఏకలవ్యుడంటారు నన్ను. తమరిక్కడ రాజకుమారులకు విలువిద్య నేర్పుతున్నారని విని నన్ను మీ శిష్యునిగా స్వీకరించి అనుగ్రహిస్తారేమోనని వచ్చా” నన్నాడు ఏకలవ్యుడు.

తాను గురుముఖమున నేర్చుకొన్న విద్యవలన తానీనాటికి కృతార్థుడైనాడు. సరియైన శిష్యుడు దొరకి, అతనికి తన యొద్దనున్న విద్యసాంతముగా చెప్పిననే గాని కృతార్థుడుగాడు గురువు. అట్టి యపూర్వమైన అవకాశ మతని కీనాడు లభించినది. “నిజముగా నీతడు నాశిష్యత్వమే అపేక్షించినచో నా కిక కావలసిన దేమున్నది? ఇట్టి తేజస్వికి చెప్పినప్పుడే నావిద్యయు, నేనును కృతార్థత చెందుదు మ”నుకొన్నాడు ద్రోణుడు.

“సరే. నాకుమాత్ర మంతకన్న కావలసినదేమున్నది? రేపటినుండిరా” అని చెప్పబోయినాడు.

అతని కప్పుడొకయూహ తట్టినది: తా నెరుకలవానినని చెప్పుకొన్నా డేకలవ్యుడు. తన కాశ్రయము మహారాజులవద్ద. తాను మహారాజకుమారులకు విద్య నేర్పుచున్నాడు. అందుకుగాను నియమింపబడ్డాడు. తానెట్లొక ఎఱుకలవానికి వీరితో కలిపి విద్య చెప్పగలడు? వారిది తమ గౌరవమునకు భంగమనుకుందురేమో! తాను స్వతంత్రించి ఎట్లీపని కొప్పుకొన గలడు. అస లొక

రజని

ఎఱుకలవానికి విలువిద్య గరపుట శాస్త్రసమ్మతము కాదేమో?

ఇట్లాలోచించుచు తన శిష్యులవైపు చూచినాడు. వీరిలో నెవరునూ తన్నితనివలె కృతార్థుని చేయగలవారు లేరా? అప్రయత్నముగా తన ప్రియశిష్యు డర్జునిని వైపుచూచినాడు. అతని ముఖసందర్శన మాత్రమున ద్రోణునికి ధైర్యము వచ్చినది. తన తండ్రి భరద్వాజు డన్నమాటలు జ్ఞాపకము వచ్చినవి. "అర్జునుడను వా డొకడు చంద్రవంశమున నరునంశమున జన్మించి, నారాయణాంశమున జన్మించిన కృష్ణునకు భూభారహరణము నందు సాయము చేయునని." అస లతనిని లోకైకవీరుని జేసి కృతార్థుడౌటకేగదా తాను బ్రాహ్మణుడయ్యు అస్త్రవిద్యల నభ్యసించినది. వాని సాటివీరుడు లోకమున లేకుండునట్లు నేర్పదలచుకొన్నా డాతనికి విద్యలను. ఇప్పు డీతని శిష్యత్వ మంగీకరించిన నిస్సంశయముగా నాతని సాటివీరుడు కాగలడు. అట్లు కారాదు. తాను దలచిన దానికి భిన్నముగా జరుగ రాదు.

ద్రోణు డేకలవ్యునిజూచి "ఏకలవ్యుడా! నీ కస్త్ర విద్య నేర్పజాల నందుకు చింతిల్లుచున్నాను. నీ కస్త్ర విద్య నేర్పవలెనని నా కున్నను రాజకుమారుల తోబాటు నీకు విద్య గరపజాలనందున నీశిష్యత్వ మంగీకరింప జాల"నసెను.

"స్వామీ! మహాప్రసాదము. మీరు చింతింప వల సిన పనిలేదు. మీ యనుగ్రహము వడిసితిని. అంతియే చాలును. మీ యనుజ్ఞయైనచో బోయివచ్చెదను. నా హృదయము మాత్రము మీనుండి మరలదు. ముమ్మాటికి మీరే నాగురువులు. మిమ్ము జూచినప్పుడే మీరు నాకు గురువులని నిశ్చయించుకొంటిని. సెలవు" అని నమస్కారము చేసి సెలవు తీసుకున్నాడు ఏకలవ్యుడు.

౨

మొట్టమొదటి చూపులతోనే ద్రోణుని యందు లగ్నమైనది అతని హృదయము. అతనిగూర్చి యూహ చేసినదికొలది ఆయునయందు అతనికి పూజ్యభావ మధిక మౌతున్నది. గురుదేవు ననుగ్రహమున్నచో తాను తప్పక విలువిద్య నేర్వగలడు. ద్రోణుని బొమ్మ నొకదాన్ని మన్నున చేశాడు.

దానిని భక్తిపూర్వకంగా పూజించాడు. ఆయన్ను గూర్చి ధ్యానించాడు. ఎదుటగా ఒక లక్ష్యాన్ని ఏర్పాటుచేసుకున్నాడు. దానికిముందు ఏభయిగజాల దూరంలో నిలుచున్నాడు. బాణాన్ని సంధించి గురిచూచి వదిలాడు. లక్ష్యానికి పదిగజాలదూరంలో తగిలింది బాణం. తన గురువుముఖంకేసిచూచాడు. ఆయన ముఖంలో మార్పేమిలేదు.

మళ్ళీ తాను మొదటనిలుచున్న ప్రదేశానే నిలుచున్నాడు. మళ్ళీ బాణాన్ని వదిలాడు గురిచూచి. ఫలిత మిదివరకు మాదిరే. మొదటిసారి లక్ష్యానికి కుడివైపు పదిగజాలు పోతే, రెండోసారి ఎడమవైపుకు పోయింది. మూడోసారి, నాల్గోసారి.........అలా ఆరోజల్లా ప్రయత్నంచేశాడు. లాభములేక పోయింది. ఆరోజు కిక ఆపివేశాడు.

మరుసటిరోజున ప్రొద్దున్నే ద్రోణాచార్యుల నారాధించి ఆయన అనుజ్ఞనుపొంది మళ్ళీ ప్రారంభించాడు. మళ్ళీ అదేలక్ష్యం. క్రిందటిరోజున తాను నిలుచున్న చోటనే నిలుచున్నాడు...నిన్నటి రోజంతా అభ్యాసం చేసి ఉండడముచేత బాణం కదిలిపోకుండా పట్టుకో గలుగుదు ననుకొన్నాడు. లక్ష్యానికి సరిగా గురిచూచాడు. ఈ తడవ తప్పకుండా తగులుతుందన్న నమ్మకంతో బాణాన్ని వదిలాడు. కాని సరిగా వదలబోయ్యే సమయానికి చెయ్యి కదలనే కదిలింది. బాణం లక్ష్యానికి ప్రక్కగా తగిలింది. ద్రోణుని ప్రతిమను చూచాడు, ఫరవాలేదులే ప్రయత్నంచెయ్యి అట్లుంది.

ప్రయత్నాలు భిన్నమైనందుకు అతడు నిరుత్సాహపడలేదు. పైగా అంతకంతకు ఉత్సాహము, పట్టుదల హెక్కువౌతున్నవి. గురుదేవుని ముఖకమలము ఉత్సాహాన్నినుమడింప జేస్తున్నది. మళ్ళీ బాణాన్ని తీసుకున్నాడు. ఒకసారి, రెండుసార్లు......ఆరోజల్లా ప్రయత్నించాడు. రోజులుగడుస్తున్న కొద్ది అతనికి తనలో తనకు నమ్మకం కుదురుతున్నది. కాని ప్రయత్నాలు మాత్రం ఫలించలేదు. ఇక ఆరోజుకుఆపి రేపు మళ్ళీ

ప్రారంభింతా మనుకున్నాడు.

ఇంకా మూరెడు ప్రొద్దున్నది. ఈ నాటి కిది కడసారి ప్రయత్నము చేద్దామని చేశాడు. దృష్టి చెదరలేదు. గురి తప్పలేదు చెయ్యి కదలలేదు. బాణాన్ని వదిలాడు. సరిగా లక్ష్యానికి తగిలింది. మనిషి అంతకు రెండింతలైనాడు సంతోషంతో. అత డనుకొన్నట్లు అది ఆఖరుప్రయత్నం కాలే దారోజుకు. ఒకటి, రెండు, మూడు......పదిసార్లు బాణాన్ని వేశాడు. పదిసార్లు లక్ష్యానికి తగిలింది. సంతోషం తాండవమాడుతున్నది గురుదేవుని ముఖంలో.

తెల్లని, కళ్ళను గుడ్డిపరచే వెలుతురులేదు సూర్యుడిలో. సువర్ణచ్ఛాయ దాల్చాడు. పడమటి ఆకాశభాగం బంగారుపూత పూసినట్లున్నది. చిటారుకొమ్మన ఉన్న మామిడి పిందెలుగూడ బాగా పలకబారినట్లవుపడుతున్నవి. కొన్ని నిమిషాల్లో ఆ కాంతి అంతా పోయి కుంకుమముద్దైనాడు సూర్యుడు. అప్పటినుంచి ప్రతిక్షణానికీ మారుతున్నది ప్రకృతిసౌందర్యము. మార్పు స్పష్టంగా అవుపడుతున్నది. ఇప్పుడున్న కాంతి మరుక్షణానలేదు. కొన్ని క్షణాల్లో తిమిరం ప్రకృతి నాక్రమించింది.

ఏకలవ్యుడి కిదేమి పట్టలేదు. తన విద్యాభ్యాసాన్ని గురించి ఆలోచిస్తూ యింటిదారి పట్టాడు.

## 3

దారిలో తన విద్యాభ్యాసాన్ని గురించిన ఆలోచనలే అతని హృదయవీధిలో విహరించినయి. భోజనం చేస్తూ అవే ఆలోచనలు. తాను ద్రోణాచార్యుణ్ణి ప్రార్థించడమూ, తన్ను శిష్యుడిగా స్వీకరించకపోయినా ఆయన పూర్ణమైన అనుగ్రహాన్ని తనకు ప్రసాదించడము, ఆ అనుగ్రహబలముచేత తాను విలువిద్య నేర్చుకోవడము, భూమ్యాకాశాలు పట్టలేనంత విలుకాడు తాను కావడము. ఇవే అతని ఆలోచనలు. నిద్రపోతూ కలవరింతలో ఇవే మాటలు. అతనికి ఒకటే లక్ష్యం. విలువిద్య నేర్చుకోవడమూ—గొప్ప విలుకాడు కావడమూ. అన్యాలోచనలకు అతని మనస్సులో చోటు లేదు.

వెదురుతుప్ప అరణ్యంలో కనబడితే అప్రయత్నంగా అతనికి కలిగేభావం దాన్ని చక్కని విల్లంబు బద్దలు కొట్టుకోవచ్చునని. నారతీడప కంటబడితే కలిగే ఉద్దేశ్యం దాన్ని తడిపిపేనితే చక్కని నారిత్రాడవుతుందని.

మరునాడు అరణ్యానికి వచ్చాడు. విధ్యుక్తంగా ద్రోణాచార్యుల నారాధించాడు. ఇదివరకు నిలుచున్న ప్రదేశానే నిల్చుని ఇదివరకు లక్ష్యాన్నే గురిచూచి కొట్టాడు. సరిగా తగిలింది.

వంద, రెండువందలు, మూడువందలు.....వెయ్యిగజాలదూరంనుంచి లక్ష్యాన్నికొట్టాడు. సరిగా తగలనప్పుడు మళ్ళీమళ్ళీ ప్రయత్నంచేసి కార్యసిద్ధి పడశాడు. అభ్యాసంవల్ల కొన్నిరోజుల్లో గురితప్పకుండా ఎంతధూరంనుంచైనా కొట్టగలిగాడు.

నేర్చుకొన్నంతవరకు తూర్ణంగా నేర్చుకొన్నాడు విలువిద్య. కాని ఇకముందు నేర్చుకోవలసిన పాఠమేమిటి? ఎవరు చెప్పుతారు? దీన్నిగూర్చిన ఆలోచనే సర్వకాలసర్వావస్థలయందూ అతనికి. ఎవరుచెప్పుతారు గనక గురుదేవుడే చెప్పాలి. ఎందుకు చెప్పడు అంత అనుగ్రహం తనమీదఉండగా?

ప్రొద్దున్నే లేచి అరణ్యానికివెళ్ళాడు. తనమనస్సు ద్రోణుపాదాలమీద లగ్నంచేశాడు. తదేకధ్యానముతో చేతులుజోడించి ఆయన ఎట్టఎదుటనిలుచున్నాడు. ద్రోణుడు వినా యితరవస్తువు ఏకలవ్యుడి బాహ్యదృష్టికిగాని, మనోదృష్టికిగాని గోచరించడము లేదు.

అట్లా ఎంతసేపున్నాడో తెలియదు. గురుదేవుడను గ్రహించాడు. దూరాన ఎక్కడో ఒక నెమిలి కూసింది. గురుదేవుడు ఆవైపు దృష్టిసారించినట్లుగా తోచింది అతనికి. నెమిలికోసంచూస్తే కనబడలేదు. మెరుపులా మెరసింది ఒక ఆలోచన అతనిహృదయంలో. చప్పుడును బట్టి గురిచూసికొట్టడం రెండోపాఠము. ఇది గురుదేవుననుగ్రహం. కృతజ్ఞతాపూర్వకంగా నమస్కృతు లర్పించాడు ద్రోణుడికి.

దగ్గఱలో గొఱ్ఱెలను కాస్తున్నా డొకయువకుడు. అతణ్ణి చేరబిలిచాడు. “బాబు! నేనిక్కడుంటాను.

దూరంగా నీవిక్కడ చెట్టుమ్రానుమీద నీకర్రతో చప్పుడుచేసి తొంగినిల్చో" అన్నాడు. ఒకనిమిషం జరిగింది. కర్రతో కొట్టిన చప్పుడు వినపడ్డది. అప్రయత్నంగా అటువైపు చూచాడు. యువకుడు మ్రానుమీద కొట్టి తొలిగి నిలుచుంటున్నది చూచాడు మ్రానుమీద ఏప్రదేశాన కొట్టింది కనబడ్డది. తానుచేయబోయే పనిలో చూపుకు ఏవిధమైన ప్రసక్తి ఉండగూడదు. కృష్ణాజినంచింపి కళ్ళకు గంతకట్టుకున్నాడు. ఈ సారి మరోచోట కర్రతో చప్పుడుచేయమన్నా డాయువకుణ్ణి. చప్పుడువచ్చినవైపుతిరిగి బాణాన్ని వింటసంధించి గురిచేసి వదిలాడు. ఆమ్రానుకే తగిలింది కాని సరిగా చప్పుడుచేసినచోట తగిలిందో లేదో చెప్పడమేలాగ ? ఈచిక్కులన్నీ మొదటతట్టలేదు. చప్పుడుకావాలె, కొట్టినచోట గుర్తూ పడాలి. ఆకర్రకు చివర మొద్దుకత్తి కట్టారు. కత్తితో బెరడు లేచేట్టు చప్పుడుచేయమన్నాడు యువకుణ్ణి. మళ్ళీ సాగించాడు అభ్యాసము. మొదట ఆమ్రానుమీదనే కొంచె మటూఇటూ తగిలింది. కొంతసేపు అభ్యాసంచేసినపిమ్మట ఆబెరడులేచిన చోటనే తగిలింది బాణం. అపారం కొన్నాళ్ళు బాగా వల్లె వేశాడు.

దూరానచప్పుడయింది. కళ్ళకు గంతకట్టుకున్న ఏకలవ్యుడు వింట ఏడుబాణా లొకసారిగా సంధించి వదిలాడు. ఏడుబాణాలూ ఆమ్రానుమీద బెరడులేచిన చోట నాటుకొన్నయి. తనశక్తినంతా ఉపయోగించాడు వాటిని ఊడబెరకడానికి ఆగొల్లపిల్లవాడు.

తన విద్యాభ్యాసము ఒకక్రొత్తఫక్కి. ఇక ముందు నేర్చుకోవలసిందేమిటి ? కుర్రవాడు. తనకేం తెలుస్తుంది? గురుదేవు డేది అనుగ్రహిస్తే అది.

సాయంకాలమైంది. కాలప్రమాణం అతని కవసరము లేదు. తనేమో ! తనవిలువిద్యేమో ! తనగురుదేవుడేమో !!

ఆలా ఆలోచిస్తూ పైకిచూచాడు. పైన పక్షులు గూళ్ళకు పారుతున్నవి. తా నిదివరకల్లా గురిచూచికొట్టినవి ఉన్నచోటునుంచి కదలనిపదార్థాలు. అంతరిక్షాన విహరిస్తున్న ఆపక్షులను కొట్టడమెల్లాగు? అలాగే చూస్తున్నాడు. గూటికి బయలుదేరిన ప్రతిపక్షీ సూటిగా గూటికేపోతున్నది. గూట్లో పిల్లలు కనిపెట్టుకుంటవని. కనుక వాటికి అడ్డాలు తొక్కడాని కాలవ్యంలేదు.

ఆలోచించాడు. తనువదిలినబాణం దానిదారిన చేరేటప్పటికి పక్షికూడా తనదారిన ఆప్రదేశానికే చేరాలి. రెండూ ఒకచోట ఒకేసారి చేరాలి. చాలాచిక్కైన పనే

తనగురుదేవుడు తనను అనుగ్రహించే పద్ధతులు అతన్ని ఆనందాబ్ధిలో ముంచినవి.

మరునాడు సాయంకాలం ప్రయత్నంచేశాడు. ఎంతకష్టమైనపనో తెలిసొచ్చింది. నిస్పృహచెందక యత్నాలు సాగించాడు. మనభీష్టము సాధించాడు.

పైకిచూస్తున్నాడు ఆదారిన పక్షులేవైనా వస్తున్నవేమోనని. ఒకపక్షి అంతరిక్షాన చక్రాలుకొట్టుతున్నది. అతను గమనించినవిషయం ఆపిట్ట ఒకేదారిన, ఒకే గమనంతో చక్రాలుకొట్టుతున్నదని. చూచి, చూచి బాణం ఎక్కుపెట్టాడు. పైకి చూపుసారించి ఫలాని సమయానికి ఏప్రదేశానికి ఆపక్షివస్తుందో లెక్కవేశాడు. ఆసమయానికి ఆప్రదేశానికి తనబాణం ఎంత వేగంతో వదలాలెనో సరిచూసుకున్నాడు. మరుక్షణంలో బాణంతోకూడా పిట్ట క్రిందపడ్డది.

కృతజ్ఞతాపూర్వకంగా గురుమూర్తికి నమస్కారం చేశాడు ఏకలవ్యుడు.

ఇంకాకొంచెం ప్రొద్దున్నది. ఏదో ఆలోచించుకుంటూ ఇంటికి వస్తున్నా డేకలవ్యుడు. దారిలో కొంతమంది పిల్లలు చెండాట ఆడుకుంటూంటే చెండు ఒక నేలపారుబావిలో పడ్డది. పిల్లలంతా బావిచుట్టూచేరి లోపలికి చూస్తున్నారు. వాళ్ళ ఉత్సాహభంగం వాళ్ళ కళ్ళల్లో స్ఫుటంగా అవుపడుతున్నది. వస్తున్న ఏకలవ్యుణ్ణి చూచి మొహాలం చేరడేసి చేసుకున్నారు పిల్లలు పెద్దవాడు ఏదోవిధంగా తీసిపెట్టలేక పోతాడా అని. అతన్ని చేరి దీనంగా బ్రతిమాలారు. బావిలోపలికి చూచా డతను. లోపల నీళ్ళులేవు, లోతుగా ఉన్నది. బంతిమాత్రం తెల్లగా అవుపడుతున్నది. ఏలాగుతియ్యా

డం? తన విద్య ఏలా ఉపయోగిస్తుంది?

గురువును మనసా ధ్యానించాడు. నిశ్చలంగా ఆలోచించాడు. గురుప్రసాదంవల్ల అపూర్వమైన ఆలోచన స్ఫురించింది. కార్యరూపాన ఎంతవరకు లాభిస్తుందో అది?

ఒక బాణాన్ని బంతికేసి నిట్ట నిలువుగా కొట్టాడు. ఆ బాణం చివర గుచ్చుకుపొయ్యేట్టు మరో బాణం వేశాడు. దాని చివరను మరోటి, దానిచివర ఇంకొకటి. ఈ విధంగా బాణాలకూర్పువల్ల ఏర్పడ్డ గడ చేతికందే వరకు వేశాడు. బంతితీసి పిల్లల కిచ్చాడు.

గురుదేవుని దర్శనంచేసి గురుదక్షిణ సమర్పించ వలెనని ఉవ్విళ్లూరుతున్నాడు.

ఒకరోజున విలువిద్యాభ్యాసం చేసుకుంటున్నాడు ఏకలవ్యుడు. ఎక్కడనో అరిచింది ఒకకుక్క. గురి చూసి ఏడుబాణాలు దానిమూతిమీద ఒకేచోట గుచ్చుకొనేట్టు వేశాడు. అది అరుచుకుంటూ యజమానులైన పాండవులను చేరింది. వాళ్ళు అత్యాశ్చర్యం చెందారు. తమను, తమగురువును మించిన విలుకాడీత డెవడని ఆలోచించారు. కుక్క త్రోవచూపగా అరణ్యము ప్రవేశించి ఏకలవ్యుణ్ణి కలుసుకున్నారు. అతను ద్రోణశిష్యుడని విని మరీ ఆశ్చర్యం చెందారు

పాండవులు గురువుచేరి సమస్తం నివేదించారు.

'నిన్నుమించిన విలుకాడు లేకుండా విద్యనేర్పుతానని అన్నారే. నన్ను మించినవాడు మీశిష్యుడేట గూడాను' అన్నాడు అర్జునుడు గురుదేవునితో.

చాలాసేపు ఆలోచించాడు. ఏకలవ్యుడు తనశిష్యుడెట్లాఅయింది గ్రహించాడు. అతను తననారాధించి తనను మించిన శిష్యుడైనందుకు సంతోషించవలెనా? తానన్న వాగ్దానానికి భిన్నంగా ఏకలవ్యుడు అర్జునిన్ని మించిపోయినే అనే భావానికి చింతించవలెనా? గురుదేవుడై, బ్రాహ్మణుడై తానన్నమాట చెల్లవలెగదా అనుకున్నాడు.

శిష్యసమేతంగా ఏకలవ్యుడి గృహానికి విచ్చేశాడు ద్రోణుడు. తలవనితలంపుగా అయిన ఈగురుదర్శనానికి ఏకలవ్యుడు బ్రహ్మానందం పొందాడు. "స్వామీ! ఈ దీనుడు తమశిష్యుడు. తాముకోరిన గురుదక్షిణ సమర్పిస్తాడు" అన్నాడు.

ద్రోణుడు ఆలోచించాడు. సస్తాయించాడు. తప్పదనుకున్నాడు. 'ఏకలవ్యా! నీదక్షిణహస్తంయొక్క బొటనవ్రేలు కావాలెనోయి' అన్నాడు. తనకంత విద్య నేర్పిన గురుదేవు డడగడం, తానివ్వడం అదేచాలునని ఏకలవ్యుడు తలచాడు. కత్తితో బొటనవ్రేలు ఒక్క వ్రేటుకు కోసి గురుదేవునిముందర ఉంచాడు. గురుదేవునికన్నులు చెమ్మగిల్లినవి. ఇతరశిష్యుల మోములు అప్రయత్నంగా వంచుకుపోయినవి.

దక్షిణహస్తముయొక్క బొటనవ్రేలు యిచ్చి తానాజన్మాంతం విల్లుపట్టడానికి అనర్హుడు కావడం చాలా కొద్ది ప్రతిఫలమే ననుకొన్నా డేకలవ్యుడు ..

— మొదలి సీతారామస్వామి, బి. ఏ.

క. గుటియున్న నెల్లవిద్యలు [గదా!
కరగతమౌ ననుచుఁ దెల్పఁగాఁ బడెను
గురువాక్య మింతయొప్పునె? [మగున్.
గుటియను రెండక్షరములె గురుమంత్ర

క. అమల ధనుర్వేదము సాం
గముగా నేర్చికొనె నతఁడు కలితాభ్యాస
క్రమమున, గుటిగల్గినచో
విమలమతుల కందరాని విద్యలుగలవే?

గీ. దివ్యభక్తిని దేని సాధింపఁగలిగె
నట్టిశక్తికి నాధార మగుచునలరు
దక్షిణాంగుష్ఠమే గురుదక్షిణగను
నేకలవ్యుండుగా కొరు లీయఁగలరె?

గీ. వసుధ నేకవీరుం డని వన్నెకెక్క
నెవ్వఁ డాపార్థుఁ డాతనియుష్టగురుఁడుఁ
దన్ను నర్థింపఁగల మహత్త్వంబు గన్న
యేకలవ్యుని గురుభక్తి యెంచఁదరమె?

క. గురుభక్తి కళారత్నా
కరతరణము శిష్యజీవికావరణంబున్
గురుభక్తి గలుగువారల
కరుదే సకలార్థసిద్ధి యగుట ధరిత్రిన్

— వేంకట పార్వతీశ్వర కవులు.

# ప్రెసిడెంటు మాసరిక్

## (జెకోస్లావాకియా స్వాతంత్ర్యనిర్మాత చరిత్ర)

జెకోస్లావాకియా రాజ్యనిర్మాణమునుగూర్చి గత మాసము నివేదించుకొనియుంటిని బండి తోలువాని కిని, వంటలక్కకును బుట్టి తన బుద్ధిబలముచే ఆత్మదేశమునకు స్వాతంత్ర్యమును సముపార్జించి ఎనుబదియైదేండ్లు నిండిన ఈ వృద్ధాప్యమున గూడ ఆత్మదేశ రాజ్యాంగమున అధ్యక్షమహాశయుడై వెలుగొందుచున్న ప్రెసిడెంటు థామస్ మాసరిక్ జీవితవిశేషముల కొన్నిటి నిట దెలుపుకొనుచున్నాను.

### తల్లిదండ్రులు

థామస్ మాసరిక్ తండ్రి నామము జోసెఫ్. ఉద్యోగము బండితోలుట. బాల్యమున విద్యాసౌకర్యము లేకుండెను. అతని తలిదండ్రులు అతనిని పాఠశాలకు పంపజాలకుండిన పేదవారు. అయితే జోసెఫ్‌నకు విద్యాకాంక్ష ఉండినది; తమ పొరుగున నివసించు ఒక ముసలమ్మకు బంగాళాదుంపల పొలముగలదు. ఆ పొలమునందలి దుంపలను ఆమెకొఱకు ఈతడు త్రవ్వి పెట్టుచు ఆమెకడ అక్షరములు గుర్తించి కూడబలుకుకొనుట నేర్చుకొన్నాడు. థెరిసా అను నామముగల జెక్కుజాతి బాలికను ఒకతెను అతడు పరిణయమయ్యెను. థెరిసా, జోసెఫ్‌లకు నిలుకడయైన ఒకనివాసము లేకుండెను. బండితోలువాడుగా ఏతావున నుండవలసిన అటకు కుటుంబముతో తరలిపోవుచుండువాడు. ఇట్టి తరలింపుల సమయముననే మొరేవియా యందలి హాడోనిన్ నందు 1850-వ సంవత్సరము మార్చి 7-వ తేదీని మన కథానాయకుడైన థామస్ గారిక్ మాసరిక్ జననమందెను. తన తలిదండ్రుల కాతడు తొలిబిడ్డ.

### తల్లిప్రభావము

శైశవము నుండియు థామస్ మీద తండ్రి ప్రభావముకంటె తల్లి థెరిసా ప్రభావము విశేషించి యుండెను. పేదకుటుంబమున పుట్టువుగన్నను తన బిడ్డ అనంతర కాలమున పేరుకెక్కిన పౌరుడు కావలయునని ఆమె నిశ్చయించెను. పెండ్లికాకపూర్వము ఒకానొక పెద్దమనుష్యునిఇంటియందు ఆమె వంటలక్కగా ఉండినది. అచ్చట నుండినపుడు ఆమె సహజవివేకమును, అసాధారణప్రజ్ఞను ప్రదర్శించి ఆ కుటుంబమునకు ఉపదేశకర్త్రిగా, మంత్రిణిగా నుండినది. పెండ్లియై ఆమె వచ్చివేసిన పిమ్మట కూడ ఆ కుటుంబమువారు అనేకవిషయములందు ఆమె సలహానర్థించి ఆమె కడకు వచ్చుచుండువారు. దారిద్ర్యస్థితి మానవున కాపాదించు నైచ్యము ఆమెకు ప్రతిక్షణమునందును ప్రత్యక్షమగుచుండునది తన పుత్రు లట్టిస్థితినుండి తప్పి నెలయుటకు ఆమె అతిదీక్ష బూనెను.

### పాఠశాలలో

పూవు పుట్టగనే వాసన తెలియు రీతిని మాసరిక్ బాల్యముననే అతని విద్యాప్రియత్వము వెల్లడి లోనికి వచ్చెను. అక్షరాభ్యాసము చేయుతగు వయస్సు ఇంకను రాలేదు. అయినను కాగితముల కొఱకు, పెన్సిళ్ళకొఱకు మారాము చేయువాడు. ఆ గ్రామము సందిల్లి బడి పంతులు నడిగి కాగితముముక్కలు, పెనసలు ముక్కలు తెచ్చుకొని హృదయము తృప్తిపడునట్లు అర్థము కాని పిచ్చిగీతలు గీయువాడు. క్రీడాచపలుడు. పిల్లలు ఆడు అన్ని ఆటలయందును అతడు మంచిఅభిరుచిని చూపువాడు. పాఠశాలలో పంతులుచెప్పు పాఠములలో కెల్ల చరిత్ర, భూగోళము అతనిని విశేషముగ ఆకర్షించినవి. బోహీమియా, హంగేరీ దేశముల చరిత్రపుస్తక మొకటియు, శిథిలజీర్ణమైన అట్లాసు ఒకటియు అత డెట్లో సంపాదించెను. ఆ అట్లాసు సాయమున ఆస్ట్రియా దేశపు పట్టణముల నామముల పట్టీ ఒకటి తయారు చేసి వానిని కంఠస్థ మొనర్చుకొనెను. ప్రాథమికపాఠశాలలో అతడు కనపఱచిన మంచి తెలివితేటలకు మెచ్చుకొని స్కూళ్ళ ఇనస్పెక్టరొకడు అతని తల్లితో అతనికి ఉన్నతవిద్యాలాభము కలిగించిన గొప్పఉపాధ్యా

యుడు కాగలడని చెప్పెను. తల్లి ఉద్దేశముకూడ ఇట్టిదిగనే యుండెను. తన తనయుడు గొప్ప ఉపాధ్యాయుడు కావలయును. ఆతని కిప్పుడు పదియవ వత్సరము. ఉన్నతవిద్యాభ్యాసమున తగిలియున్నచో ఆతడు పలు వత్సరముల వఱకు ధనము ఆర్జింపజాలడు. ఆర్జింప జాలకుండుగాక ! ఎటులైన కష్టపడి ఆతనికి ఉన్నత విద్యాలాభము కలిగింప వలసినదే అని ఆతల్లి పట్టు పట్టెను. ఫలముగా హస్టోపెక్ నందలి సెకండరీ పాఠశాలకు థామస్ పంపబడెను. ఆతడు పాఠశాలకు తొడుగుకొని వెళ్ళిన బట్టలమూలమున మొదటి టరములో ఆతడు హాస్యపాత్రు డయ్యెను. బండి యజమాని తనతండ్రి కిచ్చిన యూనిఫారము దుస్తులలో మిగిలిన వానితో అప్పటి ఆతని దుస్తులు తయారు చేయబడెను. వాని రంగు నీలము. బొత్తాసులు ఇత్తడివి. ఎంత వికృతముగ నుండవలయునో అంత వికృతముగ నుండెను. హస్టోపెక్ నందు ఆతడు మేనత్త యింటియందుండి చదువుకొను వాడు. మేనత్తయు పేదరాలే. అగుట థామస్ తన యింటనుండుటచే తనకగు వ్యయాధిక్యమును కూడ దీయుటకై ఆమె తన బిడ్డలలో నొకనిని థామస్ తల్లిదండ్రుల కడకు పంపెను.

## కమ్మరివానివద్ద అప్రెంటిసు

రెండు సంవత్సరములలో ఆతడు హైస్కూలు విద్య పారము ముట్టెను. ఉపాధ్యాయవృత్తి నవలంబించుటకు ట్రెయినింగు కావలసియుండెను. పదునారేండ్లు నిండినవారిని గాని ట్రెయినింగుకాలేజిలో జేర్చుకొనరు. అప్పటికి థామస్ కు పదమూడేండ్లు మాత్రమే. ఈ మూడు సంవత్సరములును ఆత డేమి చేయుట? నిర్వ్యాపారమున నుండుటకు ఆతని పేదతన మొప్పుకొనదు. కావున తండ్రి యాతనిని వియన్నానగరము నందలి కమ్మరవాని వద్ద ఎప్రెంటిసుగా జేర్చెను. కమ్మరపని మాసరిక్ మనస్సున కెక్కలేదు. ఆపరిసరము లాతనికి ఏవగింపు కలిగించెను. తాను అచ్చము పల్లెటూరివాడు మొదటిరోజులలో వియన్నా మహానగరము నందలి వింతదృశ్యములు ఆతనికి వింత గొల్పునవి. కాని క్రమముగా నగరమనిన ఆతనికి రోత పుట్ట నారంభించెను. తనతో తెచ్చుకొనిన పుస్తకములతో నాతడు తీరిక సమయములను వెళ్ళబుచ్చుచుండు వాడు. నిరక్షరాస్యులగు తోడి అప్రెంటిసులకు ఇది వింతగ నుండునది. ఒకనాడు వారు ఆతని పుస్తకముల నన్నిటిని దొంగలించిరి. పుస్తకముల పోకడ - ముఖ్యముగా తన అట్లాసు పోకడ-ఆతనికి కలిగిన దుఃఖమునకు మేర లేకుండెను. వియన్నాలో ఆ కమ్మరివాని దగ్గర ఉనికి ఇక దుర్భర మనిపించెను. తాను వచ్చి ఆరు వారములైనది. ఒకనాడు ఆతడు యజమానితో చెప్పకుండ తనగ్రామమునకు పారిపోయెను.

## చేతులు కాయలు కాచినవి

తనయుని రాకకు తండ్రి హర్షించలేదు. ఆ గ్రామము నందే యున్న మఱియొక కమ్మరి వానికడ మాసరిక్ ను అతడు ఎప్రెంటిసుగా జేర్చెను. ఆ పల్లెటూరి కమ్మరి వాడు వ్యవసాయపుపనులు రద్దీగానున్న దినములలో తెల్లవారగట్ల మూడుగంటలు మొదలు రాత్రి పదునొకండు గంటల వరకు పనిచేయువాడు. ఆ రోజులలో మాసరిక్ పడిన కాయకష్టము అంతులేనిది. ఇరువది నాలుగుసంవత్సరములకు పిమ్మట మాసరిక్ ఒకసారి టాల్ స్టాయిని కలసికొనెను. నిశితపరిశీలకుడగు టాల్ స్టాయి కాయలు కాసిన మాసరిక్ చేతులుచూచి నీవెప్పుడైన కార్మికుడవుగా నుంటివా యని ప్రశ్నించెను. ఇరువదినాలుగేండ్ల యనంతరమున గూడ మాయని కాయ కష్టపు చిహ్నములను మాసరిక్ ఆ పల్లెటూరి కమ్మరి వానికడ పనిచేసెడి ఆ దినములలోనే సంపాదించెను.

## ప్రేగ్ విశ్వవిద్యాలయమున అధ్యాపకుడు

**1865** మొదలు **1869** వఱకుగల నాలుగు సంవత్సరములును థామస్ బ్రనోయందలి జర్మను వ్యాకరణ పాఠశాలయందు గడపెను. ఈ సంవత్సరములందు ఆతడు విద్యాసముపార్జనము గావించుచు తన్నుతాను పోషించుకొనుటయే గాక కొంతకాలము తన సోదరుని ఒకనిని గూడ పోషింపవలసియుండెను. అప్పుడప్పుడు ఆతనితల్లి కొంతసొమ్ము పంపుచుండునది. కాని అది ఆతనికి సరిపోవునది కాదు. ప్రయివేటుట్యూషనులు చెప్పుకొని తన ఖర్చులకు వలసిన ధనమును ఆత డార్జిం

చువాడు. 1872-వ సంవత్సరమున అతడు మెట్రిక్యులేషను పరీక్షలో గొప్పగా జయమునందెను. నాటి అతని వయస్సు ఇరువది రెండువత్సరములు. అప్పటి నుండియు అతడు తన దేశపురాజ్యాంగములందు ప్రవేశము కల్పించుకొని పనిచేయు చుండువాడు. జెస్సభావయందు 'అథినియమ్' అను పత్రికను సంపాదించుచు తన రాజకీయాభిప్రాయములకు దివ్యతరప్రచారము కల్పించు చుండువాడు ప్రేగ్ విశ్వవిద్యాలయమున అధ్యాపకుడై యుండి అతడు దేశహితముపొంటె విశేషముగా పరిశ్రమించుచుండువాడు.

## ప్రెసిడెంటు అయినాడు

1914-వ సంవత్సరము డిసెంబరు 17-వ తేదీని మాసరిక్ ప్రేగ్ పట్టణమును వదలి విదేశములకు వెళ్ళెను. 1918-వ సంవత్సరము డిసెంబరు 21-వ తేదిని తిరిగి అతడు ప్రేగ్ నగరమునకు వచ్చెను. పోవునపుడు అతడు అధ్యాపకుడు మాత్రమే. వచ్చునపుడు జెకోస్లావాకియాప్రజాస్వామికమునకు అధ్యక్షుమహాశయుడై వచ్చెను. అధ్యక్షు డగుట నామకార్థము గాదు జెకోస్లావాకియాప్రజాస్వామికమునకు అతడే జనకుడు, అతడే అధ్యాపకుడు, అతడే అధ్యక్షుడు,-అతడే సర్వమును అర్థముకాని రాజకీయభావములతో తెల్లని కాగితములను నలుపుచేయువాడగు గ్రంథకర్తగా మాసరిక్‌ను పరిగణించు దినములు గతమైనవి అతడిపుడు లోకము వారి దృష్టిలో కార్యశూరుడు, స్వదేశజుల దృష్టిలో జాతీయవీరుడు; తన తోడిదేశీయులకు స్వాతంత్ర్యము గొనివచ్చిన పూజ్యమూర్తి.

## జెకోస్లావాకియా : మాసరిక్

మొరేవియాయందలి హొడోనియమ్ అను చిన్న పట్టణమున బండితోలువానికి వంటలక్కకును అతడు పుట్టి ఇప్పటికి ఎనుబదియైదేండ్లు అయినది. జన్మముచేత అతనిభావిఅభివృద్ధి ఇట్టిదిగా నుండునని ఒక్క సూచనకూడ లేదు. విద్యాధికుల అభిమానముగాని, ధనాఢ్యుల ఆదరణగాని ఎఱుగడు. కేవలము తన ప్రజ్ఞచేతనే అతడు యూరపునందలి వివిధదేశములలో పరిపాలనాసౌష్ఠవమునకు, క్రమాభివృద్ధికి పేరుప్రోసి యున్న జెకోస్లావాకియాకు ప్రెసిడెంటు అయినాడు. అసలు జెకోస్లావాకియారాజ్యమే అతని బుద్ధిబలముచే రూపసిద్ధి నందినది.

## తల్లిప్రభావము : ఇల్లాలిప్రభావము

మాసరిక్ ఇంతటి అభివృద్ధికి ముఖ్యకారకులు ఇద్దరు స్త్రీలు. అందు ఒకయాపె అతని మాతృదేవి; రెండవయాపె అతని అర్ధాంగలక్ష్మి. అతనికి ఉన్నతవిద్యాభ్యాసలాభము ఒడగూడుటకు పెక్కుప్రతిబంధముల నడుమ దీక్షవహించినది అతనితల్లి. ప్రాథమికపాఠశాల, మాధ్యమికపాఠశాల, వ్యాకరణపాఠశాల-ఒక్కొక్కపాఠశాల పిమ్మట మఱియొకపాఠశాలలో క్రమమున అతనికి విద్యాలాభ మొనగూడుటకు ఆమె పడ్డ కష్టములకు పరిమితి ఏర్పఱుపరానిది. విశ్వవిద్యాలయమున అతడు కాలూది నిలచినతరువాతనే ఆమె సావకాశముగ ఊపిరిపీల్చుకొనగలిగెనని చెప్పవచ్చును అతని జీవితమున ఇట్టితల్లిప్రభావమునుకూడ మించిన ప్రభావమును ప్రదర్శించినది అతనిభార్య. అతనిని నిరంతర కార్యలోలుని గావించినది అతనిఇల్లాలి ఉపదేశమే. తన ఆదర్శము నెఱవేరదని అతడు భయపడి క్రుంగిపోయిన సమయము లెన్నియో గలవు. అట్టి సమయములందు ఆమె భర్తకు దివ్యోపదేశములు గావించుచు ఉత్సాహమును పూరించునది. ఆపార్శ్వవర్తిని అతనికి ప్రాణమిత్రమై యుండినది. అతనితో సమముగ తానును కష్టపడి చేదోడు వాదోడు అగుచు అతని కార్యభారమును పంచుకొనునది. 1923-వ సంవత్సరమున ఆమె చనిపోవుటతో అతని కుడిచేయి కూలిపోయినదనుట అతిశయోక్తిగాదు.

## అతనిరూపము, అలవాట్లు

ఎనుబదియైదేండ్లు వచ్చినను అతడు ప్రెసిడెంటు హోదాను విడనాడలేదనుచో పలువురు అతనికి అధికారవాంఛగలదని అనుమానింతురు. కాని తన ప్రజల క్షేమాభివృద్ధులకే అతడు అధికారఖడ్గమును ఇంకను తన హస్తములందే నిలుపుకొని యున్నాడు. తొలుత అతనిని చూచుటతోడనే అధ్యాపకుడు జ్ఞాపకమువచ్చునుగాని రాజకీయవేత్త పొడగట్టడు. పండుతెల్లని గడ్డము, మీస

ము. - మిక్కిలి పొడగరి కాడు, పొట్టిగా నుండు వాడును కాడు. ప్రాణధారణకు అనావశ్యకమైనది ఒక ఔన్సు మాంసముకూడ ఆశరీరమున లేదనజాలు పలుచటి మనుష్యుడు. నేత్రములు నివురుతొలగిన నిప్పులు. ఆ పలుచటి పీపుపుల్లశరీరము రాజ్యాంగవిషయములందు విలుగని ఉక్కు-తునక.

వ్రాతబల్లతో అడుగున తోపడముచేయబడియున్న కుర్చీమీద కూర్చుండుట అతని అలవాటు. ఎవరితోడనైన సంభాషించు నవసరమున ఆతడు బల్లమీది వస్తువులను చేతులతో విలాసముగ కదుపుచుండును. ఎంతటి చిన్నప్రశ్నవైచినను ఆతడు అలవోకగా సమాధానము చెప్పడు-దీర్ఘముగ ఆలోచింపనిది పెదవి మెదపడు.

## ప్రజ్ఞాపాండిత్యములు

యూరోపుఖండపు అన్ని ప్రధానభాషలతోడను ఆతనికి పరిచితిగలదు. ఆయాభాషలయందలి ఆధునికసారస్వతమును చదువుటయందు ఆతనికి అభిలాష మెండు. అనువాదములకంటె స్వతంత్రరచనల నాతడెక్కువగ ప్రేమించును. బహుభాషలు నేర్చిన ప్రోడయగుట ప్రఖ్యాతగ్రంథము లన్నిటిని మాతృకలయందే చదువును. ప్రేగ్ నందలి పూర్వపురాజ్యభవనమున మూడుగదులు ఆతనికై ప్రత్యేకింపబడియున్నవి. ఆగదు లొక దేశాధిపతివివలె చూపట్టవు. ఒక విద్యార్థి గదు లనిపింపజాలి యుండును. ముందటి గదిలో కొద్ది పుస్తకములుండును. ప్రక్కగది అంతయు పుస్తకములతో నిండియుండును. భాండాగారము పుస్తకముల పాతర. పడకగదిలో నాలుగుగోడలకు గోడలఎత్తున పుస్తకముల దొంతరలు. అందు డికెన్సు, మార్కు-ట్వేన్, ఓ. హెన్రీ, జార్జి మూర్, డి. హెచ్. లారెన్సు మున్నగుకవుల గ్రంథములు ప్రముఖస్థానమున నుండును. థామస్ గారిక్ మాసరిక్ నవలలనిన చెవికోసికొనును. ప్రెసిడెంటు విల్సనువలె మాసరిక్ నకు అద్భుతకథానకములనిన సరిపడదు. చారిత్రకసాంఘికనవల లతనికి ప్రియతమములు. చరిత్రకారునికంటె చారిత్రకనవలారచయితయే దేశముయొక్క నిజస్థితిని ప్రదర్శించుటలో సమర్థుడై యుండునని ఆతడు చెప్పును. తన జయములను గూర్చి ఆతడు మౌనముద్రవహించును. రాజకీయవ్యవహారములనుగూడ నాతడు తన చదువులగదిలోనే నిర్వహించును. అందు ఎట్టి ఆడంబరములును, రాజ్యచిహ్నములును లేవు. కాని గదిమాత్రము పెద్దది. వాయుప్రసారమునకు చక్కని అనువుకలది. ఆ గదిలో ఒకమూల ఒక పాతవ్రాతబల్ల గలదు. అది ఆతడు ప్రేగ్ విశ్వవిద్యాలయమున అధ్యాపకుడుగానున్న కాలమునాటిది. అందచందములు లేవు. మామూలు మానుతో చేయబడినది. జీర్ణశిథిలమైయున్నది. దానినే నేటికికూడ ఆతడుపయోగించును. రాజ్యాంగపు పనులనుండి ఏమాత్రపు విశ్రాంతి కలిగినను ఆతడు వెంటనే పడుకగదిలోనికి బోవును. పండుకొనుటకు గాదు. గ్రంథరచనావ్యాసంగమున పర్యాప్తుడగుటకు. వ్రాసి ప్రచురించినవి పెక్కు గ్రంథములు గలవు. వ్రాయుచున్నవియు పెక్కుగలవు.

## దినచర్య

ప్రతిదినమును పెందలకడనే లేచును. కార్యదర్శులతో సంప్రదించును. వారు నివేదించు కార్యములను నిర్వర్తించును. అనంతర మొకగంటకాలము షికారు వెడలును, లేదా గుర్రపుస్వారి చేయును. వాతావరణస్థితి బాగున్నచో తన ఆవరణయందున్న బాదాముచెట్ల క్రింద కూర్చుండి భోజనము చేయును. దినమునకంతయు ఆతని కది యొక్కటియే భోజనము. మద్యము ముట్టడు. పొగ త్రాగడు. అట్లని అతిథులు త్రాగుటను నిరోధింపడు. భోజనానంతరము ఆతడు గ్రంథపఠనమునకు గడంగును. సాయంకాలము షికారున కేగును. రాత్రికాలభోజనము మిక్కిలి తేలికదైనది. ఒక్కొక్కప్పుడు ఒక్క కప్పు పాలతోడనే నాతడు తృప్తిపడును. అనంతరము మిత్రులతో, బంధువులతో ఇష్టాగోష్ఠి జరిపి తొమ్మిది పదిగంటల నడుమ నిద్రకేగును.

## ఆరోగ్య పరిరక్షణము

ఇంతటి వృద్ధాప్యమునగూడ ఆరోగ్యవర్ధిష్ణుడై యున్న ఆతని ఆరోగ్యసూత్రములను గూర్చి ప్రశ్నింపగా ఆతడొకసారి ఇట్లు చెప్పెను : "దేహపరిశ్రమ నొనర్తును. క్రీడలయందు పాల్గొందును. పరిశుభ్రమైన గాలి, సూర్యాతపము, పరిశుద్ధమైన జలము అనిన నేను

భయపడను. మితిమీరి భోజనము చేయను. మద్యము ముట్టను. శరీరమున కంతటికిని తగినపని నాకున్నది. వినోదమెుక్కటే మానవుని బ్రతికింపజాలదు. దేశీయములైనవి, సొంతములైనవి బహుకార్యములు నాకు గలవు. పరిశ్రమ, క్రీడ దేహమునకు, మనస్సునకు ఉల్లాసము కలిగించును. తన దేహారోగ్య విషయమున తగినంత జాగ్రత్త తీసికొనని వ్యక్తి ఆదర్శకపౌరుడు కాజాలడు.''

## నిరాడంబరత, ఇతరగుణములు

అధ్యాపకుడై యుండిన కాలమున నెట్లుండెనో అధ్యక్షుడైనకూడ ఆతడట్టి నిరాడంబరుడై యున్నాడు. అధికారము ఆతనికి అహంకారమును కలిగింపలేదు. తాను వెల్లడిలోనికి రావలయునను కాంక్షయు లేదు. ప్రజలు అనుమతించుచో తన పుస్తకభాండాగారమున కూర్చుండి తన ఈ వృద్ధాప్యమును వెళ్ళద్రోయవలయునని ఆతని అభిలాష. 'ఐహికవాంఛల చెఱవేర్పు కొనుటకు వలసిన ధనసంపత్తి, సంపూర్ణస్వాతంత్ర్యము ఉండిన కాని ఏ దేశపు జనులును సుఖులు కారు. కడుపు మాడుచుండు స్వాతంత్ర్యము ఒట్టి అభాసము. సామాన్యకర్షకునకు ఆతని ఇల్లే ఆతని దేశము. అట్టివానికి దేశభక్తి అర్థము కానిది. తోలుత తనకు తాను యజమానినని అతడు గుర్తించునట్లు ఒనర్పుడు. వారి వారి గృహములను బాగుచేసికొనుటకు సాయమొనర్పుడు. జెకోస్లావాకియా ప్రజలు తమ దేశమునకు తాము స్వామిదారులగుటను తెలిసికొనినారు.' ఇదియే ఆరాజకీయ వేత్త వార్త.

దేశజాలకు తాను అతీతుడు కాడు. తాను వారిలో నొకడు. కావుననే వా రాతనిని గాఢముగ ప్రేమింతురు. ఆతని చల్లని పరిపాలనమున నుండినందుల కా దేశజులెల్లరు మిక్కిలి గర్వింతురు. జెకోస్లావాకియా ప్రజాస్వామికము యొక్క శాంతిభద్రతలకై ఆ దేశమునందలి ప్రతిఒక్క పౌరుడును థామస్ గారిక్ మాసరిక్ నకు ఆయురారోగ్యములు ప్రసాదింప పరమేశ్వరుని ప్రార్థించును.

—వి. జగన్నాథస్వామి, బి.ఏ.

## పుస్తకాలముష్టి

ఏదైనా పుస్తకముగాని, పత్రికగాని చదువుతూండగా ఎవరైనా వస్తే, "ఏమిటి ఆ పుస్తకం? ఏదీ వొకమాటు చూడనివ్వండి" అంటూ మనం యిచ్చేలోపుగానే పోలీసువారు జులుం చేసి లాక్కున్నట్టుగా చేతిలోవున్న పుస్తకాన్ని లాక్కుంటారు. ఇది అందరికి అనుభవపూర్వకమే. ఎంత ఆసక్తితో చదువుతున్నా సరే, ఎంతవరకు చదివామో గుర్తించుకోక పోయినా సరే ఆవిధంగా జబర్దస్తీగా లాగడమునకు చక్రవర్తిగారు తనకు ఫర్మానా యిచ్చినట్లు తీసుకోవడము మనలో చాలామందికి అలవాటు. ఇది ఎంత మర్యాదాతిక్రమణమో అంత తక్కువగా జరుగుతూంది. ఎవరైన యిట్టిది కూడదని తెలియజెపితే "యిల్లాంటి వెన్నో చేస్తున్నాము. అందులో యిది వొకటి," అని సమాధానం చెప్పుకుని వూరుకుంటారు.

ఈ ముష్టిబుద్ధి తెనుగునాయకులకు పరిపాటి అయిపోయింది కలిమిలేములకు, దీనికి సంబంధం లేదు. ఉన్నవాడు, లేనివాడు సమంగా చెయిచాస్తున్నారు. అందులో లేనివాడే కొంచెము జంకుతాడు. లేమిచేత చేస్తున్నాడనుకుంటారని; దారిద్ర్యము మిక్కిలి అవమానకరమైన సంగతికదా మన అభిప్రాయము? కలవాడు-జగమెరిగిన బ్రాహ్మణుడు గనక - నిర్భయంగా, నిర్లజ్జగా దేహీ అంటాడు. మీ గ్రామఫోనుగాని పెట్రోమాక్సుగాని, సైకిలుగాని, రిస్టువాచీగాని ఫవుంటెన్‌పెన్‌గాని కొనుక్కోండి. వాన్ని యెరువడగడమునకు మిమ్మల్ని యెరిగివున్నవాళ్ళు, యెరగనివాళ్ళు కూడా వస్తారు; యిమ్మని పీడిస్తారు; ఇస్తే పాడుజేసి తెస్తారు; యివ్వకపోతే వారి

పిత్రార్జితాలు మనమేదో అపహరించినట్లుగా తిట్టి దుమ్మెత్తిపోస్తారు. వీటినన్నిటిని మించింది పుస్తకాలముష్టి. మిగిలినవి వొకమారు వుపయోగించేవరకైనా వూరుకుంటారు. పుస్తకం నువ్వు చదవనవసరం లేదు వాళ్ళడగడమునకు. ఇవ్వవనేందుకు కూడా నీకవకాశము లేదు ; ఉపోద్ఘాతమైనా లేకుండా లాక్కుంటారు కనక.

కొందరు ఎప్పుడూ ఏదోవొకటి చదువుతూనే వుంటారు. కాని దమ్మిడీ ఖర్చుపెట్టి పుస్తకంగాని, పత్రికగాని కొన్నపాపానపోరు. నిరంతరము అడుగుతూ వుండడమే.

కొందరు తెచ్చుకొన్న పుస్తకాలు వెంటనే చదివి తిరిగి యిచ్చేస్తారు కొందరు ఆలస్యంగా చదువుతారు ; కాని చదివిన వెంటనే యజమానికి యిచ్చేస్తారు మరికొందరు వున్నారు; పుస్తకం చదివేవరకు చదవాలనే మోజుతోవుంటారు; చదివినమీదట దానిని పొందివుండాలనే మోజుపడి దానిని యజమానికి యివ్వకుండా వుండేటందుకు ఎన్ని తిప్పలుపడాలో అన్నితిప్పలు పడతారు. ఆయిచ్చినవాడు నావంటి తోకపీకుడుగాడయితే యీ తెచ్చుకున్న తిప్పయ్య శాపనార్థాలు పెడుతూ యేడమొగం పెడమొగం పెట్టుకుని యిస్తాడు. కాని మర్నాడే యింకొకపుస్తకముకొరకు మళ్ళీతయారు. కొయ్యతోటకూరకీ సిగ్గు లేదు, కొడవలికీ సిగ్గు లేదు.

ఎవరిమట్టుకు వారు గ్రంథాలన్నీ కొని చదవడము కష్టము. అందుకు తగిన ధనము వుండదు. కనుక మందిరములు మొదలగు వానికి సాయముచేయుట చదువుకొన్నవారి విధి. కాని వీరట్లుచేయరు. పోని డబ్బుఖర్చుపెట్టని పరమలుబ్ధులా అంటే అదీకాదు. కాఫీదేవాలయములలో వీరు నిత్యపదితర్పణములు నడుపుతారు; సిగరెట్లను టిన్నులతో సహా వూదేసే నిత్యాగ్నిహోత్రులు; కిల్లీదుకాణముల నభిమానించే అనురాగచిత్తులు. వీరిని లోభిసంఘముతో జేర్పడము మిక్కిలి అన్యాయము.

గ్రంథభాండాగారములు వచ్చిన తర్వాత మరొకక్రొత్తరకంముష్టి వచ్చింది. 'మావూళ్ళో ఉచితపఠనాలయం పెట్టిస్తున్నాను. విద్యాభిమానులగు మీరు రచించిన పుస్తకరాజములను మాకుచితముగా దయచేసి మీ దేశాభిమానమును వెల్లడించుకొన ప్రార్థించుచున్నాను. మీరు తప్పక పంపుదురను నమ్మకముతో గ్రంథదాతల నామములలో మిమ్ముకూడా చేర్చి పత్రికకు పంపితిని'' అని ప్రతి అమావాస్యపురం నుంచీ ముష్టి వుత్తరాలే. చదువుకోవాలని అభిలాషవుండికూడా, శక్తికొలదీ ధనము కర్చుచేయని దేవుడుగొట్టు పెద్దమ్మలకు పుస్తకముల నివ్వడము మహాపాతకములలో ఆరవదని నాకు తట్టుతూంది.

మరి యీముష్టిబుద్ధికి కారణమేమిటయ్యా అని మీలో కొందరు నన్ను ప్రశ్నిస్తున్నారు. నేనుమాత్రం కొమ్ములు తిరిగిన మనోతత్త్వశాస్త్రవేత్తనా ? దానికి సరియైన జవాబురాక తికమకలు పడుతున్నాను. ఇదంతా అనాలోచనాయుతమని అనిపించుతూంది నాకు ఏమందురా ? ఇట్టి ముష్టివల్ల యెంత అనవసరమైన బాధ కలుగుతూందో వారికి తెలియదు. వేళా వేళలు లేకుండా అడిగితే యిచ్చే పెద్దమనిషికి యెంత చికాకుగా వుంటుందో పుస్తకాలిచ్చే వాళ్ళకే తెలుస్తుందిగాని యితరులకు తెలియదు—అందులో పుచ్చుకునేవాళ్ళకు అసలే తెలియదు.

పోనియ్యండి - యేం పుస్తకమిచ్చినంత మాత్రాన వానికి కాలహరణమవుతుందా అంటున్నారా ? మరి గ్రంథకర్తమాట యే

మిటి ? అందరు అతని పుస్తకము చదివి ఆనందిస్తూంటే అచ్చువేయించిన పుస్తకాలు అమ్మకముగాక. నిరాశతో, సగము మూడిన డొక్కతో, ఛిద్రవస్త్రాచ్ఛాదితమైన బడుగు దేహముతో మిథ్యాప్రశంసావాక్యములు వింటూ కళ్ళనీళ్ళు తుడుచుకుంటాడు. మన పూర్వులు కవితాకన్యపోషణమునకు యింపయిన భోజనము, కమ్మని తాంబూలము, మెత్తనిశయ్య అవసరమని తలచి తమనాటి కవులను ఆకలిబారినుండి తప్పించినారు. ఆ దోహదమున కనుకూలముగ పేరుగల కావ్యములు మొలకలెత్తి పుష్టినొందినవి. కాని యీనాటివారు కవులు నీరసులైతే వారి కవిత్వము రసవంతమెట్లా అవుతుందని యోచింపరు. కవిత రసవంతముకావలె; కవి యెట్లుంటేనేమని వారి యోచన. పూర్వం షైలాకు కొంతడబ్బు అప్పిచ్చి అంటోనియో దేహమునుండి ఒకపౌను మాంసమును కోరినాడు. ఈనాటి పాఠకషైలాకులు ఏమీ యివ్వకుండానే పౌనుమాంసమును కవినుండి కోరుతున్నారు. ఇది యెట్లా సాధ్యం ?

కష్టపరంపరలచే ఒత్తబడిన కవిహృదయమునుండి సత్కవితారసము బయల్వెడలుట సుప్రసిద్ధవిషయ మందురా ? కాని యీ కష్టము క్షుద్బాధాజనితముకాదు. సదాలోచనానమన్వితమగు కవిమానసాకాశమున గలుగు భావసంఘర్షణమువలన నుదయించిన సంక్షోభకారణముగ సత్కవిత యుదయించును. మనసున కాటపట్టగు శరీరము ఉడుపదగిన క్షుత్పిపాసా పీడితయగునపుడు కవితయును రాదు, రసవంతకును స్నేరాదు.

ఈ పాపమునకు మనలో చదువుకున్నవారెక్కువగా పాల్పడుతున్నారు. తెలిసీ తెలియక మన మనేకవిధాల ధనం దుబారాగా ఖర్చు పెడుతున్నాము. టిన్ను 1 కి రూపాయిన్నరచొప్పున సిగరెట్లుకొని ఒకరోజులో కాల్చేస్తున్నాము; కాఫీహోటళ్ళలో అరతులంవరకు దినదినం వదుల్చుకుంటున్నాము. ఈతీరుగా ఆరోగ్యానికి భంగకరములయ్యే వ్యర్థవ్యయాలు చేస్తున్నామే ? అట్టి మనం మనస్సునకు ఆహారపుష్టినిచ్చే గ్రంథపఠనమునకు డబ్బు ఖర్చుపెట్టలేమూ ? పెట్టగలము. కాని ఆ ఆలోచన లేకుండానే సంచరిస్తున్నాము. సంపాదనలో నూటికి రు 2 ల చొప్పున వార్తాపత్రికలకు, రు 2 ల చొప్పున గ్రంథపఠనమునకు కనీసః ప్రతి పౌరుడును ఖర్చుపెట్టుట విధియని నామనవి.

చూడండి బజారునుంచి వస్తూంటే ఇంట్లో పిల్లలకు చిరితిండి కొని తీసుకువెళ్ళే తండ్రులు అన్నలు చాలామంది వున్నారు. అంతే కాని "యీ పుస్తకము పఠనయోగ్యమైనది. మా అబ్బాయికి యిస్తాను". అంటూ కొనితీసుకువెళ్లే జనకు లెందరున్నారు? ఈగలు దోమలు వాలి, దుమ్ము ధూళిపడిన మిఠాయి కన్నను విద్యాబుద్ధులనిచ్చే పుస్తకాలు మేలుగాదా ? అవునని అతనికి తెలియదా ? తెలుసును. కాని యీ యోచన అతనికి తట్టదు; కనుక చేయడము లేదు. అందుచేతనే యిదంతా అనాలోచిత మని నేను మొదటలో మనవిచేసుకున్నాను.

తెలుగువారు యీ ముష్టిబుద్ధిని పోగొట్టుకొని మాతృభాషాసేవచేస్తే అచిరకాలంలోనే ఆంధ్రసారస్వతము సర్వతోముఖంగా అభివృద్ధి పొందుతుంది; లేదా నీళ్లు లేని పుష్పలత నానాటికి వన్నెతగ్గి వాడిపోయినట్లు నీరసిస్తుంది. ఆంధ్రపుత్రుడా ! ఇకనైన నీధర్మమును నెరవేర్పగడగవా ?

—నిడమర్తి సత్యనారాయణమూర్తి, బి.ఏ.

# మామిడిపండ్ల పేర్లను గురించి

పొడుపుకథల పరిభాషలో కొన్నికొన్ని పళ్ళకు భావార్థకములైన చమత్కారపుపేర్లు ఉంటాయి. ఆ పరిభాషలో వెలగపండు 'ఆకాశాన వ్రేలాడే వెన్న ముద్ద'—పనసపండు 'తండ్రి గరగర. తల్లి పీచుపీచు. బిడ్డలు రత్నమాణిక్యాలు. మనమలు బొమ్మరాళ్ళు'—మామిడిపండు 'ముడ్డిపిసగ. మూతినాక.' ఇంకా ఎన్ని పళ్ళకో ఇల్లా పరిభాష ఉంది. అయితే పొడుపుకథల్లో ప్రయివేటుగా చదివి ఎమ్మే పరీక్షఇచ్చిన మాయింటావిడ ప్రస్తుతం వాళ్ళపుట్టింటికి వేసవిక్యాంపు వెళ్ళి ఉంది. తాలూకాకచేరీలో గుమాస్తాగిరి ఒకటి ఉండడంచేత కచేరీయే నాకు సిమ్లాగా ఉండిపోయింది. మా యింటావిడ దగ్గరలేకపోవడం మూలాన్ని పళ్ళవిషయమైన పొడుపుకథల పరిభాష పొడుగించలేకపోతున్నాను. వేసవిక్యాంపు అని పేరుపెట్టింది కాని ఇప్పుడు మాఆవిడ పుట్టింటికి వెళ్ళినకారణం కొత్తగా కాపుపట్టిన మా మామగారి అంటుమామిడితోటలోని పళ్ళను తన ముక్కుక్రిందిగోతులో పడెయ్యడానికేనని—ఏమ్యామెజీగిన పెద్దను కాకపోయినప్పటికీ— నేను చెప్పగలను.

కచేరీలో ఏదో ఉంటున్నానన్న మాటేగాని నా మనస్సు ఎంతసేపు మా ఆవిడతినే మామిడిపళ్ళ మీదే ఉంటూంది. పళ్ళల్లో మామిడిపండు రాజు అని చెప్పాలి. మామిడిపళ్ళల్లో ఉన్నన్నిరకాలు, ఉన్నన్నిపేర్లు ఇంక ఏపళ్ళకూ లేవు. నిజంగా పేరుకెక్కిన పళ్ళు మామిడిపళ్ళే అని చెప్పాలి. మా ఆవిడ మామిడిపళ్ళు తింటోంది అని నేను ఇక్కడ గుటకలువేస్తూ కూచోడం కంటె ఆపళ్ళపేర్లు ఎల్లా ఏర్పడ్డాయో, వాని విశేషమేమిటో లోతబిసీళ్ళు తెలిసికోవడం మంచిదని తలచి నే నీవ్యాసం వ్రాస్తున్నాను. మామిడిపళ్ళుతిని ఆవిడ సంతోషిస్తోంటే వాటినిగురించి వ్రాసి నేను సంతోషిస్తాను.

మామిళ్ళలో రెండురకాలు దేశవాళీలని, అంటుమామిళ్ళని. దేశవాళీలలోను, అంటు మామిళ్ళలోను అనేకం పేర్లుఉన్నాయి. కొన్ని పళ్ళపేర్లు పక్షులను బట్టి ఏర్పడిఉన్నాయి. 'కాకిముక్కున దొండపండు' అను సామెతలో పక్షిసంబంధంవల్ల పండుకు నైచ్యం కలిగింది. మామిడిపండు విషయంలో ఏపక్షికూడా దీనికి నైచ్యాన్ని ఆపాదించలేదు. దేశవాళీమామిడిపళ్ళల్లో 'చిలకముక్కులు' చాలా ప్రసిద్ధికెక్కినవి. వాటిరుచి వర్ణించి చెప్పగలవారు సకృత్తుగా ఉంటారని నానమ్మకం. నా ఎఱుకలో అట్టివారు ఒకరు విశాఖపట్టణంలో ఉన్నారు. వారు రాజమండ్రీలో తాసిల్దారీ చేస్తోన్నప్పుడు ఒక కరణంగారి ఉద్యోగం ఊడిపోయే స్థితిలోకి వచ్చింది. ఆ కరణంగారు అసళంగా ఒక బుల్లి గంపెడు చిలకముక్కుమామిడిపళ్ళు ఒకానొకనాటి సూర్యోదయాత్పూర్వము బ్రహ్మముహూర్తమప్పుడు తాసిల్దారుగారి వీధివైపు వసారాలో ప్రతిష్ఠించారు. ఆ నాడు పదిగంటలకు ఆ పళ్ళతో భోజనంకానిచ్చి తాసిల్దారుగారు కచేరీకివచ్చి కుర్చీలో కూర్చుని చిలకముక్కు మామిడిపళ్ళరసము త్రేనుపు వస్తూఉండగా కరణంగారి మీది కేసు కొట్టివేశారు. చిలకముక్కు మామిడిపళ్ళ మహాత్మ్యమట్టిది. అవసరమైనవాళ్ళు అవగతము చేసికొని అప్రమత్తులై మెలగెదరుగాక!

కొన్ని మామిడిపళ్ళపేర్లు జంతువుల్నిబట్టి ఏర్పడ్డాయి. ఉడతలు పీకిన తాటిటెంక - ఏనుగు తిన్న వెలక్కాయ - నక్క, ద్రాక్షపళ్ళు - మొదలైన జాతీయములు ఆయాపళ్ళకు ఆయాజంతువులకు గల సంబంధాలని నిరూపిస్తున్నాయి. జంతువులతో మామిడిపళ్ళకు కొంత సంబంధం ఉండితీరాలని సూచించేవి 'ఏనుగుతలకాయల మామిడి, పీతలపసందు' అను రెండుపేర్లు బాగా వాడుకలో ఉన్నాయి. దేవుళ్ళలో ఏనికమోము సామి ఒకడున్నాడు అతనికిని ఈ ఏనుగుతలకాయల మామిడికిని ఉన్న సంబంధమేమిటో ఎందఱు పురాణవేత్తలను అడిగినా చెప్పలేకపోతున్నారు. పేంకచే

శ్వరస్వామివారికి పానకము, వడపప్పు; సత్యనారాయణమూర్తివారికి గోధుమనూక ప్రసాదము; శ్రీరంగస్వామివారికి తైరువడ; పితృదేవతలకు 'పనసకాయ' ఇష్టమైనట్లు ఏనికమోముసామికి ఏనుగుతలకాయల మామిడి ఇష్టమైనదని నిదర్శనాలేవీ కనుపించవు. మా భానుమూర్తిమామగారి తోటలో ఏనుగుతలకాయల మామిళ్ళు రెండు ఉన్నాయి. వాటిని ఆయన ప్రత్యేక శ్రద్ధతో - ముసురురోజుల్లోకూడా బాల్చీలతో నీళ్ళుపోయిస్తూ - పెంచుతూవుంటాడు. ఈ కాయల విశేషమేమిటని నేను ఎన్నిసార్లు ప్రశ్నించినా ఆయన చెప్పలేదు. కడియంవారి కేటలాగులో మాత్రం 'ఇవి చాల పెద్దకాయలను కాయును' అని వర్ణింపబడ్డది. ఈ కేటలాగు కూర్చినవారి అభిప్రాయంలో ఏనుగుతలకాయంత కాయఅయితే అది 'చాలా పెద్దకాయ' అని కాబోలు! వారీసారి కేటలాగు తిరిగి అచ్చువేయక పూర్వం ఒకసారి పనికట్టుకుని నూజివీడు వెళ్ళి మా భానుమూర్తిమామగారి బొజ్జను చూచి రావలసిందని ప్రార్థిస్తున్నాను. చూచినపిమ్మటకూడ వారికి ఏనుగుతలకాయే పెద్దదిగా కనిపించినట్లు అయితే కంటివైద్యశాల ప్రస్తావనలేకుండానే ప్రూఫులు దిద్దకుండానే వారి కేటలాగు తిరిగి అచ్చువేసుకోవచ్చును. జంతువుల్నిబట్టి పేళ్ళు ధరించిన మామిడిపళ్ళలో 'పీతల పసందు' ఒకటి. అసలు పీతలమాంసం ఎంతపసందుగా ఉంటుందో బ్రాహ్మణ్ణి అవడంచేత నాకు తెలియదు. పీతలకు ఈజాతిమామిడిపళ్ళకు ఏమిసంబంధమో తలవెంట్రుకలన్ని వాచకపుస్తకాలు వెలుస్తూన్న ఈ దినాలలోకూడా ఒక్క వాచకపుస్తకంలోనైనా వ్రాయబడి ఉండలేదు. రొయ్యలు, గండుమీలు, మట్టగిడసలు, నత్తలు మున్నగు ఎన్నో జలచరాలు ఉండగా ఈ ఒక్క పీతలకు మాత్రమే పసందైన మామిడిపళ్ళు కల్గడానికి కారణం ఊహించలేకుండా ఉన్నాను. కేవలం పీతలయొక్క అదృష్టంఅని చెప్పాలి. నోచినవారి సొమ్ములని నోమనివారికి కల్గనేర్చునే!

కొన్నికొన్ని మామిడిపళ్ళ రకాలకు అవి ఆదిలో ఉత్పత్తిఅయిన స్థలాల్నిబట్టి పేళ్ళువస్తాయి. మైలాపురి, గోవా, బంగినపల్లి ఇట్టివి. గోవాలకంటె బంగినిపళ్ళప్రసిద్ధి హెచ్చు. కూరలలో గోంగూరమీద ఉన్న మోజుకంటె తెలుగువారికి పళ్ళల్లో బంగినిపల్లి మామిడిపళ్ళమీద హెచ్చుమోజుఉంది. బంగినిపల్లి అనేది దత్తమండలాల్లో - రాయలసీమఅనాలి కాబోలు - ఉంది. ఈపళ్ళు ఆదికాలంలో అక్కడనుంచే వచ్చినవని చారిత్రకనిదర్శనా లున్నాయి ఈజాతి చెట్లు ఇప్పుడు ఆంధ్రదేశం అంతటా పెంచబడుతూ ఉన్నాయి. ఉత్తరసర్కారుల ఆంధ్రులు వీటికి విశేషంగా రుచిమరిగి ఉన్నారు. రాయలసీమవారు మీ విశ్వవిద్యాలయంలో మేంకలపము అని ఉత్తరసర్కారుల వారికి చెపుతూఉన్నా సర్కారుల ఆంధ్రులు ఏమిన్నీ ప్రతీకారము తలపెట్టకుండా ఉన్నారు. అదిలో మీసీమనుంచి రానారంభించిన బంగినిపల్లి మామిడిపళ్ళను మేము ఇపుడు మీరు మాలో కలవకపోతే బహిష్కరిస్తున్నామని సర్కారుఆంధ్రులు రాయలసీమవారికి అల్టిమేటమ్ ఇస్తే వారు వారిపళ్ళప్రతిష్ఠకోసమేనా మనలో కలవకమానరు. ఆంధ్రమహాసభ ఎప్పుడేనా సమావేశమైతే దీన్నిగురించికూడా ఆలోచించునని ఆశిస్తున్నాను. బంగినిపల్లి పళ్ళను బహిష్కరించడమనగా సామాన్యమైన పనికాదు. అవి లోగడ ఎందరికో ట్రెయినింగులో సీట్లుదొరకవనుకున్నవారికి సీట్లను ఇప్పించినాయి; ఫేలుకానున్న విద్యార్థులను ప్యాసు చేయించినాయి, చిన్నటైపులో అచ్చువేయబడి ఒక ఘోరము తప్పొప్పులపట్టికతో ఉన్న పుస్తకాన్నికూడా అప్రూవు చేయించాయి, టెంకకంటే గట్టివైన పదాలతోను జీడికంటే విలువలేని విషయములతోను ఉన్న వ్యాసాలకి ప్రచురణభాగ్యమును లభింపజేసాయి. ఎందరికో ఆక్టింగుగుమాస్తాలకు ఖాయపు ఉద్యోగా లిప్పించాయి, ఎందరో అల్లుళ్ళను మామగారులయెడ సుముఖులనుగా చేశాయి. ఎన్నని చెప్పగలను? డబ్బు పనిచేయనిచోటకూడ ఇవి పనిచేశాయంటే నమ్మండి. అట్టి పళ్ళను బహిష్కరించడం - రాయలసీమ ఆంధ్రులు తమతో కలవాలనిఉంటే సర్కారుఆంధ్రులకు గత్యంతరములేదు. అయితే ఈ బహిష్కారము శాశ్వ

తముకాదు. హాళ్ళూ మనం ఏకమైందాకానే. తరవాత వాళ్ళూ మనం కలసి బంగలాది బంగినపల్లి పళ్ళను 'మిసిమింతులమును గాక (మింగవచ్చు.' ఏకాశి ఉపవాసముండి ఆనాటిభోజనం మఱునాటిభోజనం కలిపి రెండింతలుగా ద్వాదశి పారాయణాలలో లగాయించే సనాతన మహాశయులను ఈ విషయంలో మనం ఆదర్శంగా కొంటే తప్పులేదు.

ఉద్యోగాన్నిబట్టి ఒక జాతిమామిడిపండుకు పేరు ఏర్పడ్డది. అదే కలక్టరు మామిడిపండు. బిల్లుకలక్టరు, టికెక్ట్టు కలక్టరు, డిప్యూటీకలక్టరు, సబ్ కలక్టరు, జిల్లాకలక్టరు ఇల్లా ఎందఱో కలక్టర్లు ఉన్నారు. ఇందులో ఏకలక్టరు పేర ఈ పేరు పుట్టబడ్డదో నేను చెప్పలేను. ఈ కలక్టర్లలో ఎవరిమట్టుకు వారే మా పేరనే ఇది పుట్టబడ్డది అని చెప్పుకోవచ్చును. నాకు ఉద్యోగం ఇచ్చింది ఒక డిప్యూటీ కలక్టరు. ఖాయంచేసింది ఒక సబ్ కలక్టరు. జిల్లాకలక్టరొకడు అటెండరురాన్కులోంచి క్లార్కు రాన్కు మార్చాడు. నాస్నేహితుడు ఒకడు టికెట్టుకలక్టరు. మా పెత్తల్లిగారి పెద్దకొడుకు ఇపుడు పాలకొల్లులో బిల్లుకలక్టరు. ఇంతమంది కలక్టర్లతో ఏవో ఒక విధమైన సంబంధంగల నాకుకూడా వాళ్ళ పేళ్ళు సాముదాయకంగానో వ్యష్టిగానో దాల్చిఉన్న కలక్టరు మామిడిపళ్లు అంటే రుచికి ఏమీబాగా ఉండవు. అన్నిమామిడిపళ్ళూ అయిపోయినతరవాత ఆశ్వయుజమాసంలో వస్తాయన్న ఘనతతప్ప ఈ కలక్టరు మామిడిపళ్ళలో నాకేమీ విశేషం కనిపించలేదు. ఉందని నిదర్శనపూర్వకంగా చూపగలవాళ్ళు ఎవళ్ళైనా ఉంటే వచ్చే ఆశ్వయుజమాసంలో రెండుమూడువందలు ఈ జాతి మామిడిపళ్ళు నాకు పంపించి నాచేత ఒప్పించవచ్చునని మనవిచేసి కొంటున్నాను. లంచాలతో రోజు రోజూ జేబులునిండే సబ్ రిజిస్ట్రారు, ఆఫీసులలోకి వచ్చే క్రొత్తవారిమీద కర్రపెత్తనం చెలాయించే డఫేదారు, తాలూకాకు అంతటికీ రాజైన తాసిల్దారు, ఆఫీసు సిబ్బందినంతా వ్రేలి క్రింద నొక్కిపెట్టే సిరస్తాదారు-ఇంకా -జడ్జి, మునసబు, ఇనస్పెక్టరు, మేజిస్ట్రేటు మొదలగు ఉద్యోగస్థుల ఎవరిపేరుతోను మామిడిపళ్ళు వెలయక పోవడం ఆశ్చర్యకరమైందే. స్కూలుమేష్టర్లలో చాలామందికి స్వంతపేర్లకుతోడు మారుపేర్లు ఉంటాయి. స్వంతపేరో మారుపేరో ఏదో ఒకటి ఉంచుకొని రెండో ది వివిధనామాలతో ఒప్పుతూవున్న మామిడిపళ్ళకు అంటగట్టడాన్ని గూర్చి స్కూలుమేష్టర్లు ఆలోచించవలసిఉంది. వేసంగిశలవులలో విద్యార్థులు తమతమ గ్రామాలకి పోయిఉంటారు కాబట్టి ఇప్పుడే స్కూలు మేష్టర్లు అంతా సమావేశమై తమకుగల అధికనామాల విడుదలకు ప్రయత్నంచేతురుగాక ! స్కూళ్ళు తెఱిచి విద్యార్థులు వచ్చారా అంటే పేళ్ళు దులిపేసుకునే స్కూలుమేష్టర్ల ఆటలుసాగవు. అదీగాక అప్పటికి వీరి పేళ్ళను స్వీకరించగల మామిడిపళ్ళ ముమ్మరంకూడా తగ్గిపోతుంది. ఆలస్యం అమృతం విషం.

నాగరికతప్రబలి కొన్నికొన్ని మామిడిపళ్ళపేళ్ళను మార్చేస్తోంది. 'కోతిపిఱ్ఱలమామిడిపండు' అనునది ఒక జాతిపండుపేరు. జంతువులతో సంబంధంగల మామిడిపళ్ళను గూర్చి వ్రాసినప్పుడే దీన్నిగురించికూడా వ్రాయవలసిందికాని ప్రత్యేకంగా వ్రాయదలచి అప్పుడు వ్రాయలేదు. నాగరికత ప్రబలినతరవాత సుబ్బమ్మ అనే పేరు సుభద్రగాను, లచ్చమ్మ అనేపేరు లక్ష్మిగాను మారినట్లే కోతిపిఱ్ఱలమామిడికి ఇప్పుడు సువర్ణరేఖఅనే పేరువచ్చింది. నేతిబీరకాయలో ఎంత నెయ్యి ఉందో ఈ సువర్ణరేఖ మామిడిపండులోకూడ అంతటి సువర్ణమే ఉంది. కాని కవులకు నేతిబీరకాయఅంటే లోకువ, సువర్ణరేఖఅంటే గౌరవము. ఒకరినిచూస్తే తిట్టబుద్ధి, ఒకరినిచూస్తే పెట్టబుద్ధి. ఏయూరు ప్రాంతాలలో సువర్ణరేఖ అనే ఒక భోగంది ఉంది. ఆమె శరీరము ఎంత సువర్ణచ్ఛాయతో ఉన్నా, ఆమె ఒంటిమీద నగలరూపముగా ఎంతటి విలువగల సువర్ణముఉన్నా ఆమెకీ ఈ సువర్ణరేఖ మామిడిపళ్ళకీ ఏమీ సంబంధం లేదనే నిజం చెప్పడంచేత కొందఱు రసికమిత్రులతో నాకు విరోధంవచ్చినా నేను భయపడను.

మామిడిపండు ఫలరాజమని మొదట్లోనే మనవిచేసి ఉన్నాను. కాబట్టే మహారాజులుకూడా వాటి పేళ్లతో తమకు అంటుళ్ళు పెట్టుకున్నారు. సంగీతం అంటే

కక్కసించుకునే ఔరంగజేబు చక్రవర్తికూడా ఒక జాతి మామిడిపండుకు తనపేరు తగిలించ్చాడు. అతని వివాహాల్లో ఒకటి మామిడిచెట్టుక్రిందనే జరిగింది. ఆ సంగతి జ్ఞాపకం ఉంచుకోడానికి అలడీమామిడిపండ్లకు తనపేరు ఇచ్చాడేమో తెలియదు. మన్మథుడికి మామిడి చెట్టుతో సంబంధం ఉంది కాని అతని పేరిట పరగే మామిడిపండు ఒకటికూడా లేదు. గాంధిగారి ఉపవాసం, పూనాపాక్టు సందర్భంలో ఆయనకు ఎరవాడజయిలులోని ఒకమామిడిచెట్టు సంబంధం తగిలింది. కాని-గాంధి యూకలిప్టస్ ఆయిల్, గాంధిమార్కు ఇంగువ, గాంధిమార్కు సిగరెట్టులు మొదలైనవి ఉన్నాయిగాని గాంధి పేరుతో మామిడిపళ్ళు లేవు. మహాత్ముడి పేరు తాల్చడానికి ఇంగువ, యూకలిప్టస్ ఆయిల్, సిగరెట్టులు చేసిన పాటి తపస్సైనా మామిడిపళ్ళు చేయలేదేమో!

తుంది మొంగలాయిచక్రవర్తులకు మామిడిపళ్ళకు ఎందుచేతనోగాని చాలాసంబంధం కనిపిస్తోంది. రాజ్యనిర్మాణం అడావిడిచేత కాబోలు బేబరుదృష్టి మామిడిపళ్లమీదికి పోలేదు. అడవులవెంటతిరిగిన హుమాయూన్ కూడ మామిడిపళ్లకు తనపేరు ఇద్దామని తలచలేదు. మొంగల్ చక్రవర్తులలో మేటిఐన అక్బరుపేరుతో ఒక మామిడిపండుకూడా లేదు. మొంగలాయిల రాజసభకే దర్బార్ అనిపేరు. ఆ దర్బార్ ఇపుడు మామిడిపళ్ల రూపంగా మనకుమిగిలిఉంది. అక్బరుతరువాత అందరు మొంగలాయి చక్రవర్తులు తమతమ పేళ్లతో ఒక్కొక్క జాతి మామిడిపండును వెలయించారు. జహంగీరుమామిడి, షాజహాన్ మామిడి, బాహదూర్ షా మామిడి వగైరాలు ఎన్నయినా ఉన్నాయి. పూర్వకాలంలో అర్గురుచక్రవర్తులు, పదార్వురు రాజులు పరిపాలనచేసినా వారివారిపేళ్ళతో ఒక్కొక్క మామిడిపండుకూడా లేదు. కాబట్టే 'కారే రాజులు, రాజ్యముల్ కల్గవే, వారేరీ, భూమిపై పేరైనం గలదే' అని వారినిగూర్చి కవులు అనగల్గుచున్నారు. అశోకుడు, హర్షవర్ధనుడు, బిందుసారుడు, సముద్రగుప్తుడు, గౌతమిపుత్రుడు మొదలగు మనచరిత్రకాలపు రాజులు శిలలపై తమనామాలు ఉట్టంకితం చేయడానికి ప్రయత్నించారే కాని మామిడిపళ్లపై చేయడానికి ప్రయత్నించలేదు. కారణం దురూహ్యంగా ఉంది. రాళ్లమీద ఉండినమోజు వారికి పళ్లమీద లేకపోయిందేమో! తురకపేళ్ళు పెట్టుకున్న ఔరంగజీబ్, జహంగీర్, షాజహాన్, బహుదూరుషా మామిడిపళ్లను మడికట్టుకుంటేగాని తిననోల్లని పూర్వాచారప్రియులు కొందరున్నారు. మరి వారు శంకరాచార్యులవారి పేరు ఒకజాతి మామిడిపళ్లకు ఏల పెట్టించరో తెలియకుండా ఉంది.

మామిడిపళ్లు, వాటిపేళ్లనుగూర్చి ఆలోచించే ఈ సమయంలో మగవాళ్లు ఆడవాళ్లకు చేసిన అన్యాయం స్పష్టంగా తెలుస్తోంది. ఒక్క 'సువర్ణరేఖ'కు తప్ప మిగిలిన మామిడిపళ్లకు దేనికీకూడా ఆడవాళ్ళపేళ్ళు లేకపోవడం ఘోరమైన అన్యాయం అనక తప్పదు. శారద అనీ, భారతి అనీ, సరస్వతి అనీ, సఖి అనీ, కల్యాణిఅనీ, రెడ్డిరాణి అనీ ఆడవాళ్ళపేళ్ళు తమ పత్రికలకు పెట్టుకుని తమస్త్రీజనాభిమానాన్ని ప్రకటించే పత్రికాధిపతులు కూడా ఎవరూ ఈఘోరమైన అన్యాయం తొలగించడానికి ప్రయత్నించకపోవడం శోచనీయమైందే. అసలు మనకవులుకూడా మామిడిపళ్ళకీ, మహిళాజనానికీ ఉపమాలంకారశోభ కలిగించలేదు. మారేడుకాయల్ని, దానిమ్మకాయల్ని, గజనిమ్మకాయల్ని, ఇంకా కొంచెం పెద్దరూపాన్ని సూచింపవలసివస్తే దబ్బకాయల్ని మనస్త్రీల విషయంలో ఉపమాద్రవ్యాలుగా గ్రహించారు కాని మామిడిపండ్లను గ్రహించలేదు. ముదిరితే పొడుంబుర్రలుగా మాత్రం పనికివచ్చే మారేడుకాయల్ని, వైద్యులు సకృతుగా పథ్యపువస్తువుల్లోమాత్రం చేర్చే దానిమ్మకాయల్ని, ఊరగాయపెట్టుకోడానికి కూడా పనికిరాని గజనిమ్మకాయల్ని, పసుపుపచ్చగా పండినా పులుపువిడువని దబ్బకాయల్ని స్త్రీల అవయవాలతో పోల్చి మన పురుషకవులు రుచివిస్తారంగల మామిడిపళ్ళను వారి ధరిదాపునా రానియ్యకపోవడంలో గొప్పకుమ్మక్కు ఉండితీరాలి. తిరుపతి వెంకటకవులుమాత్రం ఒక కందపద్యంలో మామిడిపండ్లలో జహంగీరు ఎట్టిదో స్త్రీలల్లో వెంగుళూరు

సాగరత్నం అట్టిదని వర్ణించారు. ఇంతకుమించి స్త్రీలకు, మామిడిపండ్లకు సంబంధంగల వర్ణనలేవీ మనకవులు చేసినవి నేనుచూడలేదు. నూర్జహానుకు దాసుడుగా ఉండిపోయిన జహాంగీరు తనపేరు ఓ జాతిమామిడిపండుకు పెట్టి నూర్జహానుపేరు మరోదానికి పెట్టలేకపోయినాడు. చనిపోయిన తన భార్య ముంతాజు జ్ఞాపకార్థము కోట్లువెచ్చించి టాజ్ మహాల్ కట్టించిన షాజహాన్ తనపేరు ఓ జాతిమామిడిపండుకుపెట్టి ముంతాజు పేరు మరోదానికి పెట్టలేకపోయినాడు. మద్యం ముట్టని మతజీవి అనే పేరుపొందిన ఔరంగజేబు చక్రవర్తి కూడా ఒకసారి పెళ్ళాం బలవంతంమీద మద్యం తాగడానికి సిద్ధపడ్డాడు. ఉల్లంఘింపరాని నియమాన్ని కూడా పెళ్ళాంకోసం ఉల్లఘింప తయారుపడ్డ ఔరంగజేబు తనపేరు ఓమామిడిపండుకు ఇచ్చి తన పెళ్ళాంపేర ఓజాతి మామిడిపండు వెలయించడానికి వెనక్కు తీశాడు. తాను ఎంతప్రేమించినా ఆడదానికి పేరువస్తుందంటే స్వార్థపరుడైన మగవాడు పూర్తిగా ఓర్చలేడు. కాని రోజులన్నీ ఒకమాదిరిగా ఉండవు. ఇంక పురుషుడి పప్పుఉడకదు. స్త్రీలుకూడా ముందుకు వస్తున్నారు. ఈ విషయంలో వారింక జాగ్రత్త పడగలరు.

నీలాలు అనీ, చెఱుకురసాలనీ ఇత్యాదిగా పేర్లుగల కొన్ని మామిడిపళ్ళు ఉన్నాయి అవి చాలామందికి బాగా పరిచయమైనవే. కాని వాటిలో ఎంత నీలం ఉందంటే కాని, ఏ చెఱుకురసం ఇల్లా ఉంటుందంటే కాని చెప్పగలవారు ఎవరూఉండరు. నాకు, మా బంధువులలో కొద్దిమందికిమాత్రం తెలిసిన పేర్లుగల కొద్ది మామిళ్ళు ఉన్నాయి. వాటి పేర్లు మొదలగు వివరాలు చెప్పినతరువాతకూడా అవి తినాలనేవాంఛ మీకు కలిగితే శాంపిల్ పోస్టులో కొన్నిపంపగలను. నాకు, మా బంధువులకుమాత్రం తెలిసిన మామిడిపండ్లలో శ్రేష్ఠమైనది పసుపుముద్దల మామిడి. ఇది తెనాలి తాలూకాలో మాబంధువు లొకరింట ఉంది. చెట్టునఉండగానే కాయలు పసుపుపచ్చగా కనిపిస్తాయి. అందుచేతనే వానికి ఆపేరు నేనుపెట్టాను. టెన్నిసుబంతికి రబ్బరుమీద గుడ్డ ఉన్నట్లు ఈ మామిడిపండుకు టెంకమీద తొక్క ఉంటుంది. టెంకకి తొక్కకీ మధ్య సర్వవ్యాపియైన గాలి దూరడానికికూడా సందుఉండదు. టెంకలోపల మాత్రం సగను జాస్తిగాఉంటుంది. అందుచేత పండు తూకానికి ఏమీ లోపంఉండదు. ఇవ్వడానికి ఇష్టం లేకపోయినా నేనూ ఇవ్వక తప్పని చోట్లకు పంపడానికి బాగా అక్కరకువచ్చే ఫలరాజములలో వీటికి మించినవి ఉండవని నిరాఘాటంగా చెప్పవచ్చును.

నాకు మా బంధువులకుమాత్రం తెలిసిన మామిడిపండ్లలో మరి ఒకరకం కాసేచెట్టు రాజమండ్రితాలూకాలో మా తోడల్లుడుగారింట్లోవుంది. పండు పెద్దది, టెంక చిన్నది, పీచుఅన్నదిలేదు, రసం నీళ్ళకంటె పలచనగా ఉంటుంది. అన్నీ సుగుణాలే. నోట్లో పెట్టుకుంటేమాత్రం వసకొమ్ముల గాఢకషాయం. దీనికి మా మఱదలు వసమామిడి అని పేరుపెట్టింది. నేనుమాత్రం గొంతుకులపిసుగుడు మామిడి అని అంటాను. శాంపిల్సు కావలసినవారు ఏ పేరు ఉదాహరించినా అవి పంపబడడంలో ఏమీ తికమక ఉండదు. దగ్గడం అభినయించాలనుకునే కోపనలగు కొత్తకోడళ్ళకొఱకు ఇవి ప్రత్యేకం సృష్టింపబడ్డాయని తోస్తుంది.

నాకు, మా బంధువులకుమాత్రం తెలిసిన మామిడి పండ్లలో మూడోరకం కాసేచెట్టు నరసాపురం తాలూకాలో మా పెత్తల్లిగారి దొడ్లోఉంది. దాన్ని లోకజ్ఞానంగల పెద్దవాళ్ళు వరహాలమామిడి అనీ, అమాయికులగు పిన్నవాళ్ళు బుడతలమామిడి అనీ అంటారు. ఒక టిన్నరకుంచాల సన్నావాలు పట్టేబుట్టలో ఈ పండ్లు ఒకసారిపోసి లెక్కించగా రెండువేల ఏడువందల ఎనభైయారు లెక్కకొచ్చాయి. పనసకాయనిచూచి పెద్ద ఉమ్మెత్తకాయ అనుకున్న మా గుంటూరు మిత్రుడు గుర్రాజు ఈ పండ్లనుచూచి ఒకజాతి రేగుపండ్లు అనుకున్నాడు. భూతఅద్దాలు పెట్టుకుని రిస్టువాచీలు బాగుచేసే కళ్ళకి ఇవి గచ్చకాయలంత పెద్దవిగా కనిపిస్తాయి. ఇతరులు వీన్ని చేతులతోతాకి స్పర్శవల్లనే—నేత్రములతో పనిలేకుండా—కనుక్కోవచ్చు. ఇవితిని కడుపునిండించుకుని త్రేనుపు తెప్పించుకోడానికి చేసే ప్రయత్నం కెరటాలు తగ్గింతరవాత సముద్రస్నానం

చేర్పాలనే వాడిప్రయత్నంలాంటిది. బుర్ర-పోట్ల కసీసతూకం సగానికిసగం తగ్గించి రేటు మామూలుకి రెట్టింపుచేసినా ఈ పండ్లను కాంపిల్ పోస్టులో తెప్పించుకునేవారికి మూడుకాన్లకు మించినవ్యయం కాదని నేను నిరాఘాటంగా చెప్పగలను.

ఇట్టివికాక ఏ పేరులేకుండా ఉన్న మంచిపండ్లు కూడా దేశంమీద చాలా ఉన్నాయి. మనల్ని పరిపాలించిన మొగలాయి చక్రవర్తులు కొన్నిపండ్లకు తమ నామాలు ఇచ్చారు. మన ప్రస్తుతప్రభులుకూడా ఆ పండ్ల చక్రవర్తులమార్గం అవలంబిస్తే వారి ప్రియవాదితనానికి మరొక నిదర్శనం ఏర్పడుతుంది. విక్టోరియా పేరుతోగాని, ఎడ్వర్డు పేరుతోగాని చెలామణి అయ్యే మామిడిపళ్ళు లేవు. శ్రీజార్జి సార్వభౌములేనా ఒక జాతి మామిడిపండుకు తమపేరు ఇవ్వడం వాంఛనీయం. మద్రాసులోని బ్లాక్‌టవున్‌కు జార్జిటవున్ అని తమ పేరిచ్చి శ్రీ సార్వభౌములు హిందూదేశజుల యెడ తమకుగల ప్రేమ, అభిమానాన్ని తెలియజేశారు. ఒక జాతి మామిడిపండుకుకూడా తమపేరిచ్చి భారతీయులయెడ తమకుగల ప్రేమ, అభిమానాన్ని ద్విగుణీకృతంచేయడం మంచిది. బొంబాయినుంచి విరివిగా మామిడిపండ్లను దిగుమతిచేసికొని ఆంగ్లప్రజలు ప్రస్తుతం ఆ ఫలరసాస్వాదనముచేస్తున్నారు. కాబట్టి వారు, వారి మంత్రులు సార్వభౌములను ఈ విషయమై విన్నవింతురుగాక! శ్రీ జార్జిసార్వభౌములు కనక ఒక హిందూదేశపు మామిడిపండుకు తమపేరు ఇచ్చినట్లయితే ఇంక గాంధిగారు భారతదేశవిషయంలో ఆంగ్లేయులకు హృదయంలో మార్పురాలేదని పదేపదే చెప్పడానికి వీలులేకుండా పోతుంది.

—ఎ. శేషాచలపతి, బి.ఏ.

## ఆంధ్రభూమి చందావివరము.

| | | |
|---|---|---|
| సంవత్సరమునకు | ... | రు. ౩-౦-౦ |
| అర్థసంవత్సరమునకు | ... | రు. ౧-౮-౦ |
| నాలుగు మాసములకు | ... | రు. ౧-౦-౦ |
| విడిసంచిక | ... | రు. ౦-౪-౦ |

# నీలనీరదదేహా! నన్నేలుమయ్య

౧

బాలగోపాలమూర్తివై లీలఁజూపి
గోలఁజేయకుమయ్య నే గోల, నాట,
మానసం బెంతయేనియు మార్దవంబు
మోహరూపంబు మానుమీ పున్నెమబ్బ.

౨

నీదు మోహనగానంబు నాదుచెవులఁ
బడినయంతనె వచ్చితి పతిని విడిచి,
పతియు తల్లియు తండ్రియు గతియు నీవె
యంచుఁ దలచుచునుంటి నోయబ్జనాభ!

౩

తరతరాలనుఁ జేసిన తపము లేక
జన్మజన్మాలఁ జేసిన చైదమొక్కొ?
మానసాహ్లాదకరభవన్మాననీయ
రూపవైభవ సత్కళా రూపమయ్య.

౪

హద్దులేని సంసారమా? వద్దు నాకు,
లలితయౌవన సంపదా? వలదు నాకు,
భావిభాగ్యంపు ప్రాప్తమా? భరము నాకు,
జన్మరాహిత్య భాగ్యమే చాలు నాకు,

౫

చిరము నాకుండినట్టి సంబరము నేఁడు
నిన్నుఁ జూచినయంతనే సన్నగిల్లె,
భావ భవభావమాలికా౽భావనైతి,
మోక్షసామ్రాజ్యమే నాకు మూటఁగట్టి
నీలనీరదదేహా! నన్నేలుమయ్య!

—జమిలి నమ్మాళ్వారు.

# విడ్డూరములు

## §. మనుష్యులనుండి కోతులుపుట్టినవి

కోతులనుండి మనుష్యులు పుట్టిరని డార్విన్ మొదలగువారు సిద్ధాంతీకరించియున్నారు. కాని ఆఫ్రికాలో నివసించుచున్న ఒకజాతివారి నమ్మకములో మనుష్యుల నుండియే కోతులు పుట్టినవగుచున్నవి. ఈ విషయమై ఆజాతివారిట్లు చెప్పుదురు: "చాలకాలమునకు ముందు ఈ కోతుల పూర్వీకులు మనుష్యులుగా నుండిరి. ఆమనుష్యులు అప్పులపాలై జనవిరోధులయిరి. ఆ కారణమున జనపథములందు నివసింపజాలక అడవులనుబట్టిరి. మాటాడుట మానివైచిరి. చెట్లమీద నివసించుచు కాయకసరులు తినుచు ఉండుటచే వారు క్రమముగాఇట్లు కోతులైరి." ఇట్టి నమ్మకముయొక్క ఉనికిని అచట పనిచేయుచున్న ఒక మిషనరీ - ఆర్. హెచ్. సి. గ్రాహమ్ - అనువాడు కనుగొనెను.

## §. కుక్కలు నడుపు రైలుబండి

అలాస్కాయందలి నోమికి ఉత్తరమున తొంబది మైళ్ళవఱకు కేవలము కుక్కలచేతనే లాగబడు రైలు బండిగలదు. కుక్కలచే లాగబడు రైలు ప్రపంచమున అది ఒక్కటియే. ఎనిమిది కుక్కలు పావుటన్ను తూకముగల సామానుగల బండిని రోజుకు నలుబది మొదలు ఏబది మైళ్లవరకు లాగును. ఈబాటకు 'డాగ్ మెంటైల్ రోడ్డు' అనిపేరు.

## §. ౫౭౯ భాషలలో ముద్రింపబడిన పుస్తకము

గతవత్సరము బ్రిటిష్ ఫారిన్ బైబిలు సొసైటీ వారు 10,452,788 బైబిలు పుస్తకములను పంచిపెట్టిరి. ఇవి ప్రపంచము నందలి 579 వివిధభాషలలో ముద్రింపబడినవై యున్నవి.

## §. నయాగరాజలపాతము ఎట్టబడ్డది

జలపాతమప్పుడు అన్నటినీరు సాధారణముగ స్వచ్ఛమగు ధావళ్యమున నొప్పుచుండును. ప్రపంచము నందలి జలపాతములలో అతి ప్రసిద్ధివహించిన నయాగరాజలపాతము ఉన్నట్టుండి ఒకనాటిరాత్రి జపాశోణమైనది. మరునాటి ఉదయమున జనులు దీనినిచూచి నెత్తురు కాల్వలు కట్టుచున్నదని భ్రమసిరి. పరీక్షమీద నది ప్రవాహమున ఒకచోట జేగురురాళ్ళు బయలుపడి ఆనీటికి కీరంగునిచ్చినవని తెలిసినది. ప్రజలీఎర్రరంగు నీటి పతనమును చూచుటకు విశేషముగ వచ్చుచున్నారు.

## §. అమెరికన్ కోటీశ్వరులలో నాల్గవవాడు

మెలన్ అనువాడు అమెరికాసంయుక్తరాష్ట్రము నందలి కోటీశ్వరులలో నాల్గవవాడు. ఇప్పటి అతని మొత్తపుఆస్తి విలువయొక్క మదింపు 200,000,000 పౌనులు. 1926-వ సంవత్సరమున అతని కూతురు ఎయిల్సా వివాహమయ్యెను. అప్పుడు అతడు ఆమెకు 2,000,000 పౌనులకు ఒకచెక్కు నిచ్చెను.

## §. పోస్టుకార్డుమీద 60,040 మాటలు

ఆంగ్లదేశపు దంతవైద్యుడొకడు పోస్టుకార్డు మీద ఒకతట్టున 60,040 మాటలను పట్టించెను. బల్గేరియా దేశస్థుడొకడు ఒక పోస్టుకార్డుమీద 12,000 మాటలు పట్టించెను. బ్రుసెల్సునందొకడు ఒక పోస్టుకార్డుమీద నెపోలియను జీవితమంతయు పట్టింపగలిగెను. జెరూసలెమ్ విశ్వవిద్యాలయపుపుస్తకభాండాగారమునందు ఒక పోస్టుకార్డు భద్రపరుపబడియున్నది. ఆ కార్డుమీద హీబ్రూ భాషలో 11,867 మాటలు లిఖింపబడినవి.

## §. లండన్ హైడ్ పార్కు ట్రాఫిక్

లండన్ హైడ్ పార్కు ట్రాఫిక్ సమ్మర్దముగలది. అచట పండ్రెండు గంటలలో సగటున 81 857 బండ్లు రాకపోక లొనర్చును. అందు మోటార్లు 53 550 బస్సులు 8,500. సైకిళ్లు 7,870. గుఱ్ఱపు బళ్లు 1282. మోటారు సైకిళ్లు 621.

# మణిమాల

## యుద్ధానంతరము మగపిల్లల పుట్టుక హెచ్చు

ఒకజర్మనుశాస్త్రవేత్త తీవ్రపరిశోధనలుగావించి యుద్ధానంతరమున, యుద్ధకాలమునను ఒకదేశమున పుట్టు శిశువులలో మగపిల్లలు హెచ్చుగానుందురని కనుగొనినాడు. యుద్ధకాలమున సైనికుడు కొద్దికాలపు విశ్రాంతికి ఇంటికివచ్చుట,అతనిభార్య గర్భముదాల్చుట వీనివిషయమై కొన్నిలెక్కలను తయారుచేసినాడు. భర్త తన్ను ప్రేమించుదానికంటె భార్య తాను భర్తను ఎక్కువగప్రేమించుచో ఆ దంపతులకు మగపిల్లవాడు కలుగును. భార్య తన్నుప్రేమించుదానికంటె భర్త తాను భార్యను ఎక్కువగప్రేమించుచో ఆ దంపతులకు ఆడపిల్ల కలుగును. ఆడపిల్ల లేక మగపిల్లవాడు కలుగుట ఇట్లు ప్రేమప్రభావముపై ఆధారపడియుండును. యుద్ధకాలమునగాని యుద్ధానంతరముగాని ఒకదేశమున మగపిల్లలు హెచ్చుగ కలుగుటకు ఈ ప్రేమ ప్రభావమే కారణము. చిరకాలము విడివడియుండి కలిసికొనియుండుటచే యుద్ధకాలపుదంపతులు అన్యోన్యము గాఢముగ ప్రేమింతురు. అందును భర్త యుద్ధమున వీరకృత్యములు గావించి వచ్చియుండుటచే భార్యకు భర్త అనిన ప్రేమాభిమానములు విశేషించియుండును. కావున అట్టి సమావేశఫలముగ ధరింపబడిన గర్భమున ప్రాయకముగా మగబిడ్డడే కలుగును. ఇది సిద్ధాంతము చేసి చెప్పవచ్చునని ఆ జర్మను శాస్త్రజ్ఞుడు తెలుపుచున్నాడు. —బర్త్ కంట్రోల్ రెవ్యూ.

* * *

## మహారాజుల దినవారపు ఖర్చులు

"సప్తమ ఎడ్వర్డు చక్రవర్తిగారి దినవారపు ఖర్చులకు దేశీయా దాయమునుండి 40,500 పౌనులు వెచ్చింపబడెను. విక్టోరియా మహారాణిగారి దినవారపు ఖర్చులకు 40,000 పౌనులు వ్యయముచేయబడెను. ఆమెగర్త ప్రిన్సుకాన్సర్టు దినవారపు ఖర్చులకు 6,000 పౌనులును, నాల్గవ విలియముయొక్క అంత్యక్రియలకు 16,000 పౌనులు వెచ్చింపబడెను. చరిత్రకు తెలిసిన మహారాజుల దినవారపుఖర్చులలో పెద్దమొత్తము జర్మనుచక్రవర్తి మొదటి విలియము చనిపోయినపుడు వ్యయముచేయబడెను. ఆ సమయమున సామ్రాజ్యపుకేంద్రప్రభుత్వమువారు తమఖజానానుండి 100,000 పౌనులును, బెర్లిను మహానగరసంఘమువారు 86,000 పౌనులును వెచ్చించిరి. ఇంగ్లండుదేశమున నడచినవానిలో విశేషధనవ్యయము వెల్లింగ్టన్ సేనాని అంత్యక్రియల సందర్భమున నయ్యెను. అపుడు ప్రభుత్వమువారు 100,000 పౌనులను ఖర్చుచేసిరి. ఆంగ్లదేశ మెఱిగిన గొప్పనావికోత్తముడు నెల్సను అంత్యక్రియలకు ఆంగ్లప్రభుత్వము 50,000 పౌనులను ఖర్చుపెట్టెను." అని మొన్న ఈనడుమ మరణించిన బెల్జియము రాజు అంత్యక్రియల వ్యయమునుగూర్చి ప్రస్తావించుచు 'మాంచెస్టర్ గార్డియను' వ్రాసినది. —మద్రాస్ మెయిల్.

* * *

## శాస్త్రపరిశోధనా చమత్కారములు

న్యూటన్ మహాశయుడు, సీమరేగుపండు కథ పలువురకు తెలియును. న్యూటన్‌కు పూర్వము చెట్టునుండి ఎన్నియో సీమరేగుపండ్లు రాలియున్నవి. ఎందఱో బాలురు ఆ రాలుటను చూచియు ఉన్నారు. కాని ఆ సీమరేగుపండు పతనమువలన 'గ్రావిటీ' సిద్ధాంతమును ఒక్క న్యూటన్ మహాశయుడే కనుగొనియున్నాడు. మన గడియారములు కనుగొనబడిన విధానముయొక్క చమత్కారము తమకు తెలియునా? గడియారములను తొలుత కనుగొనినది గ్యాలిలో అనువాడు. అత డొకసారి పీసాయందలి పేరుకెక్కిన చర్చికివెళ్ళెను. దైవప్రార్థనపై అతనిమనము లగ్నము కాలేదుగాని అతనినేత్రములు అచటి ల్యాంపుయొక్క చలనముపై నిలిచెను. ఇటు అటు ఊగుటలో ఆల్యాంపు

పుచ్చుకొనుచున్న సమయమును తనచేతియందలి నాడి కొట్టుకొను చలనమానమును బట్టిలెక్కించి ఆల్యాంపు మామూలుగ ఊగు దూరమునకు ఎంతసమయములో ఊగుచున్నదో ఆదూరమున ఒక్కింతతగ్గినకూడ అదే సమయమును పుచ్చుకొనుచుండుటను నిర్ధరించెను. ఈ నిర్ధారణకు ఫలముగా అతడు పెండ్యులమును కనుగొన్నాడు. మనకు గడియారములు వచ్చినవి రైలు ఇంజనుల ఆవిరి శక్తిని కనిపెట్టిన జేమ్సువాట్ పరిశోధనకు బీజము వంటపాత్రపైమూత ఆవిరికి లేచిపోవుచుండుట చూచుటయే. సామాన్యులు అట్లు మూతలేచిపోవుచుండుట గమనించి లేని లోపల కూరఏమియైనామాత్రము పొల్చుకొనియుందురు కాని జేమ్సువాట్ అదిచూచియే ఆవిరియంత్రమును కనిపెట్టినాడు. ఇప్పుడు చాలమందికి మలేరియాజ్వరమునకు క్వినైన్‌నకుగల సంబంధము తెలిసియేయున్నది. కాని ఆదిలో క్వినైన్ మలేరియాకుమందు అని కనిపెట్టినది ఎవరు? అతడీ విషయము ఎట్లు కనిపెట్టెను? ఈ విషయము చాల చమత్కారమైనది ఒకడాక్టరు ఒకసారి మలేరియాజ్వరమునకు పేరుమోసిన ఒక అడవికి వెళ్ళవలసివచ్చెను. వెళ్ళిన కొద్దిదినములకే అతనికి మలేరియాజ్వరము తగిలెను ఆ అడవిలో సింకోనాచెట్లు (క్వినైన్ ఉత్పత్తిచేయబడుచెట్లు) అతివిస్తారము. ఆ చెట్లఆకులతోడను, పట్టతోడను నిండియున్న ఒక చెలమలోని నీళ్ళతో అతడు దాహముతీర్చుకొనువాడు. ఒకసింకోనాచెట్టుక్రింద పరుండెను. వర్షముకురిసెను. ఆ వాననీరు ఆ చెట్టు ఆకులమీదనుండిజారి అతని మొగము మీదను నోటిలోను పడెను. ఇందుచే ఆ డాక్టరుకు కొంతజ్వరము తగ్గెను. ఇక తరువాతికథ చెప్పనక్కఱ లేదు. నేడు భారతదేశమున పోస్టాఫీసులు క్వినైన్ అమ్ముచు ఒకమాదిరి ఆసుపత్రులుకూడ నైయున్నవి. చలిజ్వరమువచ్చినచో నేడు డాక్టరు రోగికి చెమటు కలుగువఱకు క్వినైన్ ఇచ్చుచున్నాడు. కొన్నిసంవత్సరముల క్రితమువఱకును హిందూదేశమున నీలిచెట్లనుండి నీలిమందు తయారుచేయబడుచుండునది. అది మనదేశమున ఒక ప్రధాన పరిశ్రమకూడనైయుండెను. తన లాబరేటరీలో ఒకజర్మనుశాస్త్రజ్ఞుడు కృత్రిమపు నీలిమందు తయారుచేయ తలపెట్టెను. ఎన్నియో ప్రయత్నములుకావించెను. కాని నెగ్గలేదు. విసుగువచ్చి తన పరిశోధన విడనాడుటకు ఆతురపడుచుండెను. అతని అదృష్టము బాగుండుటచేతను, హిందూదేశము దురదృష్టము బయటపడుదినములు వచ్చుటచేతను ఆసమయమున అతని థర్మామీటరు పగిలెను. అందుండి పాదరసముజారి అతడు నీలిమందు తయారుచేయకూర్చియుంచిన పదార్థములయందు పడెను. తోడనే రంగుతయారయ్యెను. అతడుపైచిన పాళ్ళలో పాదరసము ఒక్కటి లోటుగానుండెను. ఆలోటు ఈ ప్రమాదముచే భర్తీయయ్యెను. హిందూదేశపు నీలిరంగు వర్తకమునకు శాస్త్రజ్ఞుని థర్మామీటరు పగులుట గొప్పదెబ్బ అయ్యెను. ప్రపంచమున నేడు ప్రతి పెద్దపట్టణమునందును విద్యుచ్ఛక్తి సౌకర్యములుగలవు. ఫెరాడే అనువాడు విద్యుచ్ఛక్తి కనుగొనిన మహాశయుడు అతడు విద్యుచ్ఛక్తి కనుగొనిన విధానము అతివిచిత్రమైనది. అతడు జంతుశాస్త్రజ్ఞుడుగా ఉండెను. కప్పలు, నత్తలు మున్నగు జంతువులను కోయుచు పరిశోధనలు సాగించుచుండువాడు. ఒకనాడు ఒకకప్పను డైసెక్టుచేయుచు అతడు దానిరెండుకాళ్ళలో ఒకదానిని జింకురేకుతోడను మఱియొకదానిని రాగిరేకుతోను స్పృజించెను. చచ్చిఉండినకప్ప విచిత్రముగ ఎగిరిపడెను. రెండూ రాగిరేకులైనపుడు కాని రెండూ జింకురేకులైనపుడు కాని ఇట్లుకాలేదు. ఒకటి రాగిరేకు రెండవది జింకురేకు ఐనపుడు ఈ విచిత్రసంఘటనము సంభవించుచుండెను. రాగి జింకులవలన విద్యుచ్ఛక్తి పుట్టింపవచ్చుననుట ఈ కప్పవలన అతడు కనుగొనెను. నేటినాగరికప్రపంచ మెఱిగిన అద్భుతములలో ఎక్సురే ఒకటి. ఒకడు విద్యుత్కిరణములనుగూర్చి పరిశోధించుచుండెను. ఒకానొక రసాయనిక పదార్థముతో మలామా చేయబడిన ప్లేటు ఒకటి టేబిలుమీద పడియుండెను. విద్యుత్కిరణముల ట్యూబ్ ప్రమాదవశమున ఒకసారి ఆప్లేటుమీద పెట్టబడెను. ఆ ప్రమాదమే ఎక్సురే కనుగొనబడుటకు ఆధారమయ్యెను. మానవుల ఎముకలు విరుగుట మొదలగు ప్రమాదముల నిజస్థితి ఎఱుంగుటకు నేడు ఎంతయోసహాకారిగానున్న ఎక్సురే మొదటఇట్లొక ప్రమాదమువలన కనుగొనబడుట వింతయైనదికాదా? —అవర్ మాగజిన్.

# ఇన్స్యూరెన్సు విషయములు

## జీవితపు భీమా : కొన్ని ఆలోచనలు

[ఈ వ్యాసమును రచియించిన శ్రీ జమలి నమ్మాళ్వారుగారు ఆంధ్రులకు సుపరిచయమైయున్న 'జై భారత్' ఇన్సూరెన్సు కంపెనీ మేనేజింగు డైరక్టర్లు. ఆంధ్రమున కవిత చెప్పనేర్చిన పాండిత్యమును, ఆంగ్లమున మంచి ప్రవేశమునుగల వీరు ఒక పెద్ద ఇన్సూరెన్సు కంపెనీకి మేనేజింగు డైరక్టర్లుఅయి ఆర్జించిన భీమా వ్యాపారానుభవమును మా ప్రార్థనపై వ్యాసరూపమున ఆంధ్రుల కర్పింప సమకట్టినారు. తేట తెనుగున చెప్పబడిన ఇందలి విషయములు విశేషజనాదరణమును బడయగలవని మా నమ్మకము.—సంపాదకుడు.]

### పరిచయం

లక్ష్మి చంచలస్వభావము కలదన్నమాట అందఱకు తెలిసినదే. కాని నాగరకత బలసిన ఈరోజులలో లక్ష్మి యొక్క చంచలత్వానికి వేగము చాలా హెచ్చయింది. ఈ వేగమువల్ల పాడయ్యే సంసారాలకు, వ్యక్తులకూ కొంత సహాయభూతంగా వుండడమే 'జీవితభీమా' యొక్క స్వభావం.

జీవితభీమా డబ్బు అంతా పోయి, కష్టాలువచ్చినప్పుడు అక్కరకు వస్తుందనీ—వృద్ధాప్యంలో సంపాదన లేనప్పుడు పోయిన కాలంగడపుటకు వీలుకలిగిస్తుందనీ—బాగా సంపాదించి భార్యాపుత్రులను పోషించే రోజులలో, ఏవ్యాధో నోటబెట్టుకపోతే, తనపై ఆధారపడియున్నవాండ్లు నాల్గుకొంగులుముడివేసి వీధిలోనికి బయలుదేరకుండా అడ్డమువస్తుందనీ—ప్రజలు బాగా గ్రహించారు.

పాతకంపెనీలకు వ్యాపారం హెచ్చింది. క్రొత్త కంపెనీలు బయలుదేరినాయి. చిన్నచిన్నలకు పెట్టుబడి లేని బేరమైంది.

దేశాభిమానము పేరుతోను, కులాభిమానం పేరుతోను పెద్దపెద్దలకు యీ కంపెనీలే జీవనాధారలైనాయి. మేనేజింగు డైరెక్టరు పేరుతోను, కంపెని ఏజంటు పేరుతోను, ప్రజల అభిమానంతోను, యీ కంపెనీలు దినదినాభివృద్ధికి వస్తున్నాయి. కులంపేర్లు పెట్టుకొని కొన్ని, దేశముపేరుపెట్టుకొని కొన్ని, ఇంకా అనేక వేషాలతో వ్యాపారం సాగిస్తున్నాయి. కంపెనీలు పెద్దవి అవుచున్నకొద్ది, యుద్యోగస్తులకు జీతాలు, భాగస్తులకు లాభాలు పెరుగుతున్నాయి. కంపెనీలో చేరిన పాలసీదార్లకు సదుపాయాలు మాత్రము సన్నగిల్లుచున్నాయి.

ఈ వ్యాసకర్త యుద్దేశము కంపెనీలను విమర్శించడము కాదు. పాలసీదార్లకు కొన్నిసలహాల నివ్వడము మాత్రమే. వయస్సులోను, ప్రపంచకానుభవములోను, భీమావ్యాపారములోను, యీ వ్యాసకర్త చాల చిన్నవాడు. అయినప్పటికి కొద్దికాలంనుంచి బాధ్యతగల ఉద్యోగములో వున్నందువల్ల కలిగిన అనుభవాలను-యిందును గురించి యింగ్లీషు పత్రికల్లోఉండే గొప్ప విషయాలని క్రోడీకరించి భీమాతత్వాన్ని గురించి, వాటి

సాధక బాధకముల గురించి తేటతెలుగున కొన్ని వ్యాసాలు వ్రాయడమువరకే అతోలివంతు.

మంచిచెడ్డల నిర్ణయంచేయడం పాఠకులవంతు.

ఈవిషయము చక్కగా విమర్శించి వ్రాయడానికి చాలారోజులు పట్టుతవి చాలాపేజీలు నిండుతవి. కనుక ఈవిషయమును భాగములుగ విభజించి నెల కొకభాగముచొప్పున ప్రకటింపవలె నని వ్యాసకర్త తలంపు.

తత్వము :

భీమాఅంటే ముందురాబోయ్యే కష్టాలను అడ్డుకో డానికి ప్రస్తుతము జాగ్రత్తపడడము. లోకంలో అన్ని కష్టాలలోకి దారిద్ర్యకష్టం చాలాగొప్పదనే విషయం కష్టాలుపడిన వాండ్లకు- కష్టాలు పడుచున్నవాండ్లను చూడడమునకు కండ్లుకలిగిన లక్ష్మీపుత్రులకు తెలియ నిదికాదు. పెద్దలు "కృషితో నాస్తిదుర్భిక్షం" అన్నారు. అంటే వ్యవసాయంచేసే రైతుకు కరువు లేదన్నమాట. (అయితే అదికూడా అబద్ధం అయింది లెండి. ప్రస్తుతం వ్యవసాయదారుడు పడేఅవస్థ మరె వ్వరికీ లేదు.) అంటే కష్టపడేవానికి కష్టములేదన్న మాట, ఎన్నాళ్ళవరకు? కష్టపడునన్నాళ్ళు ! తరవాత? ఏమో !

"వయసానవేన" అనికూడా అన్నారు. వృద్ధా ప్యము నిమిత్తం వయస్సులోనే జాగ్రత్తపడమన్నారు. కాళ్లుచేతులు ఆడినరోజుల్లో సంపాదించేదానిలో కొంత దాచుకోమన్నారు. అట్లా కొద్దికొద్దిగా దాచు కొన్న పైకము పెద్దమొత్తమై సంపాదన పడిపోయిన రోజుల్లో ఉపయోగానికి వస్తుందని అభిప్రాయం.

తన సంపాదనలో మిగిల్చిన కొద్ది మొత్తములను క్రమేణా వృద్ధిచేయడమునకు చాలా మార్గాలున్నా యి. 1 వడ్డీకి అప్పులుయివ్వడం, 2. భూములు వగై రాలు కొనడం, 3. బాంకీలో వేయడం, 4. జీవితమును భీమాచేయడం. ఈ నాల్గింటిలో నాల్గవది చాలాశ్రేష్ఠ మైనదని చెప్పడం యీభాగముయొక్క యుద్దేశ్యము.

ఈ యభిప్రాయాన్ని లోకంలో అన్ని దేశాల పెద్దలు బలపరస్తున్నారు. ప్రపంచం పుట్టినప్పటినుంచి మొదటి రెండుపద్ధతులు పరంపరంగా వస్తున్నాయి. బాంకీలో వడ్డీకి నిలువచేసికొనడం మొదటిపద్ధతిలో నిదేకాని, బాంకీలు ప్రజలుదగ్గఱ వడ్డీకి పైకంతీసికొని, తిరిగి కావలసినవారికి ఎక్కువ వడ్డీలకు అప్పులిస్తూ వారి వద్ద దాచుకొన్న వారికి వాయిదానాటికి తప్పకుండా పైకంయివ్వడం అనేకారణంచేత, ప్రజలలో నమ్మకం చాలాహెచ్చుగా కలిగి, ప్రజాజీవితంలో బాంకీలు ఒక ముఖ్యసంస్థగా ఉన్నాయి.

ఇక నాల్గవపద్ధతి విచారిద్దాము. అనగా భీమాపద్ధ తిలోవున్న మెరుగు తెలిసికొందాము. ప్రస్తుతం మూడు సంవత్సరాలుగ వ్యాపారమాంద్యం, ఆర్థికకష్టములు ప్రపంచాన్ని ఉఱ్ఱూతలాడిస్తున్నాయి. అన్నిదేశాల లోను భాగ్యవంతమనిపించుకొన్న అమెరికా మొదలు కొని, బీదదైన భారతదేశమువరకు, ప్రజలు అల్లాడి పోతున్నారు. ఉన్నవాండ్లవద్ద డబ్బు హెచ్చుగా మూలుగుచున్నది. లేనివాండ్లు కష్టపడి పనిచేసికొంటు న్నారు. మధ్యరకంవారు మాడిపోతున్నారు.

ఈ స్థితిలో భీమాపద్ధతి ఏలా శ్రేష్ఠమైందో తెలిసి కొందాము. గతమూడు సంవత్సరాల్లో, ఎన్నో బాం కీలు దివాలాతీసినాయి. వ్యాపారాలెన్నో బందైనాయి. భూములధరలు, పంటలధరలు తగ్గిపోయి, వ్యవసాయం చేసేరైతుకు కడుపునిండా కూడు లేకుండా పోయింది. తెచ్చినబాకీ తెచ్చినట్లు యిద్దామని మంచియభిప్రాయం వున్నవాండ్లుకూడా, బాకీలు తీర్చలేకపోతున్నారు. చిరాస్తులు, మేడలు, మిద్దెలు నాల్గోవంతు ధరకు కూడా కొనేవాండ్లులేరు కాని జీవితం భీమాచేసినవారి పాల సీకిమాత్రము ధరతగ్గలేదు. (పాలసీఅంటే సంవత్సరానికి యింతచొప్పున కంపెనివారికి పైకం తప్పకుండా చెల్లి స్తూవస్తే, అలా చెల్లించేవ్యక్తి అకస్మాత్తుగా చనిపోయి నపుడుగాని లేక నిర్ణయమైన గడువుమిమ్కటగాని, అను కొన్న మొత్తాన్ని యిచ్చేస్తామని కంపెనివారు వ్యక్తికి వ్రాసియిచ్చే పత్రం. పాలసీని పొందినవాడు 'పాలసీ దారుడు' అనబడును. పాలసీఅనగా పాలసీదారునకు కంపెనీకి జరిగిన ఖరారునామా అన్నమాట) ఒక్క యిన్సూర్యెన్సుకంపెనీ దివాలాతీసినదని విన లేదు.

పాలసీదారులు చనిపోవుటవలన గాని, నిర్ణయమైన కాలము ముగియుటవలన గాని అనుకొన్న ప్రకారం పైకం చెల్లించవలసి వచ్చినపుడు, చెల్లించుటకు శక్తిలేక పోయిన కంపెనీ యింతవరకు కనపడదు. కాబట్టి దీని గొప్పతనాన్ని నిరూపించుటకు యింకేమి కావాలి?

ఇందులో పుణ్యం, పురుషార్థం రెండువున్నాయని చెప్పవచ్చు. చూడండి మనలో ఎవరైనా ఒక బీదవాడు చనిపోతే, వాడి అంత్యక్రియలకు సహాయపడడం, మామూలు పుణ్యకార్యములకంటె గొప్పదని భావిస్తారు. భీమాపద్ధతికూడా చాలావరకు యింతే. అయితే వ్యక్తి ప్రతిసంవత్సరం నిర్ణీతమైన మొత్తమును చెల్లించుట లేదా? యీ మొత్తాన్ని బాంకిలో దాచుకుంటే రాదా? అనవచ్చు. దానికి దీనికి చాలా భేదముంది.

ఒకడు భీమాచేసేయెడల, తాను యివ్వవలసిన మొత్తాన్ని (అనగా సంవత్సరమునకు నూరురూపాయలు అని ఉదాహరణకు ఊహిద్దాము) బాంకిలో వడ్డీకి వేస్తాడనుకోండి. అతడు మూడుసంవత్సరాలు అయిన తర్వాత అకస్మాత్తుగా చనిపోయినాడనుకోండి. అతని వారసులకు బ్యాంకివారేమి యిస్తారు? అతను చెల్లించిన రూ. 300 లును, వడ్డీక్రింద సుమారు రూ. 24 లు కలిపి యిస్తారు. కాని యిదేవ్యక్తి సంవత్సరమునకు రూ. 100లు చెల్లించే పద్ధతిమీద రూ. 2000 లకు భీమాచేసి యున్నట్లయితే, మరణముపొందినపుడు కంపెనీవారు రూ. 2000 వారసులకుగాని, సదరువ్యక్తి ఆ మొత్తము ఎవరికి చెందాలని వ్రాసిచనిపోతాడో వారికిగాని యిస్తారు. రెండింటికి వున్న భేదము యిది.

ఇప్పుడొక సందేహము తట్టవచ్చు: అంతా యిలా చనిపోయే వాండ్లయితే, కంపెనివాళ్ళెలాయిస్తారీ మొత్తాలని. దానికి సమాధానము చెప్పుచున్నాను. ఈ విధమైన పరస్పరసహాయవ్యాపారం (భీమావ్యాపారం) పుట్టి యిప్పటికి మూడువందల ఏండ్లైంది. అప్పటినుంచి యిప్పటివరకు యీ వ్యాపారమును నిర్వహించినధికారులంతా తమతమకాలములలో అనుభవాల్ని, కష్టసుఖాల్ని రాబోయ్యే సంతతివారికి మార్గదర్శికంగావుండడానికి పుస్తకరూపకంగా క్రోడీకరించారు. వాటినిబట్టి భీమాకంపెనీలలో చేరేవాండ్లలో చాలమంది దీర్ఘకాలం బ్రతికియుంటారని, కొలదిమందిమాత్రమే మధ్యలో చనిపోతారని నిర్ణయించారు. అందువలన దీర్ఘకాలం జీవించువారు చెల్లించుమొత్తాలన్నీ పోగుచేసి, సక్రమమైన పద్ధతులతో వడ్డీకివేసి పెద్దఆస్తులు వగైరాలుకొని, వృద్ధిచేసి, అకస్మికమరణ మొందిన సభ్యుల సంసారములకు సహాయం చేయగలుగుచున్నారు. అంతా ఒకపర్యాయము చనిపోవడం మహాప్రళయంలో సంభవిస్తుంది. అప్పుడు మనకు డబ్బు, యితరుల సహాయం ఏమియు అవసరము ఉండవు.

భీమాచేస్తే త్వరగా పోవలసివచ్చునను సందేహము మరియొకటి. మనము త్వరగా చనిపోగూడదు. చనిపోవలయునని కోరగూడదు. మనమెల్లరము శతవృద్ధులము కావలయునని కోరవలసినదే. అందులకన్ని యత్నములను చేయవలసినదే! కాని మనమెందరనో, దుర్మరణముల పాలగువారిని చూస్తున్నాముకదా? అకస్మిక ప్రమాదములు సంభవించినపుడు తెల్లబోవుట కంటె ముందుగా మేలుకొనుట యుత్తమము గదా!

దీర్ఘకాలము బ్రతికియుంటే పాలసీదారునకు వడ్డీ గిట్టుబాటవుతుందా? అని మూడవసందేహం. వడ్డీ విషయంలో ఒకచిన్నమాట. వడ్డీకి ఆశపడి ఎందరు షావుకార్లు, మారువాడీలు చెడిపోయ్యేరో చూచేరా? మరిన్ని పారమార్థికంగాచూస్తే దీనికి జవాబు పైనవ్రాసినాము కదా! ఈ వడ్డీలలోనుంచే, త్వరగాచనిపోయినవారి కుటుంబాలకు సహాయంచేయుచున్నామన్నమాట. అదిగాక మనము వేలకువేలుపోసి కట్టేయిండ్లకు ఎంతవడ్డీ వస్తుంది? మన సంసారయాత్రలో అవి ఎంతముఖ్యమైనవో, జీవితభీమా అంతముఖ్యమని గమనించాలి.

గుడులు, గోపురాలు కట్టిస్తే, సత్రాలు కట్టిస్తే, పుణ్యం అన్నారు. విశ్వాన్నిసృష్టించి పరిపాలించే దేవునికి మనగుళ్ళు, గోపురాలు కావాలనా? అందులో వున్నసూక్ష్మం ఏమిటంటే మనం సంపాదించే ధనంలో కొంతభాగం పరోపకారానికి ఖర్చుపెట్టాలని. భీమా చేయడం అనేవిషయంలో కూడా ఈ సూత్రంవుంది.

—జమిలి నమ్నాళ్వారు.

# "ఆంధ్రభూమి" పుస్తకపీఠము

## ౭౯. చెన్నపట్టణములో

తెనుగున వెలసిన స్వతంత్రములైన నవలలో నిది యొకటి. కర్తలు శ్రీయుత వేమూరి శ్రీనివాసరావుగారు బి. ఏ., బి. యల్. సోమసుందరుడు కథానాయకుడు, ప్రియంవద అతని భార్య. మగని మనసులో వర్తించు అకులకాంతపైగల ప్రేమకంటె అతనికి శశిరేఖ అను వితంతువిద్యార్థినిపై మోజు హెచ్చుఅయ్యెను. ఆమె నిత్యసందర్శనమునకై అతడును చెన్నపట్టణములో చదువు పెట్టెను. చెన్నపట్టణములో ఆంధ్రవిద్యార్థుల విద్యార్థిజీవితము ఈ నవలయందు విపులముగను, చక్కగను వర్ణింపబడినది. శశిరేఖ స్వభావము తెలిసికొనుటకు 'పునర్వివాహాలోచన, సంస్కారము, ఆకస్మికదర్శనము' అను ప్రకరణములు చదివినచాలును. ఆకస్మికదర్శనము అను ప్రకరణమున శశిరేఖయు, సోమసుందరుడును వంటపూటియింటినుండివచ్చిన కారియర్ భోజనమును తినుచున్నప్పటి వారిసంభాషణలు అతిచమత్కారముగను రసవంతముగను ఉన్నవి. ఇక ప్రియంవద సుస్వభావమెట్టిదగుటకు 'ఆరాత్రి, పిలుపు, అనుమానము' అను ప్రకరణములు పఠింపనగును. 'సంక్షోభము' అను ప్రకరణములోని క్రిందియుత్తరము ప్రియంవదను ప్రత్యక్షముచేయుచున్నది. "నే నిదివఱకు ఉత్తరములు వ్రాసియెఱుగను. ఎవరి కెట్లు వ్రాయవలెనో నాకు దెలియదు. ఈ యుత్తరమునకు మీ రేమందురో యను భయముకూడ కల్గుచున్నది. ఎంతమనస్సు సమాధానపెట్టుకొనినను నాకు వ్యాకులమే కలుగుచున్నది. కాబట్టి మీ రేమనుకొన్నను సరేయని యీ యుత్తరము వ్రాయసాగితిని. కాని నేను వ్రాయబోవు సంగతులు నేను వ్రాయదగినవి కావు; నేను వినదగినవే కావు. మిమ్ముల నెఱిగినదాననగుటచే ఆవార్తలను నమ్మలేదు. కాని నలువురును అట్లే పలుకుచుండుటచే నామనోస్థైర్యము తగ్గుచున్నది. అవియే యసత్యములైనచో నేను అదృష్టవంతురాలినే. అవి యసత్యములేయని మీ వలన వినగోరెదను. త్వరలో నట్లే వింటినేని తిరుపతివేంకటేశ్వరున కారాధనచేయించెదనని మ్రొక్కుకొంటిని. నేను మొన్నటినుండియు శనివారవ్రతము చేయుచుంటిని. నేను వినినమాటను వ్రాయుటకే నాకు జేయాడకున్నది. చతురికకూడవచ్చి వారింటిలో నట్లే చెప్పుకొనిరని నాకుఁజెప్పినది. మిమ్ముల నెవ్వరో చెన్నపట్టణములో జూచి వచ్చిరట. మీతోగలసి నా వయస్సుగల యువతి చదువుకొనుచున్నదట; ఆమెకును మీకును ప్రాణస్నేహమట. ఇంక నేదేదో చెప్పిరి. ఇది నిజమగునా? పాపము, అబిడ నిర్దోషిణి కావచ్చు; ఆమెను గూర్చి యట్లుపలుకుట ఎంతపాతకమో!! మీకు నేను జెప్పఁగలదానను గాను, మీరుచేసినదానిని గాదనలేను. మీ కెయ్యది సంతోషము, సౌఖ్యము కలుగఁజేయునో దానినిజేయుటే నావిధి. మీ చిత్త మాకర్షించి యుంచుకొనుటకును, మిమ్ము ప్రేమించుటకును, మీచే ప్రేమింపబడుటకును నా కెంతఆశయు అధికారమును గలవో మఱియొకరికిని నంత యుండవచ్చు. నేను లేదనలేను. కాని మిమ్ములనే నమ్ముకొని నన్ను మీకర్పించుకొంటిని వారమునుండి నాకు నిద్రాహారములులేవు. అత్తగారును మామగారును జిన్నబోయి యుండుచున్నారు. మిమ్ములను రమ్మని వ్రాసినారట. మిమ్ము జూచువఱకును నాకును దోచదు —ప్రియంవద." ప్రారంభించినది మొదలు కడముట్ట చదువవలెను విడువబుద్ధి పొడమని తెనుగు నవలలో దీనినితప్పక చేర్పనగును. డెమ్మి సైజున 270 పుటలు. వెల రూ 1-4-0. గ్రంథములు దొరకుచోటు: శ్రీకనుపర్తి మార్కండేయ శర్మగారు,

82 పూనమల్లి హైరోడ్డు, కీల్‌పాక్ పోస్టు, మదరాసు.

### ౮౦. శ్రీ భావసంవత్సర గంటలపంచాంగము

గొట్టిముక్కల సుందరరామశాస్త్రి సిద్ధాంతి గారిచే గుణింపబడినది. సుప్రసిద్ధ ఆయుర్వేదవైద్యులును బెజవాడయందలి మృత్యుంజయఫార్మసీ పొప్రయిటరులును అగు శ్రీ కూడూరు వేంకయ్యన్న గారిచే ప్రకటింపబడినది. జేబునందిముడు చిన్నసైజున ముద్రింపబడియున్నది.

### ౮౧. ఆత్మత్యాగి

ఆహారనిరశన వ్రత దీక్షనుదాల్చి ఆత్మత్యాగ మొనర్చి వీరస్వర్గ మలంకరించిన జతీంద్రదాసు పవిత్ర జీవితమును గానముచేయు ఉత్తమగ్రంథము. శ్రీ ఆదిత్య ప్రసన్నరాయలచే హిందీభాషయందు రచింపబడిన మృత్యువిజయీ జతీంద్రదాసు జీవితసంగ్రహము' అను గ్రంధమున కిది తెనుగుసేత. జతీంద్రునివంటి త్యాగధనుల జీవితములు సారస్వతమునకు అలంకారములు కాగలవు. ఇట్టి ఉత్తమగ్రంథమును సులభశైలిలో అనువదించిన శ్రీ కూచిభొట్ల ప్రభాకరశాస్త్రి గారిని, ప్రచురించిన శ్రీ గోమూర్తి కాశీవిశ్వనాధము గారిని ప్రశంసింపవలసియున్నది. క్రౌనుసైజున 92 పుటలు. వెల 0-5-0 అణాలు. ప్రతులకు గ్రంథప్రకాశకులపేర తెనాలి వ్రాయునది.

### ౮౨. క్లైవు చరిత్రము

శ్రీ గోదావరి సత్యనారాయణగారు బి. ఏ. రచియించినది. భారతదేశమున ఆంగ్లరాజ్యస్థాపనకు పునాదిరాయివైచిన పరాక్రమశాలియగు రాబర్టుక్లైవు జీవితకథ ఈ గ్రంథమున ప్రస్తరింపబడినది. జీవిత చరిత్రలు వాఙ్మయమున కొకముఖ్యాంగములుగ పాశ్చాత్యసారస్వత విమర్శకులు అంగీకరించియున్నారు. తెనుగు సారస్వతమున మాత్రము ఈ ముఖ్యాంగము పుష్టినందియుండలేదని చెప్పుటకు సందేహములేదు. అట్టిచో జీవిత చరిత్రశాఖకుచెందిన ఈ గ్రంథము భాషాభగవతికి వన్నెగూర్చు వానిలో నొకటియనవచ్చును. జననాదికముల గూర్చిన వృత్తాంతకథనముతో సంతృప్తినందక రావుగారు ఈ గ్రంథమున క్లైవు గుణవిమర్శనము, అంతర్యశోధనము గావించియున్నారు. ఎడనెడ ఆంధ్రకావ్యముల నుండి యథోచితములగు రసవంతములైన పద్యరత్నముల నేర్చికూర్చి గ్రంథస్థవిషయములను ఆకర్షణీయ మొనరించిరి. మదరాసు టెక్స్టుబుక్కు కమిటీవారి గ్రంథమును పుస్తకభాండాగారములందుంప నమవైన గ్రంథమని నిర్ణయించియున్నారు. పుస్తకము డెమ్మిసైజున 132 పుటలు. వెల రు 0-8-0. వలయువారు ప్రస్తుతము కృష్ణాజిల్లా కైకలూరునందు సబ్‌రిజిష్ట్రారుగనున్న గ్రంథకర్తగారికి వ్రాయనగును.

## కొత్త పత్రికలు

### ౨౧ చంద్రిక

తెనుగున ముద్దులు మూటగట్టు అచ్చునకు పట్టము నొందిన ఆనందముద్రణాలయమునకు స్వామిదారులును, తెనుగువారి మాక్మిలన్‌కంపెనీ అనదగిన ఆర్. వేంకటేశ్వర్ అండుకో యజమానులును అయిన శ్రీయుత వి. ఎ. కేశవ్ చంద్రగారు ప్రచురించుచున్న 'చంద్రిక' యను నూతనసచిత్రమాసపత్రిక యొక్క మార్చి ఏప్రియలు సంచికలు మా కార్యాలయ మలంకరించినవి. మార్చి సంచికలో 'వరూధిని' అను త్రివర్ణచిత్రమును, ఏప్రియల్ సంచికలో 'ప్రియనిరీక్షణము' అను త్రివర్ణచిత్రమును తిలకచిత్రములుగా ఒప్పుచున్నవి. ఇతర చిత్రములును విరళములై యున్నవి. మొదటి సంచికలో డాక్టరు చిలుకూరి నారాయణరావుగారు, సీరపి ఆంజనేయులుగారు, ముద్దా విశ్వనాథముగారు, బులుసు వేంకటరమణయ్యగారు, తుళ్లా విశ్వనాథశాస్త్రిగారు, ఈ. భావ్యకాచార్యులుగారు, బొడ్డు బాపిరాజుగారు మొదలగు ఆంధ్రపండితప్రకాండులు విషయగౌరవము గల వ్యాసములను వ్రాసి చంద్రికను శుభారంభము గావించియున్నారు. రెండవసంచికలో లవంగిదళాలు, అహల్యాకల్యాణము, జేమ్సుఫెర్గుసన్ జీవితము, భావసంకీర్తనము. మహామంత్రి తిమ్మరుసు, భగవద్గీత కృష్ణుడు భారతకృష్ణుడుకాడా? మొదలగు వ్యాసములు సంచికకు రుచిపుష్టిని గూర్పజాలియున్నవి. కేవలము సారసత్వవిషయములను ప్రచురించుటతోడనే సంతృ

ప్పి.శక చంద్రిక సంపాదకులు 'వింతవార్తలు, ఆరోగ్య విషయములు, హా! హ్హా! హ్హో!!!' మున్నగు విషయములనుగూడ ప్రచురింపగడంగినది ఎంతయు మెచ్చుకొనదగియున్నది. పెద్దముద్రణాలయము, వలసినంత ధనసంపద, వ్యాపారానుభవము మున్నగు సకలసౌకర్యములు సమకూడియున్న ఆనందముద్రణాలయాధిపతులు 'చంద్రిక' ద్వారా ఆంధ్రభాషాసేవచేయగడంగుట ఒకవిధముగా ఆంధ్రుల యదృష్టమనవచ్చును. ఈ నూతనసచిత్రమాసపత్రికకు సాలుచందా నాలుగు రూపాయిలు. విడిసంచిక ఆరుఅణాలు. చంద్రిక ఆంధ్రులకు విజ్ఞానచంద్రికయై చిరకాలము మనుగాకయని మనఃపూర్వకముగ కోరుచున్నాము. చిరునామా: చంద్రిక ఆఫీసు, లాన్ స్క్వేర్, మద్రాసు.

## ౨౨. నవ్వులరాణి

హాస్యవల్లరి, నవ్వులమూట, నవ్వులతోట మొదలగు హాస్యవిషయిక మాసపత్రికలు తెనుగున కొన్నిలోగడ బయలుదేరి కొద్దికాలమునడచి నిలిచిపోయినవి. తెనుగు హాస్యవిషయికమాసపత్రికల చరిత్రలో 'వినోదిని' ప్రారంభము ఒకగొప్పవిషయము కాగలదు. అంతకుముందు తేరగవచ్చినగాని పత్రికలను పట్టకుండిన తెనుగువారు 'వినోదిని' వచ్చినతరువాత పత్రికనుకొని చదువుటను నేర్చుకొనినారు. వినోదవిషయములను చదువుటలో నేటి తెనుగువారుచూపుచున్న కుతూహలమును గమనించి బందరునందలి కె. కోటీశ్వరలింగముగారు 'నవ్వులరాణి' అను నామమున ఒక క్రొత్తనవ్వుల మాసపత్రికను వెలువరించుచున్నారు. మార్చి మాసమున వెలువడిన తొలిసంపుటపు రెండవసంచిక విమర్శనార్థము మా కార్యాలయమునకు పంపబడినది. ఈ సంచికయందలి వ్యాసములన్నియు హాస్యవర్ధకములై యున్నవి. హాస్యవర్ధకములగుటయేగాదు సభ్యములై కూడ నున్నవి. నలుగురు ఒక్కచోకూర్చుండి బహిరంగముగ చదువుకొని ఆనందింపవచ్చును. శుచియైన ఇట్టిహాస్యము ప్రోత్సహింపదగినది. సాలుచందా ఒకరూపాయి. విడిసంచిక రెండుఅణాలు. చిరునామా: రాబర్టుసన్ పేట, మచిలీపట్టణము.

## ౨3. ప్రజాసేవ

ప్రతిశుక్రవారము నెల్లూరునుండి ప్రకటింపబడువారపత్రిక. సాలుచందా నెల్లూరులో రు. 1-8-0; వెలుపల రు. 2-0-0. సంపాదకులు ఘాలి సుబ్బరామయ్యగారు. ఈ పత్రిక మొదటి సంపుటపు నాలుగవసంచిక 13-4-34 తేదీని వెలువడినది. మా కార్యాలయమునకు పంపబడినది. మండలవార్తలతోడు 'ఆంధ్ర విశ్వవిద్యాలయము' మున్నగు విశాలాంధ్రదేశమునకు చెందిన విషయములను గూర్చిన చర్చలును ప్రచురింపబడుచున్నవి. 'ఆంగ్లపుట' యొకటి విశేషము. పత్రికాప్రచురణమున ప్రస్తుతము నెల్లూరు మండలము తెలుగుమండలములకన్నిటికిని తలమానికమై యున్నదని చెప్పవచ్చును. 'ప్రజాసేవ' ఈ కీర్తిని నిలుపునని నమ్ముచున్నాము.

## . ౨౪. ఆరామ ద్రావిడ

ఆరామద్రావిడులలో సంతశ్శాఖామైత్రికి దోహదము నొసగుట ఈ పత్రిక ముఖ్యోద్దేశము. ప్రథమసంచిక ఏప్రియల్ మాసమున వెలువడెను. శాఖాంతర ప్రముఖులు వ్రాసిన వ్యాసములుగూడ గైకొని పత్రికాసంపాదకులు తమవిశాలహృదయమును వ్యక్తపఱచిరి. పత్రిక డెమ్మిఆక్టోవో సైజున అనగా పుస్తకముసైజున నున్నను ముద్రణము సుందరముగనున్నది. సాలుచందా రు. 1-8 0. విడిపత్రిక రెండుఅణాలు. సంపాదకులు పురాణపండ రామమూర్తిగారు. చిరునామా: కాకరపఱ్ఱు, పశ్చిమగోదావరిజిల్లా.

## ౨౫. హిందూ కాలేజీ మాగజైన్.

బందరునందలి హిందూ కాలేజీపక్షమున వి. ముత్తు అయ్యర్ ఎం. ఏ. యల్., టి గారి సంపాదకత్వమున వెలువడు పత్రిక. ఆంగ్లమునను, ఆంధ్రమునను, సంస్కృతమునను వ్రాయబడిన వ్యాసములతో పత్రిక నిండారియున్నది. తమ కళాశాలపక్షమున ఇట్టి యుత్తమపత్రికను ప్రచురించుచున్న కళాశాలాధ్యక్షులు కె. శివరామకృష్ణరావు (ఎం. ఏ., యల్. టి) గారిని ఎంతయు కొనియాడవలసియున్నది. చిరునామా. ది ఎడిటర్, హిందూకాలేజి మాగజైన్, హిందూకాలేజి, మచిలీపట్టణము.

# సంపాదకీయ సమాలోచన

## ఆంధ్రుడొకడు లామెంబరైనందుకు:—

ఇన్నినాళ్ళకు ఆంధ్రుడొకడు లామెంబరైనాడు. చాలగ సంతోషింపదగు విషయము. తమిళులగు సి. పి. రామస్వామి అయ్యరు లామెంబరుగానుండిన రోజులలో తన పలుకుబడినంతయు నుపయోగించు మెట్టూరుప్రాజెక్టునిర్మాణము ప్రారంభింప జేసి తనజాతివారిచిరకృతజ్ఞతకు పాత్రుడైనాడు. ఇపుడు ఈఆంధ్రలామెంబరుకూడ తన జాతివారి చిరకృతజ్ఞతకు పాత్రుడుకావలసియున్నది. అగుటకు అతడుచేయవలసిన కృత్యమెట్టిది? రాజకీయనిర్బంధితులకు మజ్జిగ ఇప్పించుటకాదు. ప్రస్తుతము రాజకీయ నిర్బంధితులు తక్కువగా నున్నారు. ఉన్న కొలదిమందియు కొలదికాలములో విడుదలగాంతురు. కావున నేడీఆంధ్రలామెంబరు మజ్జిగనుగూర్చి విచారింపనక్కఱలేదు. అతని దృష్టిఅంతయు ఆంధ్రరాష్ట్రత్వరనిర్మాణముపై లగ్నమగుటయు, అతని దీక్షఅంతయు దానిపై కేంద్రీకరింపబడుటయు ఆంధ్రకల్యాణము కాగలదు. బొబ్బిలిరాజావారు మంత్రులై ఆంధ్రరాష్ట్రవిషయమున ఒక్కింత విముఖత్వమువహించినపుడు శ్రీ రెడ్డినాయుడుగారు ఆంధ్రరాష్ట్రవిషయమై శ్రద్ధవహించి లండనుకూడ బోయివచ్చినారు. ఆంధ్రరాష్ట్ర విషయమున ఆనాడు చూపిన శ్రద్ధనే నేడుకూడచూపి శ్రీ నాయుడుగారు ఆధునికకాలమున ప్రత్యేకరాష్ట్రనిర్మాతలలో కీర్తివిస్తారులైన సర్ ఆలీఇమామ్‌గారి పద్ధతి నవలంబింతురుగాకయని కోరెదము. శ్రీ రెడ్డినాయుడుగారి లామెంబరు హాయాములో ఆంధ్రరాష్ట్ర నిర్మాణము జరుగునేని ఆంధ్రజాతి యుండునంతకాలము వారినామము ఆంధ్రుల హృదయపద్మములను అధిష్ఠించి యుండును.

## సత్యాగ్రహసమరము విరమించుట:—

పూనాసమావేశముననే పలువురు సత్యాగ్రహసమరమును విరమించవలసినదని మహాత్మునికోరియుండిరి. కాని అప్పుడు దానిని మహాత్ముడు విరమించుటకు అంగీకరించలేదు. వ్యక్తిసత్యాగ్రహమును ఉపదేశించినాడు. కాని హిందూదేశమున ఏ ఒక్కరాష్ట్రముకూడ వ్యక్తిసత్యాగ్రహోద్యమమును అందుకొని పనిచేయలేదు. ఈలోగా పరిస్థితులు విచిత్రపరిణామమందినవి. జనులనుండి వ్యక్తులకు, వ్యక్తులనుండి గాంధికి సత్యాగ్రహము పరిమితము చేయబడినది. స్వరాజ్యపార్టీ ప్రారంభమునకు గాంధి అనుమతించినాడు. కౌన్సిలువ్యామోహముకలవారందఱును చంకలు తాటించినారు. వారి సంతోషమునకు అవధిలేకున్నది ఈ అవధిలేని సంతోషములో వారు వచ్చుచున్నఆగస్టు నాలుగవ తేదీని మరచిపోవుచున్నారు. వ్యక్తులనుండికూడ ఉపసంహరించి సత్యాగ్రహభారమునంతయు గాంధిమహాత్ముతు తన ఒక్కడిమీద పెట్టుకొనినాడు. సబర్మతీఆశ్రమమును ఈ నఱకే సంహారముగావించినాడు. ఆతడు గైకొనిన నిర్బంధప్రమాణము ఆగస్టు నాలుగవతేదీతో తుదముట్టును. ఆనాటి ఆతని నిశ్చయము ఎట్టిదిగనుండునో? కౌన్సిలుకు పోవచ్చునను సంబరముతో మనవారు ఆవిషయమై కొద్దిగనైన యోజింపకున్నారు.

మహాత్ముల లీలలు అత్యద్భుతములు. ఎట్టివి విననుంటిమో!


<u>మదరాసు కార్పొరేషను:</u>

<u>ఆయుర్వేదవైద్యాలయము.</u>

మన ప్రాంతమున ఆయుర్వేదము నుద్ధరించిన వైద్యరత్న పండిత గోపాలాచార్యులుగారు, భిషగ్రత్న ఆచంట లక్ష్మీపతిగారు మున్నగు మహాశయులకు మదరాసే కార్యక్షేత్రము. అనగా మదరాసునుండియే నేటి కాలమున ఆయుర్వేదోద్ధరణము జరిగినదన్నమాట. అట్టి మదరాసు నగరమున కార్పొరేషనువారిచే నిర్వహింపబడుచున్న పెక్కు వైద్యశాలలలో ఒక్కటికూడ ఆయుర్వేద వైద్యచికిత్సావిధానమునకు ప్రత్యేకింపబడి యుండలేదని వినుటకు విచిత్రముగ నుండును. కార్పొరేషను వారి వైద్యాలయములలో పెక్కు అల్లోపతిక్ చికిత్సావిధానమునకును, రెండు యునానిచికిత్సావిధానమునకును, ఒకటి సిద్ధచికిత్సావిధానమునకును చెందినవి. ఆయుర్వేదచికిత్సావిధానమునకు చెందినదికూడ ఒకటికలదు. కాని అందు స్త్రీలకు శిశువులకు మాత్రమే మందు లీయబడును. ఆయుర్వేదచికిత్సావిధానము కోరుమగవారికి మదరాసు కార్పొరేషను వివిధ వైద్యశాలలయందు ఒక్కదానియందుకూడ సౌకర్యము లేకున్నది. ఆయుర్వేదవైద్యాభిమానముగల కార్పొరేషను సభ్యులు ఈ విషయముపై ఇప్పుడైన తమదృష్టులను బఱపి తగు చర్యగైకొందురుగాక!

<u>సత్యమూర్తిగారి సత్యస్వరూపము.:—</u>

శ్రీమాన్ సత్యమూర్తిఅయ్యంగారి ఆంధ్రాభిమానము అనేకవిషయములలో వెల్లడికి వచ్చియున్నది. మదరాసు కార్పొరేషను కార్యాలయమునందు ఒక ఆంధ్రునకు రెవిన్యూఆఫీసరు ఉద్యోగము లభింపనున్నపుడు, రాయలసీమ ఆంధ్రవిశ్వవిద్యాలయమున కలియకుండుటనుగూర్చి తీసుమానించుటకు ఏర్పాటుపబడిన సమావేశమునందును వారికి ఆంధ్రులనిన గల ప్రేమాతిశయములు ప్రస్ఫుటములైనవి. వారు మొన్న ద్వితీయ ఉత్కళయువకసమావేశమునకు అధ్యక్షులై ఉపన్యసించుచు ఉత్కళ రాష్ట్రమునుగూర్చి ఇట్లు తెలిపిరి: "శ్వేతపత్రము ప్రకారము విశాఖపట్టణము ఏజన్సీ, పర్లాకిమిడి, గంజాం ఏజన్సీలో జలంత్రమలయ్యా మీరాష్ట్రములో చేరక మదరాసు రాష్ట్రమునకు చెందియుండును. మీరు కోరినట్లు పర్లాకిమిడి, జయపూరు మందాసా, బుడారాసింగు, జాలంత్రమలయ్యా, ఫుల్జుహారు ఒరిస్సాలో కలిపినగాని ప్రత్యేకరాష్ట్రమునకు మీరొప్పుకొని లాభము లేదు. ఒప్పుకొనినను నిర్వహించుట కలలోనివార్త." ఈ ప్రాంతములను మీరాష్ట్రమున కలుపుకొనుటకు మీరు విశేషముగ కృషి సలుపవలయునని సత్యమూర్తిగారు ఈ వాక్యములతో ఉత్కళులను హెచ్చరించుట సులభముగనే తెలిసికొనవచ్చును. ఆంధ్రదేశమునుండి కొంత భాగము పోయినను సత్యమూర్తిగారికి పోవునదియేమి? ఏమియు లేదు. కాని ఆంధ్రులనిన ఇంతటి ఆప్యాయమున వర్తించు ఈ మూర్తిని బట్టుకొని కొందఱు తెనుగునాయకులు ప్రేలాడుటమాత్రము ఆశ్చర్యముగ నుండును ఆంధ్రులు దూరముగ నుంచవలసిన ఈ మూర్తిగారి మాటలు కొందఱు ఆంధ్రనాయకులకు తులసీదళములవలె శిరోధార్యములుగ నుండుటచూడ చాల విచిత్రముగనుండును. కానిదానిని కంచములో పెట్టు తెలివితక్కువను అనుభవము మీదనైన ఆంధ్రులు విడనాడుట శ్రేయస్కరమని మనవిచేయుచున్నాము.



మార్చి, ౧౯౩౮.

౨౩:—ఏలూరు. శ్రీమతి సుక్కమ్మగారు విడుదల నొంది ఏలూరుచేరిరి.

:—గుంటూరు. శ్రీబచ్చు శ్రీరాములుగారు - వర్తకులు, మునిసిపలు సభ్యులు - హత్యగావింపబడిరి.

౨౮:—మచిలీపట్టణము. శ్రీమార్దంగికాచార్య అశ్వధాటి రామమూర్తిగారి షష్టిపూర్తి ఉత్సవము.

౨౪:—మచిలీపట్టణము. తొమ్మిదవ ఆంధ్రదేశ కళావంతుల సంస్కరణసభ. శ్రీ భాస్కర్ల ఈశ్వరుడుగారి అధ్యక్షత

౨౯:—వేలూరు. డాక్టరు పట్టాభి సీతారామయ్యగారు విడుదలనొందిరి.

౩౦:—మదరాసు. న్యాయమూర్తి సర్. వేపా రామేశం పంతులుగారి అధ్యక్షతను ఆంధ్రసభవారు విశ్వనాథము సత్యనారాయణగారికి సన్మానము గావించిరి.

:—బందరు. ఆంధ్ర ఇన్సూరెన్సు కంపెనీ స్వగృహప్రవేశ మహోత్సవము.

౩౧:—మదరాసు. ఆంధ్రోత్కళ సరిహద్దు సమస్య విషయమై ఆంధ్రమహాసభస్థాయి సంఘ సమావేశము.

:—రాజమండ్రి. కొండకోలను-వికసితోత్పల శీర్షిక దళ వసంతోత్సవము.

ఏప్రియల్, ౧౯౩౮.

౧:—మదరాసు. ఆంధ్రపత్రిక 21-వ వార్షికోత్సవము శ్రీ. శే. చల్లా శేషగిరిరావుపంతులుగారి రూపపట ప్రతిష్ఠాపనము.

౩:—మదరాసు. గొల్లప్రోలు పిఠాపురందావా హైకోర్టులో నేడు ప్రారంభమయ్యెను.

:—బళ్లారి. శ్రీగోనుగుంట్ల వేంకట సుబ్రహ్మణ్యము గారి విడుదల.

:—తిరుపతి. కపిస్థలం కృష్ణమాచార్యులుగారు దివంగతులైరి.

౬:—చెన్నపురి. శ్రీ వేమవరపు రామదాసు పంతులుగారి అధ్యక్షతను ఆంధ్రనాయకుల సమావేశమై 'తెలుగు సీమలను ఉత్కళమున చేర్పరాదు' అని తీర్మానించిరి.

౭:—బళ్లారి. శ్రీ స్వామి నారాయణానంద గారి విడుదల.

:—రాజమండ్రి. 'రణదుందుభి' కరపత్రములు పంచినందులకు రుద్రరాజు అచ్యుతరామరాజు, రుద్రరాజు తిరుపతిరాజు, శ్రీపాద స్వామినాథశాస్త్రి గార్ల అరెస్టు.

౮:—తూర్పు గోదావరిజిల్లా పోలవరపు ఆశ్రమము తిరిగి ప్రారంభింపబడెను.

:—నర్సాపురము తాలూకా గ్రంథాలయ సభ. అయ్యంకి వేంకటరమణయ్యగారి అధ్యక్షత.

౧౧:—బెజవాడ. ఆంధ్రస్వరాజ్యపక్షమును గూర్చి శ్రీ వేమవరపు రామదాసు పంతులుగారి ఉపన్యాసము.

౧౨:—స్వరాజ్యపార్టీకి సాయమునర్థించుచు డాక్టరు అన్సారీగారు శ్రీ ప్రకాశం పంతులుగారికి తంతి నిచ్చిరి.

౧౮:—మదరాసు. దక్షిణాంధ్రభాషాభివర్ధనీసభ సమావేశము. కార్యనిర్వాహకుల నేర్పఱచుట.

౧౪:—కంతేరు. గుంటూరుజిల్లా యువజనమహాసభ.

౧౬:—విశాఖపట్టణము. పురజనులను విలాసార్థము ఎక్కించుకొని ఎగురుచుండిన వాయు విమానము సింహాచలపు కొండపై జామిచెట్టుకు తగిలి కూలెను. ప్రాణనష్ట మేమియు లేదు.

## 'ప్రతిమానవుని వైద్యుడు'



# అమృతాంజనము.

ఒక్కటియే మార్గదర్శి : యితర నకలుమందులన్నియు దీని ననుసరించునవియే.

ఒళ్లు నొప్పులకు
నూతన్న జీవులకు
దోమ కాటులకు

గవద బిళ్లలకు
నాడీ వ్యాధులకు
కీళ్ల నొప్పులకు

తప్పక పని చేసి చూపును.

అన్నిచోటులయందు అమ్మబడును.

కోట్లకొలది విక్రయము.

మదరాసు రాజధానికి, మైసూరు రాష్ట్రమునకును
సోల్ ఏజెంటు :
మెసర్సు ఎ. బి. పెరేరు,
చైనాబజారురోడ్డు, మదరాసు.

అమృతాంజనము డిపో
మదరాసు.
బొంబాయి. కలకత్తా.

[టెలిగ్రాము : లీవర్ క్యూరు] [టెలిఫోను నెం. 8139]

ఈ ట్రేడుమార్కును గుర్తింపుడు.



# డాక్టరు జమ్మి వేంకటరమణయ్యగారి ప్రసిద్ధిచెందిన లీవర్ అండ్ స్ప్లీన్ స్పెసిఫిక్.

అద్వితీయము !

అసమానము !

నకలుమందులను విసర్జింపుడు.

"చికిత్సావిధానమున ఒక క్రొత్తమందు."

"మృత్యుముఖమునుండి వేలకొలది శిశువులను రక్షించినది."

"రోగనిరోధమునకు కూడ సాటిలేని మందు."

## పిల్లలకు

కడుపులో బల్ల, గడ్డ, గుల్మం, వాయువు మొదలగు లీవర్ అండు స్ప్లీను (యకృత్ ప్లీహ) అన్నివిధములైన వ్యాధులను లోకప్రఖ్యాతిచెందిన డాక్టరు జమ్మి వేంకటరమణయ్యగారి దివ్యౌషధమును ఉపయోగింపుడు. పిల్లలకు లీవర్ అండ్ స్ప్లీను వ్యాధులు రానీయకుండా చేయుటయేకాక ఆకలి, జీర్ణశక్తులను వృద్ధిపరచి మలబద్ధము లేకుండా కాలవిరేచనము సరిగా అవునట్లును, రక్తమును శుభ్రపఱచుటకు వాడదగిన ఔషధరాజము.

హెడ్ ఆఫీసు :

నెంబరు 8, శాలై వీధి,

మైలాపూర్. మదరాసు.



If your Children *suffer from* **LIVER & SPLEEN COMPLAINTS** *start giving them today*

**JAMMI VENKATARAMANAYYA'S**

**FAMOUS LIVER & SPLEEN SPECIFICS**

8, SALAI STREET,
MYLAPORE,
MADRAS.